ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు

20-6-'51

విషయానుక్రమణిక

20 జూన్ 1951



ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు 12-0-0
విడిపత్రిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును
Founder K NAGESWARA RAO

సంపుటము 43
సంచిక 40
20-6-51

ఖర సంవత్సర జ్యేష్ఠ బహుళ పాడ్యమి బుధవారము

ఆహారధాన్యాల దిగుమతి, క్షామనివారణ

[— తారాప్]

బర్మా, చీనా, రష్యా, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలనుంచి ఆహార ధాన్యాల దిగుమతికి భారత ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడంతో దేశంలో క్షామాన్ని నివారించడానికి అవకాశం కలుగుతోంది భారతదేశంలో కరువులు సంభవించడానికి మూడు ముఖ్యకారణాలు చెప్పబడతాయి 1 పంటలు పాడై ఆహారధాన్యాలు తక్కువ కావడం 2 మిగులు ఉన్నచోట నుంచి కరువు ప్రాంతాలకు సకాలంలో ఆహార సామగ్రి రవాణా కాలేక పోవడం 3 ఆహార సామగ్రి దొరుకుతున్నప్పటికీ ధరలు పెరిగిపోయి, నిరుద్యోగుల నిర్వ్యాప్తి హెచ్చి పేదజనులకు కొనడానికి అందుబాటులో లేకపోవడం

బ్రిటిష్ పాలకులున్న కాలంలో ఏటేటా క్షామదేవత ఏదో ఒక ప్రాంతాన్ని దర్శించి వేలాది ప్రజల్ని పొట్టపెట్టుకొనేది కాని పుట్టిన ప్రతి ప్రాణికీ శారీరకబాధ సహజమూ అనివార్యమూ అయినట్లే, భారత దేశానికీ చీనాదేశానికీ క్షామబాధ కూడా సహజమూ అనివార్యమూ అనే ధోరణిలో మానవులు చెయ్యగలిగేదేమీ లేనట్లు ఆ పరిపాలకులు నిశ్చింతగా ఊరుకునేవారు

మన ప్రభుత్వం స్థాపించబడినది మొదలు ప్రతిచోటా ఏదో ఒక ప్రాంతంలో కరువు సంభవించడం, ఏటేటా రు 150 కోట్లు, రు 200 కోట్లు చొ॥ ఖర్చుపెట్టి విదేశాల నుంచి ఆహారధాన్యాలు దిగుమతి చేసుకుని ఏదో ఒక విధంగా నివారించుకుంటున్నారు ఇంతచేసినా కొన్ని కొన్ని ప్రాంతాలలో కరువు బాధ పూర్తిగా నివారణ కాలేదు ముఖ్యంగా మద్రాసు, బొంబాయి, సౌరాష్ట్ర, బీహారు రాష్ట్రాలలో కరువుబాధ ప్రతిసంవత్సరం వస్తోంది

దిగుమతిచేసిన ధాన్యాలుండి కూడా ఈ విధంగా కొన్నిప్రాంతాలలో కరువుబాధ నివారణకాక పోవడానికి రవాణా సౌకర్యాలలోపం, ధరలు పెరిగిపోవడం కారణాలు

కాబట్టి ఆహారధాన్యాలు దిగుమతిచేసినంతమాత్రంచేత కరువు బాధ పూర్తిగా తొలగిపోతుందని చెప్పకూడదు

ఇంతవరకూ దిగుమతికి ఏర్పాటుచేసిన ధాన్యాలపైనే కేవలం ఆధారపడ్డం సంభవిస్తోంది దేశంలో ధాన్యసేకరణ అనుకున్న విధంగా కొనసాగక పోవడంవల్ల రేషనింగ్ ఎప్పటికప్పుడు భగ్నమయ్యే ప్రమాదం తలచూపడం సంభవిస్తూవచ్చింది. పండినపంటల లెక్కలదారి వేరై, కోరినంత ధాన్యం సేకరించ లేకపోవడంతో బ్లాక్ మార్కెట్ వ్యాపారం విరివిగా వ్యాప్తి చెందింది. ధరలు మధ్యతరగతి వారికి కూడా అందుబాటులో లేనంత పెరిగిపోయినాయి ఇంక కర్షకులు, కార్మికులు పేదలకు కొనుక్కునే తాహతు నానాటికి దిగనాసిల్లిపోయింది అందువల్ల బ్లాక్ మార్కెట్‌లో ఆహార సామగ్రి దొరుకుతున్నప్పటికీ కార్మిక కర్షక వర్గ ప్రజలకు ఆహారం అందుబాటులో లేకుండా పోయింది

కొన్ని దేశాలలో ఈపరిస్థితిలో కొనేవారు కోరనైనా బ్లాక్ మార్కెట్ ధరలు పడిపోవలసిందే కాని మన దేశంలో బ్లాక్ మార్కెట్ వ్యాపారికి తన నిలవ సరుకు చెల్లుబడికాదనే భీతి ఎన్నడూ లేదు

ఈపరిస్థితిలో ప్రభుత్వం సరిగ్గా తలకి 12 ఔన్సుల చొ॥ ఆహారసామగ్రిఅంచనా వేసి మొత్తం లెక్కకట్టి, ఆ ప్రకారం ఆహారధాన్యాలను సేకరించడం, దిగుమతి చెయ్యడం సాగిస్తున్నందువల్ల, 12 ఔన్సుల చొ॥ కంట్రోల్ ధరలకు కొనేవారు కూడా బ్లాక్‌మార్కెట్ పైన ఆధారపడి రోజులు గడుపుకోడం జరుగుతోంది అంతే కాని దిగుమతై వచ్చే లక్షలాది టన్నుల ఆహారధాన్యాలవల్ల దేశంలో ధరలను తగ్గించడం లేదు

పల్లె ప్రాంతాలలో రేషనింగ్ తొలగించిన తరవాత ధరలు పెరిగిన చోటెల్ల చౌకలో ఆహారసామగ్రిని అమ్మించడానికి రిలీఫ్ షాపులను ప్రభుత్వం సమృద్ధిగా స్థాపించలేకపోతోంది

ఇప్పుడు విదేశాలనుంచి సమృద్ధిగా

ధాన్యాలను దిగుమతి చెయ్యడానికి ఏర్పాటయిందనే చెప్పవచ్చును అమెరికన్ ప్రభుత్వం ఇవ్వనున్న 20 లక్షల టన్నులూ రష్యా చీనా బర్మాలనుంచి తెచ్చుకునే ధాన్యాలతో కలిపితే ఈ సంవత్సరం సులువుగా గడిచిపోవచ్చును

కాని దేశంలో ధరలను తగ్గింపచేయ్యాలంటే అవసర సమయాల్లో రిలీఫ్ షాపులను స్థాపించడంకోసం కేంద్రప్రభుత్వం దేశంలో అక్కడక్కడ ధాన్యాలను నిలవ చెయ్యవలసిన అగత్యం ఉంది కాని పండిట్ నెహ్రూ పత్రికా సభా వేళ ప్రసంగంలో కాని, ఆహారశాఖా మంత్రి మున్షీగారి రేడియో ప్రసంగంలో కాని అటువంటి యత్నం జరుగుతుందనే సూచన కనపడదు అవసరమైనంత కాకపోయినా, అల్ప ప్రమాణాలలోనైనా కొరవరాజ్యాలలో ప్రభుత్వాలు నిలువలుఉంచవచ్చును కాని ఇవి బ్లాక్ మార్కెట్ ధరలను తగ్గింప చెయ్యగలవనే ఆశ ఆట్టే కనపడదు

అమెరికానుంచి పదిహేను లక్షలు టన్నులకు పైగా ఈసంవత్సరం భారత ప్రభుత్వం కొని తెస్తోంది ఇది కాక 20 లక్షలు ఇవ్వడం ఋణ పరంగా లభిస్తుంది ఈ సంవత్సరం, అనగా 1951 సంవత్సరాంతంవరకూ పదిలక్షలు, 1952 మార్చి 31 లోగా మిగతా పదిలక్షలూ పంపడానికి అమెరికన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందట అంటే ఈ రవాణా కార్యక్రమం ప్రకారం భారత ప్రభుత్వం తలపెట్టినట్లయితే వచ్చే పంటలో సేకరించే ధాన్యం సహాయంతో భారత ప్రభుత్వం నిలవ చెయ్యడానికి వీలు పడవచ్చును—వచ్చే సంవత్సరం పంటలు బాగాపండినట్లయితే, అప్పుడుగాని ధరలు తగ్గి స్థిరపడగల అవకాశం లేదు ఈ అవకాశమైనా వినియోగపడాలంటే భారత ప్రభుత్వం ఇప్పటినుంచీ అంచనావేసి నిర్ణీత కార్యక్రమాన్ని అనుసరించవలసి ఉంటుంది అయితే ఇటువంటిది చెయ్యగలరని ప్రభుత్వం ఇంకా చెప్పలేదు

నెహ్రూగారు చెప్పినదల్లా ఏమిటంటే ఎప్పటికప్పుడు ఓడల్లో ధాన్యం వచ్చేదాకా నిరీక్షించే అవకాశం ఇంక తప్పిపోతుందని మాత్రమే అన్నారు రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ ప్రమాణాలను 9 ఔన్సులనుంచి 12 ఔన్సులకు పెంచుకోవచ్చునని కేంద్రప్రభుత్వం అనుమతినిచ్చింది కొన్ని రాష్ట్రాలలో అప్పుడే పెంచేశారు మద్రాసు రాష్ట్రంలో జూలైనుంచి పెంచబడవచ్చునని మంత్రి రోచ్ విక్టోరియా గారు చెప్పారు అయితే బియ్యం ప్రమాణం పెంచబడక పోవచ్చును గోధుమలు ఇదివరలో మాదిరిగానే రెండు ఔన్సులు మైలో వగైరా ఒక ఔన్సు చొ॥ ఇవ్వవచ్చు దీనివల్ల మద్రాసు రాష్ట్రంలో రేషనింగ్ అమలులోవున్న ప్రాంతాలలో పరిస్థితి ఆట్టే మారదు ఇప్పుడు ముఖ్యంగా గమనించవలసింది ఏమిటంటే రేషనింగ్ అమలులో లేని పల్లెప్రాంతాలకు ఆహార ధాన్యాలను చురుకుగా రవాణా చేయించి ప్రభుత్వం రిలీఫ్ షాపులను విరివిగా స్థాపిస్తేగాని పేదల ఆకలి తీర్చడం కష్టం బ్లాక్ మార్కెట్ ధరలతో జరుగుతున్న వ్యాపారాన్ని అరికట్టి పేదలకు కావలసినంత ఆహారాన్ని కంట్రోల్ ధరలకు అమ్మగలగాలి అప్పుడే ధాన్యం ధరలు తగ్గగలవు బ్లాక్ మార్కెట్ వ్యాపారులు చాటుగా నిలవచేసి ఇప్పుడు బాహాటంగా ఎక్కువ ధరలకు అమ్ముతున్న ధాన్యం కూడా చౌకలో అమ్మడం పోతేనే కరువు నివారణౌతుంది అంటే దేశంలో కరువు నివారించాలంటే బస్తీలలో రేషనులు సమృద్ధిగా ఇచ్చి బ్లాక్ మార్కెట్ సామగ్రి అక్కరలేకుండా చెయ్యడం ఎంత అవసరమో, పల్లె ప్రాంతాలకు ధాన్యాలను రవాణాచేసి విరివిగా రిలీఫ్ షాపులు స్థాపించి అక్కడ ధరలను తగ్గించడం కూడా అంత ముఖ్యం ఈ రెండు పద్ధతులూ సమన్వయించబడినప్పుడే ధరలు తగ్గి ఆహారం అందరికీ అందుబాటులోకి వస్తుంది

అమెరికా ఆహార ధాన్యాల సప్లై

అమెరికానించి కొన్నదిగాక పైగా 20 లక్షలటన్నుల గోధుమలకు ఋణమివ్వడానికి అమెరికన్ ప్రభుత్వం సమ్మతించింది అంటే గత సంవత్సరం భారత ప్రభుత్వం కోరిన ఋణంకోసం ఆరుమాసాలు తర్జన భర్జనలు అసంగత ప్రలాపాలు అసభ్యవిమర్శలు అసత్య ప్రచారాలు జరిపి ఈనాటికి అమెరికన్ కాంగ్రెస్ సమ్మతించింది భారత ప్రభుత్వం ఆదిలో కోరినట్లు ఋణమే ప్రతిపాదించబడినట్లయితే ఇంత రభస జరిగి ఉండేది కాదేమో కాని ఋణానికి బదులు దానమివ్వాలని అధ్యక్షుడు ట్రూమన్ ప్రతిపాదించడంతో అమెరికన్ రాజకీయ నాయకుల అనవసర ప్రచారానికీ నిందలకూ అవకాశమివ్వబడింది ట్రూమన్ ఆదేశాన్ని తిరస్కరించి, అమెరికన్ కాంగ్రెస్ సగం ఋణంపరంగానూ సగం దానంగానూ ఇవ్వాలని తీర్మానం ప్రవేశపెట్టింది ఈతీర్మానాన్ని సవరణచేసిగాని కాంగ్రెస్‌లోని ఉభయ సభలూ ఆమోదించలేదు ఆమోదించడంలో ఉభయ సభల తీర్మానాలకూ వ్యత్యాసం వచ్చింది మోనాజైట్ మాంగనీస్ ముఖ్యమైన ఖనిజ సామగ్రిని విధిగా భారతదేశంనుంచి దిగుమతి చెయ్యాలని సెనేట్ తీర్మానంలో పెట్టబడిన షరతును సమిష్టి సమావేశంలో తొలగించవలసిన అవసరం కలిగింది ఆ షరతుపోగా తయారైన తీర్మానాన్ని మళ్లీ రెండు సభలూ విడివిడిగా ఆమోదించాయి దీనిపైన ట్రూమన్ ఆమోదముద్ర పడడంతో 20 లక్షల టన్నులనూ రవాణా చెయ్యడానికి అమెరికా సంసిద్ధంగా ఉంది

ఇటువంటి ఋణాలను యుగోస్లావియా, స్పెయిన్ మొదలయిన దేశాలకు అమెరికా ఇచ్చింది కాని ఇంత విరుద్ధ ప్రచారం జరగలేదు ఒక సెనేట్‌సభ్యుడు నెహ్రూ కమ్యూనిస్టు అన్నాడు నెహ్రూ సుకురుడు కమ్యూనిస్టు అన్నాడు నెహ్రూకి కొడుకు లేడన్నప్పటికి ఆ సభ్యుడు వినే గోరణిలో లేడు కొరియా సమస్యలోనూ, రష్యాతో ప్రచ్ఛన్న యుద్ధంలో భారత దేశం తనపక్షం వహించలేదని అమెరికన్ తీవ్రవాదుల ఆక్రోశం తమతో మైత్రిని ఆకాంక్షించే దేశాలనేరీతిగా అమెరికా ఒత్తిడికి లోనుచేస్తున్నదో ఇదే మంచి తార్కాణం అయితే అమెరికాలో ప్రజలందరూ ఈ రీతిగా లేరు అనేకమంది భారతదేశంలో అన్నార్తులకోసం సహాయం చెయ్యడానికి కృషిచేశారు చాలవరకు అటువంటివారి కృషివల్లనే అమెరికన్ కాంగ్రెస్ తీర్మానం ఆమోదించబడిందని చెప్పాలి రాజకీయాలే వృత్తిగా గలవారి త్యాగ ప్రవృత్తి ఇంతమాత్రమని ఈ చరిత్రాంశం ఋజువు చేస్తోంది త్వరలోనే అమెరికన్ ఆర్థిక సహాయ నిర్వాహక సంస్థ భారత ప్రభుత్వంతో ఈ ఋణంగురించి ఒడంబడిక చేసుకోగలదు అదిమొదలు తొమ్మిది మాసాలవరకు అమెరికానుంచి ఓడలు 20 లక్షల టన్నుల గోధుమలను భారత దేశానికి తీసుకు రాగలవు ★

డైరీ

ఆదివారం, జూన్ 10

—రెండో ప్రపంచయుద్ధంలో జపాన్‌పై యుద్ధం జరిపిన దేశాలన్నీ జపాన్ శాంతి సమాలోచనలలో పాల్గొనాలనీ రష్యన్, అమెరికన్ ప్రతిపాదనలను కలిపి చర్చించాలనీ సోవియట్ రష్యా ప్రభుత్వం అమెరికన్ ప్రభుత్వానికి సూచించింది

—పారిపోయిన బ్రిటిష్ రాయబార కార్యాలయోద్యోగు లిద్దరూ ప్రాగ్ నగరం చేరినట్లు బుఖారెస్ట్ రేడియో ప్రకటించినట్లు పశ్చిమజర్మనీ రేడియో తెలిపింది

—యూరోపియన్ ఎకనమిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్, యూరప్ ఆర్థిక సముద్ధరణ నిమిత్తం పదిఅంశాల ప్రణాళికను సిద్ధపరిచింది

—పత్రికా స్వాతంత్ర్యంగురించి ఐక్యరాజ్యసమితివారి ప్రమాణపత్రం తృప్తిగా లేదని కామన్వెల్తు ప్రెస్ యూనియన్ ప్రకటించింది

—నేపాల్ మంత్రివర్గం పునర్నిర్మించబడింది

—భారత పార్లమెంట్ సమావేశం శనివారం జూన్ 9వ తేదీతో ముగిసింది ఈ సమావేశం నవంబరు 14వ తేదీని ప్రారంభమయింది

—పార్ట్ 'ఏ' రాజ్యాలకూ (అనగా మద్రాసు, బొంబాయి మొదలైనవి), పార్ట్ 'బి' రాజ్యాలకూ (అనగా హైదరాబాద్, మైసూరు మొదలైనవి) మధ్య వ్యత్యాసాలను తొలగించాలని పార్లమెంటులోని పార్ట్ 'బి' రాజ్యాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతూ ఒక తీర్మానంచేశారు

—ఉప్పు పంపకాన్ని రాష్ట్రప్రభుత్వాలే నిర్వహించాలని కేంద్రప్రభుత్వం ఆదేశించినట్లు డిప్యూటీమంత్రి బర్గో హైన్ బొంబాయిలో ప్రకటించారు

—ఉత్తరప్రదేశ్ పీపుల్స్ కాంగ్రెస్ అలహాబాద్‌లో శ్రీ జె బి కృపలానీగారిచేత ప్రారంభించబడింది

సోమవారం, జూన్ 11

—ఉత్తరకొరియాలోకేంద్రరంగంలోని కమ్యూనిస్టుల రక్షణశ్రేణిని ఛేదించి సమితి సేనలు చోర్వన్, కుమ్వా కేంద్రాలను ఆక్రమించుకొన్నాయి

—జపాన్ శాంతి సమాలోచనలలో కమ్యూనిస్టుచీనాప్రభుత్వం పాల్గొనడం భారతప్రభుత్వ అభిమతమని పండిట్ నెహ్రూ అన్నారు

—భారతదేశానికి 20 లక్షల టన్నుల ఆహారధాన్యాలను ఋణంగా ఇచ్చే శాసనాన్ని అమెరికన్ సెనేట్ ఆమోదించింది

—కాశ్మీర్ సమస్య సందర్భంలో విదేశీయుల ఒత్తిడిని సహించబోరని చెబుతూ బ్రిటిష్, అమెరికన్ ప్రభుత్వాల వైఖరిని పండిట్ నెహ్రూ తీవ్రంగా విమర్శించారు

—రష్యాను దర్శించడానికి 39 మంది అనుమతి కోరగా 30 మందికి మాత్రం ఇవ్వబడిందని పండిట్ నెహ్రూ ప్రకటించారు

—దేశంలో ఆహారపరిస్థితి చక్కబడుతున్నదనీ, త్వరలో రేషన్ పూర్తి ప్రమాణం ఇవ్వబడవచ్చుననీ పండిట్ నెహ్రూ పత్రికా సమావేశంలో ప్రకటించారు

—భారత రిపబ్లిక్‌లో ఎన్నికలను ఈ సంవత్సరం డిసెంబర్‌లోనే జరపాలని ప్రభుత్వం పట్టుదలతో ఉన్నదని పండిట్ నెహ్రూ పత్రికా సమావేశంలో ప్రకటించారు

—భారతదేశపు రూపాయి మారకపు విలువను ఇప్పుడు మార్చవలసిన అవసరం లేదని మంత్రి దేశ్‌ముఖ్ ప్రకటించారు

—రానున్న ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ పోటీచేస్తుందనీ, వ్యక్తిగత దౌర్జన్య విధానాన్ని పార్టీ నిషేధించినదనీ శ్రీ ఏ కె గోపాలన్ ప్రకటించారు

—శ్రీ సతీష్ చంద్ర, శ్రీ శ్యామనందన మిశ్రగారు ప్రధానమంత్రికి పార్లమెంటరీ కార్యదర్శులుగా ప్రమాణం స్వీకరించారు

మంగళవారం, జూన్ 12:

—ఐక్యరాజ్యసమితికి చెందిన యూరోపియన్ ఎకనమిక్ కమిషన్‌లో, పశ్చిమ రాజ్యాల సైనికాయుధబల నిర్మాణ కార్యక్రమాన్ని చర్చించాలని సోవియట్‌రష్యా చేసిన ప్రతిపాదన నిరాకరించబడింది

—బర్మాలో ఎన్నికలు ప్రారంభమైనాయి ఎన్నికలు సంవత్సరాంతానికి ముగియవచ్చునని అంచనా వెయ్యబడింది

—కెనడా ప్రభుత్వం న్యూస్ ప్రింట్ ధరలను పెంచినందుకు అమెరికన్ ప్రభుత్వం అసమ్మతి ప్రకటించింది

—అన్నిరాష్ట్రాలలోనూ ఆహార ఫురేషన్ల ప్రమాణాన్ని 9 ఔన్సులనుంచి 12 ఔన్సులకు పెంచవచ్చునని రాష్ట్రప్రభుత్వాలకు కేంద్రప్రభుత్వం అనుమతినిచ్చింది

—రు 250కు మించకుండా మాసవేతనం తెచ్చుకుంటున్న రైల్వే కార్మికులకు, ఉద్యోగులకు, ఇతర భారత ప్రభుత్వోద్యోగులకు కరువుభత్యాన్ని రు 5 హెచ్చించడానికి భారతప్రభుత్వం నిశ్చయించినట్లు ప్రకటించింది

—తూర్పు పంజాబ్ ముఖ్యమంత్రిత్వపదవికి రాజీనామా నివ్వాలని డా॥ గోపీచంద్ భార్గవాగారికి కాంగ్రెస్ పార్లమెంటరీబోర్డు ఆజ్ఞ ఇచ్చింది ఇటీవల బోర్డువారి ఆజ్ఞలను పాలించని డా॥ భార్గవాగారికి ఈ విధంగా ఆజ్ఞ ఇవ్వకపోయినట్లయితే పార్లమెంటరీబోర్డు సభ్యత్వానికి రాజీనామా నిస్తానని పండిట్ నెహ్రూ తెలియపరిచినట్లు ఢిల్లీనుంచి అనధికారవార్త వచ్చింది

—కాంగ్రెస్ కేంద్ర కార్యవర్గం ఢిల్లీలో సమావేశమై ఎన్నికల నివేదిక, కాంగ్రెస్ ఐక్యతాసాధనయత్నాలు మొదలైన అంశాలనుగురించి చర్చించడానికిగాను బెంగళూరులో జూలై 13 మొదలు మూడు రోజులు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ప్రత్యేక సమావేశం జరపాలని నిశ్చయించింది

—పూర్వం సింధురాష్ట్ర నివాసి, ఇప్పుడు శరణార్థి అయిన కాంగ్రెస్ నాయకుడు డా॥ చోయిత్‌రాం గిద్వానీగారు కాంగ్రెస్ సంస్థలో సభ్యత్వానికి రాజీనామా నిచ్చారు

—చేనేత సత్యాగ్రహులు 58 మంది చెన్నపట్టణంలో అరెస్టయినారు

—కేంద్రప్రభుత్వోద్యోగులకు కరువుభత్యాన్ని రు 5 హెచ్చించినంత మాత్రంచేత రైల్వేకార్మికులకు తృప్తి కలగదని రైల్వేమెన్స్ ఫెడరేషన్ కార్యదర్శి గురుస్వామిగారు మద్రాసులో ప్రకటించారు

బుధవారం, జూన్ 13

—జపాన్ శాంతిసంధికోసమై అమెరికన్ ప్రభుత్వం తయారుచేసిన పత్రాన్ని బ్రిటిష్ ప్రభుత్వం ఆమోదించింది

—ఐర్ రిపబ్లిక్ ప్రధాన మంత్రిగా డీ వెలరా ఎన్నికైనాడు

—బ్రిటిష్‌వారికీ, ఆయిల్ కంపెనీకీ ప్రతికూలంగా జరుగుతున్న ప్రచారంవల్ల దక్షిణపర్షియాలో (ఖుజిస్తాన్‌లో) అశాంతి చెలరేగవచ్చునని టెహరాన్‌లోని బ్రిటిష్ రాయబారి షెపర్డ్ పర్షియా ప్రభుత్వాన్ని హెచ్చరించాడు

—అబడాన్‌లో ఆంగ్లో-పర్షియన్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులూ, పర్షియన్ ఆయిల్ బోర్డు సభ్యుల మధ్య సమాలోచనలు ప్రారంభమైనాయి

—తూర్పు పంజాబ్ ముఖ్య మంత్రి డా॥ భార్గవా రాజీనామా నిచ్చేపక్షంలో, మరొక మంత్రివర్గాన్ని స్థాపించడానికి యత్నించవద్దని లాలాభీమసేన్ సచార్, తదితరులను ఆదేశిస్తూ కాంగ్రెస్ అధ్యక్షులు టండన్ లేఖ వ్రాశారు

—ముడిపత్తి ధరలను పుట్టికి రు 50 చొ॥ భారత ప్రభుత్వం హెచ్చించింది

—తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలలో రైస్ పూల్స్‌ను రద్దుపరుస్తూ జిల్లా కలెక్టర్లు ఇచ్చిన ఆజ్ఞలను తాత్కాలికంగా అమలు జరపరాదని మద్రాసు హైకోర్టు వెకేషన్ జడ్జి నిర్ణయించారు

—చేనేత సత్యాగ్రహులు 56 మంది చెన్నపట్నంలో అరెస్టయినారు

గురువారం, జూన్ 14

—లండన్‌లో సమాలోచనల ఫలితంగా జపాన్ శాంతిసంధి విషయమే కాకుండా ఇతర సమస్యలను గురించి కూడా బ్రిటిష్ అమెరికన్ ప్రభుత్వాలమధ్య ఏకాభిప్రాయం కుదిరిందని అధికారరీత్యా ప్రకటించబడింది

—కొరియా యుద్ధంలో అమెరికా పాల్గొనాలని ఏచిసన్ నిర్ణయించాడనీ మెకార్థర్‌ను ఈ విషయమై సంప్రదించలేదనీ పూర్వరక్షణ శాఖా మంత్రి జాన్సన్ విచారణ సంఘానికి తెలియపరిచాడు

—మార్చి 20 మొదలు ఇప్పటివరకూ వచ్చిన ఆదాయంలో 75% తమకు చెల్లిస్తేగాని సమాలోచనలకు సమ్మతించబోరని పర్షియన్ ప్రభుత్వం ఆంగ్లో-పర్షియన్ ఆయిల్ కంపెనీ రాయబారవర్గానికి తెలిపింది సమాలోచనలు వాయిదాపడినాయి

—అమెరికన్ కాంగ్రెస్ ఆమోదించిన ఆహారధాన్యాల ఋణంలో పదిలక్షల టన్నులు ఈ సంవత్సరాంతంలోగా చేరగలవనీ, మిగతా పదిలక్షల టన్నులూ 1952లో మార్చి మాసాంతంలోగా చేరగలవనీ అంచనా వెయ్యబడింది

—దేశంలో ధరల పెరుగుదలను అరికట్టే నిమిత్తం విరివిగా విదేశాలనుంచి వస్తుసామగ్రిని దిగుమతి చెయ్యడానికి భారత ప్రభుత్వం వ్యాపారులకు అనుమతి నిచ్చింది

—గోదావరి కృష్ణా నదులకు సంబంధించిన ప్రాజెక్టులలో దేనిని ముందు నిర్మించాలో నిర్ణయించడంకోసం సెంట్రల్ ప్లానింగ్ కమిషన్ మద్రాసు, బొంబాయి, హైదరాబాద్ ప్రభుత్వాలతో సమాలోచనలు జరపాలని నిశ్చయించింది

—కావలి, చీరాల, నిడుబ్రోలు, తెనాలి, ఏలూరు, అమలాపురాలలో ఏడు సెకండ్ గ్రేడ్ కాలేజీలను ఈ సంవత్సరమే ప్రారంభించడానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుమతించింది

—81 మంది చేనేత సత్యాగ్రహులు చెన్నపట్నంలో అరెస్టయినారు

శుక్రవారం, జూన్ 15

—పారిస్‌లో డిప్యూటీ మంత్రుల చర్చలనింక విరమించి, నాలుగు అగ్రరాజ్యాల విదేశాంగ మంత్రులూ సమావేశం జరపడం మేలని అమెరికన్, బ్రిటిష్, ఫ్రెంచి డిప్యూటీ మంత్రులు రష్యన్ డిప్యూటీ మంత్రికి తెలియచేశారు

—కమ్యూనిస్టు దేశాలకు యుద్ధావసర వస్తువులను ఎగుమతిచేసే దేశాలకు ఆర్థికసహాయం ఇవ్వరాదని అమెరికాలో విధించబడిన శాసనాన్ని అప్పుడే అమలు జరపడంలేదని ట్రూమన్ ప్రకటించాడు

—అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్ ప్రభుత్వాలు త్వరలో పసిఫిక్ ప్రాంత రక్షణసంధి చేసుకోగలవని ఆస్ట్రేలియా రక్షణశాఖామంత్రి మాక్‌బ్రిడ్జ్ కరాచీలో ప్రకటించారు

—భారతదేశానికి 20 లక్షల టన్నుల ఆహారధాన్యాలను ఋణమిచ్చే శాసనంపైన అమెరికన్ అధ్యక్షుడు ట్రూమన్ సంతకం చేశాడు. పది రోజులలో ఆహారధాన్యాల రవానా ప్రారంభం కాగలదని అంచనా వెయ్యబడింది. ఋణపత్రంపైన అమెరికన్ విదేశ వ్యాపారపు బాంక్ అధ్యక్షుడు, భారత రాయబారి విజయలక్ష్మి పండిట్ సంతకాలు చేశారు

—గోధుమలను ఏ దేశాలకు ఎంతెంత ఎగుమతి చెయ్యవచ్చునో నిర్ణయించే అంతర్జాతీయ సమావేశం 1951 ఆగస్టు మొదలు 1952 జూలైవరకూ భారతదేశానికి 15 లక్షల టన్నులకంటె ఎక్కువ పంపరాదని నిర్ణయించింది

—42 లక్షల పౌనుల విలువగల ఆహారధాన్యాలనిచ్చి దీనిని కొలంబో ప్రణాళికలో తమ వాటాగా పరిగణించవలసిందని ఆస్ట్రేలియన్ ప్రభుత్వం చేసిన సూచనకు భారత ప్రభుత్వం అనుమతించింది

—ఇండో పాక్ ఒడంబడిక ప్రకారం భారతదేశానికి సప్లయి కావలసిన 1,16,000 టన్నుల బియ్యానికి, జూన్ 15 వరకూ 98 వేల టన్నులు మాత్రం సప్లయి అయింది

—పాట్నా సమావేశ తాత్కాలిక విషయ నిర్ణయ సభ 'కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ' అనే పేరుతో కొత్తపార్టీని స్థాపించడానికి నిర్ణయించింది. అధ్యక్షులు శ్రీ కృపలానీగారు పార్టీ ఆశయాలను వివరించారు. కేంద్రమంత్రి కిద్వాయిగారు సభలో పాల్గొన్నారు

—కాంగ్రెస్ సభ్యత్వానికి శ్రీ జె బి కృపలానీగారిచ్చిన రాజీనామాను కాంగ్రెస్ అధ్యక్షులు టండన్‌గారు ఆమోదించారు.

—ఆర్థికంగా పార్ట్ 'బి' రాజ్యాలను రిపబ్లిక్‌లో అంతర్లీనం చేసినందువల్ల అయిదేళ్ళవరకూ ఏటేటా రు 10 కోట్లు ధనసహాయమివ్వాలని తేలింది

—షిమోగా జిల్లా, సగర తాలూకాలో రైతుల సత్యాగ్రహానికి నాయకత్వం వహించిన సోషలిస్టు నాయకుడు డా॥ రామమనోహర లోహియాను మైసూరు పోలీసులు అరెస్టుచేశారు

—91 మంది చేనేత సత్యాగ్రహులు చెన్నపట్నంలో అరెస్టయినారు

శనివారం, జూన్ 16

—బర్మాలోని ఆరకాన్ రాష్ట్రంలో ముజాహిద్‌లు (మహమ్మదీయులు) గ్రామాలపైబడి దోచుకోనారంభించారు. ప్రభుత్వ సేనలతో వారు పోరాటం సాగించారు

—భారతప్రధాని పండిట్ నెహ్రూ నేపాల్ సందర్శన సందర్భంలో, నేపాల్ స్వాతంత్ర్య ప్రతిపత్తిని భారతప్రభుత్వం మన్నిస్తుందనీ, జోక్యం చేసుకోబోదనీ ఖాట్మండులో చెప్పారు

—తూర్పుపంజాబ్‌లో డా॥ గోపీచంద్ భార్గవా గారి మంత్రివర్గం కాంగ్రెస్ పార్లమెంటరీబోర్డు ఆదేశాన్ని అనుసరించి రాజీనామా నిచ్చింది

(45-వ పేజీ చూడండి)

కౌంట్ ఆఫ్ మాంటీ క్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

36

ఫ్రాంజ్‌కి తెలివివచ్చేసరికి ముందుగా ఆల్బర్ట్ కనపడ్డాడు, తరవాత వీధిలోకి చూశాడు అక్కడ ఉరికంబం, రక్తపాతం, అన్నీ మాయమైనాయి జనం రణగొణధ్వని చేస్తున్నారు సిటోరిగియో చర్చి గంటలు మోగుతున్నాయి పోప్ మరణించినప్పుడూ, రోమ్ ఉత్సవాలు ప్రారంభమైనప్పుడూ మాత్రమే ఈచర్చిగంటను మోగిస్తారు

"అదేమిటి? ఏం జరిగింది?" అని ప్రశ్నించాడు ఫ్రాంజ్

"ఏముంది?" అన్నాడు మాంటీ క్రిస్టో "ఉత్సవం ప్రారంభమయింది"

"మరి పెపినో మాటేమయింది?"

"పెపినోకి లోకజ్ఞానం ఉంది అది అట్టేమంది కుండదు నలుగురూ తమ సంగతి కనిపెట్టలేదని కొందరు రోషం తెచ్చుకుంటారు ఎవ్వరూ కనిపెట్టని సమయం చూసి పెపినో జారిపోయాడు పాదరీలకి వందనమైనా చెయ్యలేదు త్వరగా దుస్తులు ధరించండి, అట్లైతే వ్యవధి లేదు" ఆల్బర్ట్ సాటిన్ పంట్లాం తొడుగుతున్నాడు

ఫ్రాంజ్ అడిగాడు "ఆల్బర్ట్! నిజం చెప్పు ఉత్సవాల్లోకి వెళ్ళాలని నీ కంకా కోరికుందా?"

"నిజంగా లేదనుకో కాని కౌంట్ చెప్పినది నాకు పూర్తిగా వచ్చింది ఇటువంటి దృశ్యం మొదటసారి చూసినప్పుడు మాత్రమే కలత పడతాం అంతే తరవాత ఏమీ ఉండదు"

ఫ్రాంజ్ కూడా గబగబా కొత్త దుస్తులుధరించాడు అందరూ కలిసి మెట్లు దిగి వచ్చేసరికి ద్వారంవద్ద బగ్గీ సిద్ధంగా ఉంది అప్పటికే ఆచోటంతా మారిపోయింది దారుణ మారణదృశ్యాన్ని చూడ్డానికి వచ్చిన జనం అదంతా మరచిపోయిఆనందోత్సవంలో నిమగ్నులై పోయారు వీధులన్నీ జనంతోనూ, బగ్గీలూ, రకరకాల బళ్లతోనూ కిటకిటలాడుతున్నాయి అందరూ రకరకాల వేషాలు ధరించారు మిత్రులు,శత్రువులనే భేదం లేకుండా పరస్పరం పరిహాసాలాడుకుంటూ, ఈకలు వేస్తూ, గంతులు వేస్తూ, అల్లరిగా తిరుగుతున్నారు మిఠాయివస్తువులు, పువ్వుల గుత్తులు, బుక్కా మొదలైనవి ఒకరిపై ఒకరు విసురుకుంటున్నారు పిన్నలూ పెద్దలూ కేరింతలు కొడుతూ చేస్తున్న అల్లరికి ఎవరికీ కోపంరాదు క్రమక్రమంగా ఈ అల్లరిలోకి అందరూ, కొద్ది గొప్ప తేడాలు మరిచి, చొరబడుతున్నారు అనేక దేశాలనుంచి వచ్చిన అనేక జాతీయులు కలిసిమెలిసి ఈ ఉత్సవంలో పాల్గొంటున్నారు ఎద్దులు, గేదెలు, పులులు,సింహాలు కుక్కలరూపంలో అట్ట తలలు, తగిలించుకుని అందరూవీధులంట తిరుగుతున్నారు

ఈ ఉత్సవ కల్లోలంలో రెండుసార్లు బగ్గీలో అటూ ఇటూ తిరిగినతరవాత మాంటీ క్రిస్టో రాస్పోలీభవనంలోని తన బసకి వెళ్లిపోయాడు బగ్గీ యువకు లిద్దరికీ ఒప్పగించబడింది ఉత్సవంలో తిరగడం విసుగుపుట్టినప్పుడు రాస్పోలీభవనంలోని తన కిటికీలవద్ద కూర్చుని చూడవచ్చునని మాంటీ క్రిస్టో వారికి చెప్పాడు

యువకు లిద్దరూ ఉత్సవకేళిలో ఒళ్లుమరిచి చాలసేపు తిరిగారు ఒకచోట ఇటాలియన్ రైతుల వేషాలు ధరించిన గుంపొకటి ఒక బండిలో కనపడింది ఆల్బర్ట్ దాని ననుసరించడానికి ప్రయత్నించాడుకాని అది సమూహంలో ఇట్టే మాయమయిపోయింది బండిలోనివారంతా రకరకాల బురఖాలు తగిలించుకున్నారు

ఫ్రాంజ్ తో ఆల్బర్ట్ ఇలా అన్నాడు "అరెరె! నువ్వు చూడలేదు సుమా! ఆ బురఖాలు తగిలించుకున్నవాళ్లందరూ చక్కని ఇటాలియన్ యువతులై ఉంటారు!"

"పాపం! దురదృష్టవంతుడవ్ నువ్వు నీ బురఖా తీయ్యవలసింది సుమా! ఇంతవరకూ తీరని కోరిక ఇప్పుడైనా తీరేది కదా!"

"జరిగిన లోపం తీరకుండా ఉత్సవం అయిపోదులే ఫరవాలేదు"

కాని ఆల్బర్ట్ ఆశలు అట్టే ఫలించలేదు ఆ బండిరెండు మూడుసార్లు తటస్థపడి మాయమయింది అది కనిపించిన ప్రతిసారీ ఆల్బర్ట్ బురఖా తీసివేశాడు రెండోసారి తన దగ్గరున్న పూలగుత్తులన్నీ ఎత్తి ఆ బండిలోకి గిరవాటు వేశాడు మూడోసారి ఊదాపువ్వులగుత్తొకటి ఆల్బర్ట్ వద్దకు వచ్చిపడింది గుత్తిలో కొన్ని పూలు తీసి ఆల్బర్ట్ కోటుకు తగిలించుకున్నాడు

ఫ్రాంజ్ అన్నాడు "ఇంకేం? అన్వేషణ ఆరంభించు"

"నీకు పరిహాసంగానే ఉండవచ్చుగాని నాకు, అలా లేదు పువ్వులగుత్తిని విడిచిపెట్టేది లేదింక"

అయితే పరిహాసధోరణి మారిపోడానికి అట్టేసేపు పట్టలేదు ఆ బండి ఈమారు కనపడినప్పుడు అందులోనుంచి ఒకామె ఆల్బర్ట్ కోటు బొత్తాములో పూలను చూసి నవ్వి చప్పట్లు కొట్టింది

ఫ్రాంజ్ అన్నాడు "బలే! బలే! అంతా అనుకూలంగానే ఉందోయ్! నువ్వు ఒంటరిగా ఉంటే మంచిదేమో? నేను వెళ్లిపోనా?"

"అబ్బే అక్కర్లేదు ఆమె నిజంగానే అనుకూలంగా ఉన్నట్లయితే, మళ్ళీ కనపడి సంజ్ఞచేస్తుందిలే రేపు ఆమే మనకోసం వెతుక్కుంటూ వస్తుంది అప్పుడేం చెయ్యాలో చూడవచ్చులే"

ఆ రోజుకి మళ్ళీ ఆబండి కనపడలేదు యువకు లిద్దరూ మరికొంతసేపు తిరిగి రాస్పోలీభవనానికి వెళ్లిపోయారు చిన్నచర్చిలో గంట మోగగానే ఉత్సవం సన్నగిలిపోయింది బళ్లు వెళ్లిపోయినాయి జనం ఎవరి నివాసాలకు వారు వెళ్లిపోయారు ఆల్బర్ట్ హోటల్ యజమానితో చెప్పి, ఆరోజే ఇటాలియన్ రైతు

సీతారామ్

లకు అనువైన దుస్తులను తెప్పించుకున్నాడు ఊదాపూలగుత్తిని జాగ్రత్తగా పదిలపరిచాడు

మరునాడు ఉదయం యువకు లిద్దరూ రైతులవేషాలు ధరించారు ఆల్బర్ట్ వాడిన ఊదాపూలను కోటుబొత్తాముకు తగిలించాడు ఇద్దరూ బగ్గీలో ఎక్కి ఒకసారి చుట్టివచ్చినంతలో నే నిన్నటిబండి ఎదురయింది మరొక ఊదాపూలగుత్తి వచ్చి ఆల్బర్ట్ వద్ద పడింది కొత్తగుత్తిని కోటుకు తగిలించి వాడినగుత్తిని చేత పట్టుకున్నాడు ఆల్బర్ట్ ఈసారి ఆ బండి కనపడగానే వాడిన గుత్తి నెత్తి మృదువుగా చుంబించాడు "బండిలోనివారందరూ ఉల్లాసంతో కేరింతలు కొట్టారు ఆ రోజుకూడా ఆనందోత్సాహాలతో గడిచిపోయింది ఒక పర్యాయం ఆ బండిలో ఒక యువతి బురఖా తీసి ఆల్బర్ట్‌ను చూసింది ఇద్దరూ నవ్వుకున్నారు ఆమె ఉన్నతవంశీకురాలని ఆల్బర్ట్ అనుకున్నాడు మరుచటిరోజు ఆల్బర్ట్ ఒక్కడే బగ్గీలో వెళ్ళాడు ఫ్రాంజ్ రాస్పొలీభవనంలో కిటికీదగ్గర కూర్చుని ఉత్సవం చూశాడు ఇదే రీతిగా మరొకరోజు గడిచింది ఆరోజు సాయంకాలం ఆల్బర్ట్ ఉత్సాహంతో పరుగెత్తివచ్చి చేత ఒక కాగితం పట్టుకుని "ఇదిగో! ఇది చూడు! చదువు" అన్నాడు ఫ్రాంజ్ పత్రం తీసుకుని ఇలా చదివాడు

"మంగళవారం సాయంత్రం ఏడుగంటలవేళకి, పాంటిఫెకీ వీధి మొగలో మీ బండి దిగి, అక్కడ చర్చి, సోపానాలవద్ద నిరీక్షించే కర్షక యువతిని అనుసరించండి మిమ్మల్ని గుర్తుపట్టడానికివీలుగా మీ కోటుకు వేలాడే ఎర్రరిబ్బనొకటి చివరముడ వయ్యాలండి అంతవరకూ మీకు నేను కనపడను"

"ఏమంటావ్?" అని అడిగాడు ఆల్బర్ట్

"అదృష్టవంతుడ వంటాను" అని పత్రాన్ని తిరిగి ఇచ్చేశాడు ఫ్రాంజ్.

"ఇప్పుడు నవ్వు నీ ఇష్టం వచ్చినట్లు నవ్వు ఇప్పుడు నిజంగానే నన్ను ప్రేమ ఆవహించింది"

"అరె! అయితే నన్ను ఒంటరిగా ఫ్లారెన్స్‌కి పంపుతావన్నమాట! ఇప్పుడే ఒంటరిగా విడిచిపెట్టేలాగున్నావే!"

"ఆమె అందానికి తోడు అనకూలమైనదైతే అంతే, కనీసం ఆరుమాసాలైనా రోమ్‌నగరంలో తిష్టవెయ్యాలి రోమ్‌నగరం అద్భుతంగా ఉంది ఆహా! ఏమి భవనాలు! ఏమి నిర్మాణం!"

"అవునవును ఇలాగే ఇంకా రెండుమూడు ప్రేమయాత్రలు సాగించావంటే, నీకు రోమన్‌భవననిర్మాణంలో పరిపూర్ణ పాండిత్యం అబ్బుతుందిలే"

ఇంతలో హోటల్ యజమాని వచ్చాడు కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో అత్యవసర కార్యంపైన ఈ రెండురోజుల్లోనూ సివిటా వెఖియా వెళ్ళివచ్చినట్లు అతను చెప్పాడు మాంట్ క్రిస్టో సంగతి ఎంత తరిచినా ఫ్రాంజ్‌కి బోధపడ్డంలేదు ద్వీపంలోతననే చూసినట్లు మాంట్ క్రిస్టో గుర్తించి ఉండాలి కాని ఒక్కమారు కూడా అతనా ఆ ప్రసక్తిని తేలేదు ఫ్రాంజ్ కూడా అతని ఆదర గౌరవాలను గమనించి ఆ ప్రసక్తి తీసుకురాలేకుండా ఉన్నాడు క్రమక్రమంగా మాంట్ క్రిస్టో చిత్రముఖభంగిమకు ఫ్రాంజ్ అలవాటు పడ్డాడు సౌకుమార్యమెరగని అతని వింత అందాన్ని గుర్తించాడు బైరన్ వర్ణించిన వీరులను పోలిన అతని ముఖంలో, ఏదో చెప్పలేని ఒకభావం ముద్రితమైనట్లుంది ఏ కఠోరభావమో అతని నుదుటిపైన గాఢరేఖ నొకదానిని ముద్రించింది గుండెలను దూసి లోతుపాతులు కనిపెట్టగలవనిపిస్తాయి, నిప్పులు కక్కే అతని నేత్రాలు నిరసన, చాంచల్యం, కోపం ప్రకటించే అతనిపై పెదవి, పలికే ప్రతిమాటకూ తీవ్రశక్తి నిచ్చి, వినేవారిలో అడుకువ కలిగిస్తుంది అతనికి యౌవనదశ దాటిందికనీసం నలభైఏళ్లుంటాయి అయినప్పటికీ యువకులను వశపరుచుకునే శక్తి అతనికే ఉన్నదా అనిపిస్తుంది. అతన్ని ఒకసారి చూసినవారు దృష్టిని మరల్చుకోలేరు అతని ముఖంలోని ఆకర్షణ తీవ్రమైనది ఇటువంటి అసాధారణ వ్యక్తిమైత్రి లభించడం అదృష్టమని ఆల్బర్ట్ పొంగిపోతున్నాడు కాని ఫ్రాంజ్ అంత ఉత్సాహంగా లేడు అయినా ఇద్దరూ ఒకేవిధంగా ఆకర్షించబడ్డారు మాంట్ క్రిస్టో పారిస్ వస్తానని చెప్పిన విషయాన్ని గురించి తరుచు యోచించేవాడు అసాధారణప్రజ్ఞ, తీవ్రఆకర్షణ గల అతని ముఖం, అతని అపారభాగ్యసంపద పారిస్ ఉన్నతసమాజంలో సంచలనం కలిగించక మానవనుకున్నాడు ఫ్రాంజ్ అయినా మాంట్ క్రిస్టో పారిస్‌లో ఉన్న సమయంలో అక్కడ తా నుండకూడ దనుకున్నాడు

మంగళవారం వచ్చింది అదే ఉత్సవాలకు ఆఖరిరోజు చీకటిపడిన తరవాతకూడా గంటసేపటివరకూ జ్వాలాతోరణోత్సవం జరుగుతోంది ఈ సందడిలో ఆల్బర్ట్ సరిగా ఏడుగంటల వేళకి చర్చివద్దకు వెళ్లి బగ్గీ దిగాడు అక్కడకూడా జనసమ్మర్దం అధికంగానే ఉంది ఫ్రాంజ్ బగ్గీలోనే కూర్చున్నాడు కర్షక స్త్రీవేషం ధరించిన ఒక యువతి అతన్ని సమీపించి ఎర్ర రిబ్బను ముడి తాకింది ఇద్దరూ ఏవో మాట్లాడుకున్నారు కాని ఫ్రాంజ్ కి వినపడలేదు తరవాత ఇద్దరూ చెయ్యీ చెయ్యీ పట్టుకుని జనసమ్మర్దంలో కలిసి మాయమైనారు ఇంతలోనే చర్చిగంట మోగింది ఉత్సవాలు అఖరైనట్లు అది సూచన వీధులన్నీ నిర్జనం కావడానికి ఆట్టే సేపు పట్టలేదు జ్వాలాతోరణంలో ప్రకాశించిన వీధులన్నీ చీకటిలో మునిగిపోయాయి

అకస్మాత్తుగా ఉత్సవదృశ్యాలు అదృశ్యమై, చీకటిలో, భారమైన భావపరంపరతో ఫ్రాంజ్ హోటల్‌కి తిరిగివెళ్లాడు ఈ మాదిరి అనుభవం అతని కింత జన్మలో కలగలేదు ఉన్నట్టుండి ఉత్సాహం, కల్లోలం మాయమై, గాఢనిస్తబ్ధత ఆవరించింది నగరమంతా పెద్ద శ్మశానవాటికవలె అతనికి కనుపట్టింది రాత్రి పదకొండు గంటలకుగాని చంద్రోదయం కాదు ఆల్బర్ట్ రావడానికి ఆలస్యమవుతుందని చెప్పినందువల్ల, ఆ రాత్రి ఫ్రాంజ్ ఒక్కడే కూర్చుని భోజనం చేశాడు రాత్రి పదకొండు గంటలకు బగ్గీ సిద్ధంగా ఉంచవలసిందని ఆజ్ఞ ఇచ్చాడు ఆల్బర్ట్ ం గానే కబురు పంపవలసిందని హోటల్ యజమానితో చెప్పాడు రాత్రి పదకొండు గంటలైనప్పటికీ ఆల్బర్ట్ తిరిగి రాలేదు

37

ఆల్బర్ట్ అప్పటికీ తిరిగి రాకపోయేసరికి ఫ్రాంజ్ కలవరపడ్డాడు రాత్రి కౌంటెస్ ఇంటివద్ద విందులో గడపాలనే ఉద్దేశంతో బయలుదేరాడు

కౌంటెస్ తండ్రి రోమ్‌లోని భాగ్యవంతులలో ఒకడు వారి భవనం నగరంలోకెల్ల అందమైనది వారి ఇంటిలో విందులకు పేరుకలవారందరూ వస్తారు ఫ్రాంజ్ అక్కడికి వెళ్ళగానే విన్న మొదటి ప్రశ్న అతని మిత్రుని గురించి

"ఆల్బర్ట్ గియాకోమోచర్చివద్ద దిగ వెళ్లిపోయాడు" అని ఫ్రాంజ్ చెప్పాడు

"ఎక్కడికి వెళ్లి ఉంటాడు?"

"సరిగ్గా తెలియదు కాని ఒక యువతిని కలుసుకోడాని కనుకుంటాను"

"అబ్బె" అన్నాడు కౌంటెస్ తండ్రి "రోమ్‌నగరవీధుల్లో తిరగడానికి, ఈ రాత్రివేళ మంచిది కాదు "

"అతన్ని వెళ్ళకుండా మీరు ఆపవలసింది రోమ్ నగరం సంగతి అతనికంటె మీకు బాగా తెలుసు " అంది కౌంటెస్

"నిజమేకాని అతన్ని ఆపడం ఎవ్వరితరం కాదు అదీకాక ఏ విఘాతం దతనికి ?"

"ఏమో ? ఎవరు చెప్పగలరు ? రాత్రి నగరం గుబులు గుబులుమంటూ ఉంటుంది దగ్గరలోనే టైబర్ నదికూడా ఉంది "

"అతను తిరిగి రాగానే ఇక్కడ నాకు కబురు పంపవలసిందని హోటల్ యజమానికి చెప్పాను "

"అదుగో ! మీకోసం నౌకరొకరు వెతుక్కుంటూ వస్తున్నారు "

నౌకరొకడు వచ్చి ఫ్రాంజ్‌తో ఇలా చెప్పాడు "ఆల్బర్ట్ వద్దనుంచి మీ కొక ఉత్తరాన్ని ఎవరో తీసుకువచ్చినట్లు, మీ హోటల్ యజమాని మీతో చెప్పమన్నారు "

"ఆల్బర్ట్ ఉత్తరం పంపాడా ? వచ్చిన మనిషెవరు ? ఉత్తరం ఇక్కడికెందుకు తీసుకొచ్చి ఇవ్వలేదు ?"

"ఎందుకో చెప్పలేదండి మీకోసం నేనిక్కడికి రావడం చూసి అతను వెళ్లిపోయాడు "

"అలాగా ?" అంది కౌంటెస్ "అయితే మీరు క్షణం జాప్యం చెయ్యకుండా వెళ్ళండి అతనే ముప్పులో చిక్కుకున్నాడో పాపం "

ఫ్రాంజ్ వెంటనే బయలుదేరాడు హోటల్ సమీపంలోనే ఉండి కాలినడకను పదినిముషాల్లో అక్కడికి చేరాడు హోటల్ వద్ద, వీధి మధ్యలో నిలబడిన ఒక వ్యక్తి కనపడ్డాడు అతనే ఉత్తరం తెచ్చినవాడని ఫ్రాంజ్ నిర్ధారణ చేసుకున్నాడు ఆ వ్యక్తి ఒంటనిండా పెద్ద పచ్చడం కప్పుకున్నాడు అతన్ని సమీపించగానే, అతనే "తమపేరేనా బారన్ " అన్నాడు

"అవును నా పేరే బారన్ ఫ్రాంజ్ డి ఎపినే "

"అయితే ఈ ఉత్తరం తమకే వ్రాయబడింది "

"జవాబివ్వాలా ?"

"ఉత్తరం చదివితే మీకే తెలుస్తుంది "

"నేను తిరిగి వచ్చేవరకూ మీరిక్కడే ఉంటారా ?"

"తప్పకుండా"

ఫ్రాంజ్ హోటల్లోకి వెళ్లాడు మెట్లవద్దనే పస్త్రీని ఎదురైనాడు "మీరా మనిషిని కలుసుకున్నారా?" అని అడిగాడు

"కలుసుకున్నాను ఉత్తరం ఇచ్చాడు దీపం ఒకసారి పంపించండి "

వెంటనే నౌకర్లు కొవ్వొత్తిదీపాలు తెచ్చారు పస్త్రీని కలవరపడుతున్నట్లు వెలుగులో ఫ్రాంజ్ చూశాడు ఫ్రాంజ్ ఉత్తరం విప్పి ఈవిధంగా చదివాడు

"ప్రియమిత్రునికి, ఈ ఉత్తరం అందగానే నా మేజాలో ఉన్న హుండీ పత్రం తీసి, అది చాలకపోతే నీ పత్రంకూడా తీసుకు వెళ్లి తార్లోనియావద్ద మార్చి, నాలుగువేలు స్పానిష్ డాలర్లు తీసుకో ఆ ధనాన్ని ఈ ఉత్తరం తెచ్చిన వ్యక్తికి ఒప్పగించు ఈ ధనం నాకు వెంటనే కావాలి ఒక్కక్షణం ఆలస్యం కాకూడదు నీమీద నమ్మకంతో ఉన్నాను ఇంతకంటె నేనింకేమీ చెప్పలేను—నీమిత్రుడు ఆల్బర్ట్ డి మార్సెర్ఫ్"

"గమనిక ఇప్పుడు నాకు ఇటాలియన్ దోపిడి దొంగలున్నారని నమ్మకం కుదిరింది "

ఈనాల్గులైన్ల కింద ఆ ఉత్తరంలో క్రొత్త దస్తూరీలో ఇటాలియన్ భాషలో ఇలా వ్రాసిఉంది

"రేపు ఉదయం ఆరుగంటలకి నాలుగువేలూ నాచేతిలో పడకపోతే, ఏడుగంటలకల్లా ఆల్బర్ట్ ప్రాణా లుండవు "

అయితే ఆల్బర్ట్ ఇటాలియన్ దోపిడిదొంగలచేతుల్లో చిక్కాడన్నమాట ! ఇప్పుడింక ఆలస్యం చెయ్యడానికి వీల్లేదు ఫ్రాంజ్ గబగబా వెళ్లి మేజా తెరిచాడు ఆల్బర్ట్‌కి చెందిన హుండీలో ఆరువేలలో మూడువేలప్పుడే ఖర్చయింది ఇంక మూడువేలే ఉంది ఫ్రాంజ్ హుండీ పత్రం రోమ్‌నగరవాసుల కిచ్చినదికాదు, ఫ్లారెన్స్ నగరవాసుల కిచ్చినదది అప్పుడతని చేతిలో ఏభై లూయీలుమాత్రం మిగిలింది అంతే ఆల్బర్ట్‌కి ఇంకా ఎనిమిది వందల స్పానిష్ డాలర్లు కావాలి తార్లోనియా ఇవ్వవచ్చునని కొంత ధైర్యముంది, ఫ్రాంజ్ అతనివద్దకు వెళ్లడానికి బయలుదేరాడు ఇంతలో అతనికి మెరుపువలె ఒక ఆలోచన తట్టింది కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో జ్ఞప్తికి వచ్చాడు పస్త్రీని వంక తిరిగి "మాంట్ క్రిస్టో ఉన్నారా ?"

"ఉన్నారు ఆయనకూడా ఇప్పుడే వచ్చారు "

"అయితే నేను వెంటనే ఆయన్ని చూడగోరుతున్నానని తెలియపరచగలరా ?"

పస్త్రీని వెళ్లి అయిదు నిముషాల్లో తిరిగివచ్చాడు "మీ కోసం మాంట్ క్రిస్టో నిరీక్షిస్తున్నారు" అని చెప్పాడు

ఫ్రాంజ్ ఒక నౌకరుననుసరించి వెళ్లాడు లోపల ఒక గదిలో మాంట్ క్రిస్టో కూర్చునిఉన్నాడు చుట్టూ సోఫాలున్నాయి అతను లేచి ముందుకువచ్చి ఫ్రాంజ్‌ని ఆహ్వానించాడు "ఇటువంటివేళ వచ్చారు విశేషమేమైనా ఉందా ? నాతో కలిసి భోజనంచేస్తారా ?" అన్నాడు

"లేదు ప్రమాదమైన ఒక విషయంగురించి మాట్లాడ్డానికి వచ్చాను "

"ప్రమాదమా ? ఏమిటది ?"

ఆల్బర్ట్ తనకు పంపిన ఉత్తరాన్ని తీసి ఫ్రాంజ్ మాంట్ క్రిస్టోచేతి కిచ్చాడు "ఇది చదవండి" అన్నాడు

మాంట్ క్రిస్టో చదివాడు

"దీన్నిగురించి ఏమంటారు ?" అన్నాడు ఫ్రాంజ్.

"ఆల్బర్ట్ అడిగినంత ధనం మీవద్ద ఉందా ?"

"ఎనిమిదివందలు కొరవగా ఉంది "

మాంట్ క్రిస్టో లేచివెళ్లి సమీపంలోఉన్న డ్రాయర్ తెరిచాడు దానినిండా బంగారు నాణేలున్నాయి "నాలుగువేలూ తీసుకోండి పైనకూడా ఏమైనా కావలసివస్తే తీసుకోండి" అన్నాడు

ఫ్రాంజ్ ఈసారి మాంట్ క్రిస్టోపై స్థిరదృష్టి నిలిపి చూసి, ఇలా అన్నాడు, "అయితే లూగీవాంపాకి ధనం పంపక మార్గాంతరం లేదంటారా ?"

"మీరే నిర్ణయించుకోండి చివరి వాక్యాలలో ఆ మాట నిష్కర్షగా వ్రాయబడింది కదా !"

"మీరు కొంచెం జాగ్రత్తగా ఆలోచించినట్లయితే, తప్పకుండా మరొకమార్గం దొరక్కపోదు మన మిద్దరం కలిసి లూగీవాంపావద్దకు వెళ్లి, ఆల్బర్ట్‌ని విడిచిపెట్టాలని మీ రడిగినట్లయితే అతను నిరాకరించ డనుకుంటాను "

"ఆ దోపిడిదొంగ నామాట ఎందుకు వింటా డనుకున్నారు?"

(46-వ పేజీ చూడండి)



అది ఒక పల్లెటూరు. ఆ వూరిలో దాదాపు రెండు వేలమంది నివసిస్తున్నారు. కిరణ్ రాయ్ ఆ గ్రామంలో సంపన్న గృహస్థులలో ఒకడని చెప్పవచ్చు.

అప్పటికి రాత్రి దాదాపు మూడు గంటలు గడచిపోయినట్లే. వూరు మాటుమణిగి ఉంది. గ్రామసింహాలు వీథులలో అక్కడక్కడ ఓరగన్నులతో విశ్రమిస్తున్నాయి. కిరణ్ రాయ్‌కి అప్పుడే ఎందుకో మెలకువ వచ్చింది. నిద్రపట్టక అటూఇటూ దొర్లుతున్నాడు. కిరణ్ తన యింట్లో తూర్పు వేపున ఉన్న ఖాళీస్థలంలో మంచం వేసుకొని పడుకొన్నాడు. అతనికి హఠాత్తుగా 'టక్ టక్' మని చప్పుడు మెల్లి మెల్లిగా వినిపించింది. అతను జాగ్రత్తగా చెవులు నిక్కపొడుచుకొని విన్నాడు. ఆ ధ్వని దక్షిణ వేపు గోడదగ్గరనుంచి వస్తున్నట్లు తోచింది. అనుమానంతో అతను తన ప్రక్కనే పడుకొన్న తమ్ముణ్ణి నిశ్శబ్దంగా లేపి ఇద్దరూ కలసి దక్షిణపుగోడ వేపు వెళ్లారు. వారికి 5, 6 గజాలలో ఒక నల్లని స్వరూపము గోడమీద ఏదో పొడుగాటి పనిముట్టుతో కొట్టుచున్నట్లు కానవచ్చింది. కిరణ్ వెంటనే 'దొంగ, దొంగ' అని అరుస్తూ ఆ నల్లటి స్వరూపం దగ్గరకు వెళ్లిపోయినాడు. ఆ నల్లటి స్వరూపం దక్షిణపు వేపు ప్రహరీగోడ తలుపు తీసుకొని పరుగు లంకించుకొంది. కాని కిరణ్ అరుపులకు, దక్షిణపువేపు ఇంట్లో ఉన్న మునసబు తన యింట్లో కావలికి పడుకొన్న వెట్టితో సహా మేల్కొని, కిరణ్ యింటి వేపు చూడగానే, పరుగెత్తుతున్న నల్లటి స్వరూపం కనిపించింది. మునసబు వెంటనే ఆ దొంగని వెంబడించాడు. దొంగ కొంత దూరం పరుగెత్తి, ఇక పరుగెత్తలేక మునసబుకు పట్టుబడ్డాడు. ఈలోగా ఊరు అంతా మేల్కొంది.

కిరణ్ ఇంట్లో దొంగ కన్నం వేయబోయినాడని అందరికీ తెలిసింది. దొంగ ఆకారం పరికించి చూస్తే, అతనొక బుడబుక్కలవాడని తేలింది. ఆ వూరిలో క్రొత్తగా పోలీసుస్టేషను పడి సంవత్సరం కావచ్చింది. మునసబు ఆ దొంగను పోలీసు స్టేషనులో అప్పచెప్పాడు. కిరణ్ ఆ దొంగ తన యింట్లో కన్నం వేసినట్లు స్టేషనులో స్టేటుమెంటు యిచ్చాడు.


పోలీసులు ఆ బుడబుక్కలవానిని ఒక చీకటికొట్లో వేసి రాత్రిఅంతా నుజ్జునుజ్జుగా తన్నారు. అతని పేరు విస్సన్న అని, వాళ్ళ జట్టుఅంతా వూరిబయట 2 మైళ్ళలో ఉన్న కాలవగట్టున గుడిసెలలో ఉంటున్నారని అతను చెప్పాడు.

అమరునాడు పోలీసు సబ్ ఇన్స్పెక్టరు మరి కొంతమంది పోలీసులతో కలసి, విస్సన్న చెప్పిన గుర్తుల ప్రకారం బుడబుక్కలవాళ్ల గుడిసెలకోసం గాలించారు. కాని ప్రయోజనం లేకపోయింది. వాళ్ళెక్కడా ఆ స్థలంలో నరసంచారం కనిపించలేదు. విస్సన్న మోసపుచ్చాడని తెలుసుకొని స్టేషనుకు తిరిగివచ్చి ఆరాత్రివాణ్ణి నానాహింసలు పెట్టారు. విస్సన్న ఆ దెబ్బలకు తెలివి తప్పిపోయాడు. మూడవరోజు ఉదయం విస్సన్న తమ జట్టుఉన్నస్థలం గుర్తులు చెప్పాడు. కాని పోలీసులునమ్మక, వాణ్ణి వెంటపెట్టుకొని తమకు దారిచూపమన్నారు. వాడు గత్యంతరం లేక, ఆవూరికి నాలుగుమైళ్ల దూరంలో అడవిలో తమ జట్టువాళ్లు ఉన్న గుడిసెలదగ్గరకు తీసుకెళ్లాడు. పోలీసుజనాన్ని, కొంచెం దూరంలోనే కనిపెట్టిన, విస్సన్న గుంపువాళ్ళు, తమ ఆడవాళ్లను పిల్లల్ని అక్కడే వదిలిపెట్టి పలాయనం చిత్తగించారు.

పోలీసులు అక్కడవున్న పది పదిహేను గుడిసెలలోను జొరబడి కనపడ్డదల్లా ధ్వంసం చేశారు. ఆడవాళ్లనూ, పిల్లల్నీ కొట్టారు. గుడిసెలన్నీ గాలించారు. కాని పోలీసులకు నగలు, నాణాలు ఎక్కడా కనపడలేదు. చిన్న-చిన్న వస్తువులను ఎవరోయిస్తే, తమవెంటనే ఉన్న విస్సన్నను వాళ్లగ్యాంగు డబ్బెక్కడ దాచారో చెప్పమని పీడించారు. వాడు చాలాసేపు మొండికేశాడు. కాని పోలీసులబూట్ల కాళ్ల తన్నులు, బాయొనట్లపోట్లు పడలేక తమ గ్యాంగు డబ్బుదాచిన స్థలం చూపించాడు. గుడిసెలకు దూరంగా ఒక గుంటలో నాలుగయిదు కుండలు పాతిపెట్ట ఉన్నాయి. పోలీసులు ఆ కుండలను ఒక్కొక్కటి త్రవ్వితీశారు. వాళ్లకళ్లు జిగేలుమన్నాయి. ఆ కుండలలో అనేకమయిన వెండి, బంగారు నగలు, ఆభరణాలు, రూపాయలు ఉన్నాయి.

(11-వ పేజీ చూడండి)

చిన్న కథ:



మోటార్ కారు బూర 'ప్రుఁయ్' మనిపించి గోపాయి కళ్లెం ఓరగా సూశాడు సెంద్రం.

నరసిమ్మారావు గోరి అద్దాల మేడ ముంగల ఆవరణంలో దగదగ మెరుస్తాండ ఆ ఎర్ర కార్లో డ్రైవరు సెక్రం కాడ కూకుని నరసిమ్మారావుగోరి కొడుకు సెంద్రం కారు బూర 'ప్రుఁయ్' మనిపిస్తుంటే ఆరి యింటి గుర్రబ్బండి తోలే ఎంకన్న కొడుకు గోపాయి కారుకు రెండుబారల యివకాడ సేతులు ఎనిక్కి యిరుసుకు నిలబడి కారు కళ్లీ, సెంద్రంకళ్లీ యింతగా సూత్తుండాడు. అది నరసిమ్మారావుగోరు సెన్నపట్నంచి కొనుక్కు తెచ్చుకున్న కొత్త మోటార్ కారు

"ఆ బూర ఎంత కరీదవుద్ది అబ్బాయి గోరూ?" అడిగాడు గోపాయి.

"అబ్బో చాలా ఖరీదు." అన్నాడు సెంద్రం ఆ బూరని సల్లగా రుద్దుతూ

"సాలా అంటే - ఓ పది రూపాయ లుంటదా?" అనడిగాడు గోపాయి.

"పదీ? హుఁ!" అన్నాడు సెంద్రం ఎటకారంగా.

"యింకా సానా కరీదుంటదన్నమాట." అన్నాడు గోపాయి.

"పదిపదులు నూరు రూపాయలకు పైనుంటుంది." అన్నాడు సెంద్రం.

"యింకా పైనుంటదిగా!" అంటూ అటనే నోరుదెరిసి నున్నగా మెరుస్తుండ బూరకళ్లి మరింత గట్టిగా సూశాడు గోపాయి

"అవ్ లెక్కేంటి! అసలు కారు ఎట్లా వుందో చూశావా ధగధగ మెరుస్తా? యీ మొత్తం భూప్రపంచంలో యిట్టాంటి కారు యింకెవరికీ లేదవాల్సిందే తెల్సిందా? మా కారు!" అన్నాడు సెంద్రం బూరను రెండుసేతుల్తో దువ్వుతూ

"బూర నేనోపాలి వొత్తనంటయ్యా?" అన్నాడు గోపాయి

"అమ్మో, హారన్ వొత్తుతావుగా! భలే! అసలు యిందాక నీకు నేను చెప్పలేదూట్రా కారును ఎవరూ తాకకూడదనీ? నీ కసలు చాతకాదు వొత్తటం చేతగానివాళ్లు ముట్టుకుంటే పూరికేనే చెడిపోతుంది" అన్నాడు సెంద్రం

"అంతలావు కరీదుగలది ఒక్కపాలి యిట్ట వొత్తుతేనే సెడిపోద్దా?" అన్నాడు గోపాయి బిక్కమొగంతో.

"నీ చేత్తో ముట్టుకుంటే మరకపడ్తుంది అసలే మా నాన్న కారును ఎవర్నీ ముట్టుకో నివ్వద్దన్నాడు - ఏం మస్తాన్ నిజంగా మా నాన్న అన్నా? చూడ యిగోపాయి హారన్ వొత్తుతాట్ట." అన్నాడు సెంద్రం కారు డ్రైవరు మస్తాన్ అక్కడికి రాటం సూసి.

"ఏయ్ అవతలికిపో - ఏంటి వొత్తేది - మజాఖా, తమాషా?" అన్నాడు మస్తాన్ కారు దగ్గరకొచ్చి బీడీ దమ్ము ఎగబీకుతా.

గోపాయి ఎనకెనక్కి జరిగెళ్లి మెట్ల పక్క అరుగు మొత్తకాడ నిలబడ్డాడు కారుకళ్లి అటనే సూత్తా.

ఏం మారాజ్ గుర్రబ్బండి యీడా అగుపించదేం అమ్మగారు ఎక్కడకన్నా ఎళ్లారా?" అన్నాడు మస్తాన్ సెంద్రంతో

"వుహుఁ, మా అమ్మ యింక గుర్రబ్బండి అక్కర్లేదు అమ్మేయమంటే మా నాన్న అమ్మేస్తున్నాడుగా యింక మా అమ్మ మా కొత్తకార్లోగాని యింకెక్కడికీ వెళ్ళదు" వెంకన్న గుర్రం, బండినీ ఏవూళ్లోనో అమ్మి రావటానికి వెళ్లాడుగా" అన్నాడు సెంద్రం

"యింకా గుర్రంగిర్రం జేన్కి మారాజ్ దానా ఖరాబ్ గాని, మరి గుర్రంపోతే యీ ఎంకన్న ఏంచేస్తాడ్ మారాజ్?" అన్నాడు మస్తాన్

"వాడిపెళ్లాం వీరమ్మ గోపాయిలతోపాటు యింక మా తోటపనే చేస్తాడు. ఎంకన్నవాళ్లు మా తోటలో చాలా ఏళ్లనించి వున్నారు పాపం వెంకన్న గుర్రాన్ని అమ్మితేంటే ఏడుస్తున్నాడు. నిజంగా మస్తాన్ మా గుర్రం ఎంత మంచిదనుకున్నా? గుర్రం కనపడకుండా వుంటే తోచటంలా." అన్నాడు సెంద్రం.

"యీనాడు గుర్రబ్బండేంటండి మారాజ్ కొంటే యిస్మంటు కారు కొనాలిగానీ, అయ్యగారు మనకార్లో బిజిలీకి మాదిరి విళ్తుంటే జనం చూశారా ఎట్ట యర్నపడి చూస్తారో? దర్జా జోర్సె వుండాల మారాజ్" అన్నాడు మస్తాన్.

సెంద్రం బూర 'ప్రుఁయ్' మనిపించాడు. బూరమోత యి నేతలికి యీ పాలి ఎందుకో గోపాయివొళ్లు జలబుట్టినట్టయింది. సెంద్రం తనని బూర వొత్తనియ్యనన్నాడు గుర్రబ్బండి గెంట తను ఎన్నిసార్లు వాయిం

చలా ? తనూ సెంద్రం కలిసి గుర్రబ్బండి మీ నెక్కి గంటవాయిస్తా ఎన్ని సార్లు ఆడు కోలా ? యీయాల కొత్త కారొచ్చేతలికి సెంద్రం కారు దిగటంలా, ముట్టుకుంటేనే మాసిపోద్దంట ! అయ్య గుర్రాన్ని తోలేసి రాటానికి పోయ్యాడు గుర్రబ్బండి లేక పోతే అయ్య ఏంజేత్తాడు ? అయ్య ఎటనో వుండాడు గుర్రాన్ని తోలికెల్తా ఆ గుర్రముంటే అయ్యకు పానం ఎసువంటి మన గాడిగుర్రం ! అయ్యతో గుర్రబ్బండయితే తను ఎక్కాడుగాని యీ మస్తానయ్య తేనని కారు సాయలకన్నా రానియ్యడం అయ్యకి కారు నడపటం ఎప్పటికీ జాతకాదు యిగ కారుమీన దుమ్ముగిమ్మేవన్నా పత్తే తుడుత్తూ కూకోవల్సిందే అయ్య - అనుకుంటూ సల్లగా తోటలో గుడిసె ఏపులకి ఎల్లాగు గోపాయి

ఎనక ఎప్పుడో ఎంకన్న అయ్య పుల్లన్న ఏటవతల ఎటునుంచో వొచ్చి నరసిమ్మారావుగోరి నాయన ఎంకట్రావుగోరు బాగా వడుసుదనంలో గుర్రాలమీన గుర్రాలు మార్చి స్వారీకొడుండ రోజుల్లో ఆరికి బీడు గట్టి పడుండ కాళీ స్తలంలో కొచ్చి గుడిసేసుకొని కాపురంబెట్టాగు కొన్నాళ్లకి బీడు గటిన కాళీ స్తలం మేలురకం మామిడి తోటయి లెగిసింది పుల్లన్న వొచ్చిన యాలాయిశేషం ఏమిటో అప్పట్నుంచి వెంకట్రావుగోరు గుర్రాలస్వారీ మోజు తగ్గిచ్చుకొని ఓ గుర్రబ్బండితో మటుకు తృప్తిపడి యిల్లు సక్కబెట్టకోటం మొదలుబెట్టాగు దుబారా అయ్యే సొమ్ము మల్లీ గెట్టిపడేతలికి యిగ ఎంకట్రావుగోరి కుటుంబాన్నే అంటిబెట్టుకు నుండాడు పుల్లన్న కుటుంబం

ఎంకన్న అయ్య పుల్లన్న దారినే నడిశాడు తను నరసిమ్మారావుగోరి గుర్రబ్బండి తోల్తా ఆ గుర్రం మంచీ సెడు సూసుకొంటూంటే పెళ్లాం యీరమ్మ ఆరుగురు పిల్లల గలదయినా అంత పెద్దతోటకు బలం పెట్టి పెంచుతూ మద్ది మద్ది నరసిమ్మారావుగోరి యింటిపనుల్లో దానికి దీనికి సాయపడ్తుంటుంది తోటమీన వచ్చే ఆదాయం నరసిమ్మారావుగోరి కుటుంబానికీ ఎంకన్న కుటుంబానికీ మద్ది సంబంధాల్ని గట్టి సేసింది

నరసిమ్మారావుగోరు కొత్తకారు కొనుక్కొచ్చి గుర్రబ్బండిని అమ్మమనేతలికి ఎంకన్నకు వడదెబ్బ తిన్నట్టయింది ఆ గుర్రాన్ని ఎంకన్న కడుపున పెట్టుకున్నట్టు సాకడం అట్టా వుంచి ఎన్నేళ్లనుంచో ఎంకన్నా ఆగుర్రం కావల్సిన మడుసులు మాట్లాడుకుండట్టు మాట్లాడుకుండారు గుర్రబ్బండి ఎప్పుడు తోల్తుండా గుర్రం కదలిక సూసి మురిసిపొయ్యే ఎంకన్న నరసిమ్మారావుగోరి అవసరానికి బండి తోల్తుండట్టు ఎప్పుడు అనకోలా

గుర్రాన్నీ బండినీ అమ్మేసి నిశిరేత్రి తిరిగొచ్చిన ఎంకన్న తనకి తెలవకుండానే ఎకాఎకిన మామూలుగా గుర్రాన్ని కట్టేసే సోటుకెల్లి గుర్రం మేతకు పచ్చిగడ్డి గోనె సంచీకోసం ఎతకటం మొదలుబెట్టాగు ఎంకన్నకు కూసేపటికిగాని తెలిసిరాలా తను యింకా గుర్రం వుండదనే బెమలో పచ్చి గడ్డి ఎతుకుతున్నాడని

మరసనాడు మట్టిగిట్టె పట్టకుండా కొత్త కారును సూసుకుంటుండమని ఎంకన్నతో సెప్పాగు నరసిమ్మారావుగోరు

“బొత్తిగా పలకటమే తగ్గించావేం దమ్మోయ్ ?” అంది యీరమ్మ ఓ నిశిరేత్రి ఎంకన్నతో

“ఆఁ - ?” అన్నాగు ఎంకన్న బలవంతాన నిదర్లాగిసినట్టు

“పలకరిత్తేనే వులిక్కి పడ్తుండావే !” అంది యీరమ్మ

“ఏంగో పలకరిచ్చేదీ ?” అన్నాగు ఎంకన్న

“పలకరిచ్చేదేందీ ! అయితే యిగ నవ్పెళ్లాం దిబ్లో పలకవెట్టా ?” అంది యీరమ్మ

“ఎవురే పలికేందీ ?” అన్నాగు ఎంకన్న పక్కకుతిరిగి పండుకొంటూ

“ఎవురా ! నీకేదో గాలిబట్టింది” అంది యీరమ్మ ఎంకన్నను మల్లీ పక్కకు లాగుతా

“ఏహా వుండూ నిశిరేత్రి నస మొదలు బెట్టావుగానీ -” అన్నాడు ఎంకన్న

“ఎవురేం మొదలుబెట్టలా నస యిసుక్కొంటుండావు కాని యిన్నాళు లేంది యీయాల నసబెట్టినట్టుందొట్టా ?” అంది యీరమ్మ దులిపినట్టు

“యీరమ్మ కొత్తె గట్టిగా మాట్లాడ్తుండట్టు గెహించాగు ఎంకన్న

“యిదిగో నిన్నెవరేం కాదంటం లేగు గానీ కొత్తెమడిసి ఎట్టుండాడో కనిబెట్టి మాటాడ్తుండు నువు” అన్నాగు ఎంకన్న

“యీడ నిన్ను గాకపోతే యింకెవుర్నేం కనిబెట్టుకు నుండంలా తెల్సిందా ఎందుకో ఎటనో అయిపోతుండావు పలకరిత్తే ఎటుగానో సూత్తావుంటావు యిన్నకాడ ఆడగూతురు మనస్సు ఎట్టయితుండదో నీకు తెలవటంలా” అంది యీరమ్మ ఎంకన్న సేతిమీన సెయివేసి

“గుర్రం పోయినాట్టినుంచి మనసు ఎటనో వుంది లేయే” అన్నాడు ఎంకన్న

“బాగుంది, అందుకు ఎవుడేంజేత్తారూ అయ్యగోరు తన గుర్రాన్ని తను అమ్ముకుంటే మనకెందుకు కష్టం మద్దినా ? కొత్తగా మోటారి కొనుక్కున్నాక గుర్రం కరుజు ఆరికి ఎక్కువ కాదట్టా ? ఈ కరువు దినాల్లో నలుగురు తినే తిండి మేసుద్ది గుర్రం” అంది యీరమ్మ

“ఎన్నాళ్లనుంచో ఆ గుర్రంతో బతికినోణ్ణి గనక నా కష్టం నీకు తెలవదు లేయే ఆ గుర్రాన్ని తోల్తూంటే ఎంకన్న ఎవురో పదిమందికి తెల్చాడు గాని యియాల ఎంకన్న ఎవుడంట ? యీ ఎంకన్న యియాల - ఆ మస్తానయ్యా కదలకండా సెక్రంకాడ బీడీ దమ్ము పీకుతుంటే - కారు దుమ్మనంటే దులిపేదీ ? సెక్రం తిప్పినంత మాత్రాన మస్తానయ్య మనగాడయినాడా ? నాకు కారు దుమ్ముదులపటం సేత కాదంట !” అన్నాడు ఎంకన్న

“ఎవురా మాటందీ ?” అంది యీరమ్మ

“ఎవురో అంటే అంత కష్టంగుండగు ఆ మస్తానయ్యా యీ ఎంకన్నను ఆ మాటంటం ? మరి రోజులు అట్టొచ్చినై” అన్నాగు ఎంకన్న

“యీడిజిమ్మడా” అంది యీరమ్మ

“కూకుంటే సెక్రంకాడ కూకుంటం, లేకపోతే బీడీదమ్ము పీకుతా కాళ్లు బార్జాపి పండుకోటంతప్ప యీ పేయిదింగా మనగాడంటా ?” అన్నాడు ఎంకన్న

అట్టనమోకయ్యేవ్ యీయాల కారు గొప్ప నీకూ నాకూ తెలవకపోతే యిరగబడి సూత్తుండ వూరిజనంగురించి ఏమనుకోవాలా ? యింత తిండికి ఏళాకరవుతేఏం, ఆరుయింత పెట్టినన్నాళ్లు అదే మనకు పదేలు” అంది యీరమ్మ

“కారుదుమ్ముదులపటం, మస్తానయ్యకు బీడీలు కొనుక్కురాటం - అదీ ఒకపనేనంటే ? ఎంకన్న దద్దమ్మని లేసనరంటే నన్నూ ?” అన్నాడు ఎంకన్న

ఎంకన్న యీపుమీగ సల్లగా రుద్దుతా “తోటపని సేసుకుంటే మనని ఎవురేం అనరు” అంది యీరమ్మ

నరసిమ్మారావుగారి మామిడి తోటలో పెద్దబావికి మోటారింజను తగిలిస్తారని వూరంతా మోగిపోయింది

మామిడితోట పెద్ద కాపికాడ అగుపించాడు గోపాయికి సెంద్రం సిటారు కొమ్మన కనపడకుండా దాంకుని మిగిలిపోయిన మామిడిపండు కోసిస్తే సెంద్రం గోపాయిని యీమద్దె కొరు బూర తొకనిచ్చాడు

"ఏం అబ్బాయిగోరూ ?" అని పలకరిచ్చాడు గోపాయి సెంద్రాన్ని

"మా భావికి మోటారు పెడ్తున్నార్రా గోపాయ్ " అన్నాడు సెంద్రం నవ్వుతా

"బాయికి మోటారు తగిలిత్తారా? అదేందండి అబ్బాయిగోరూ ?" అన్నాడు గోపాయి

"మోటారంటే మనుషులెక్కే మోటారు కాదురా, నీళ్లు తోడే మోటారు యింక మా మేడమీదకు నీళ్లొస్తాయి సంపులు పెట్టంగానే " అన్నాడు సెంద్రం

"మోటారు నీలు తోడుద్దా!" అన్నాడు గోపాయి నోరు దెరిసి

"నీ మొహం నీకేం తెలియదు గొట్టాలు భావిలోకి దింపి మోటారుయింజను ఒక్క నిమిషం ఆడిస్తే ఏనుగు తొండమంత ధార పడి కాసేపట్లో యీ తోటంతా తడిసిపోతుంది " అన్నాడు సెంద్రం

"ఆఁ! మరి మా అయ్య అమ్మోళ్లు ఎన్ని నీలయినా ఏతాం ఎత్తుతారుగా?" అన్నాడు గోపాయి

"యింక ఏతాం ఎత్తక్కర్లేదు మనిషి తోడకుండానే ఎన్నయినా నీళ్లొస్తాయి మాకు " అన్నాడు సెంద్రం

ఓ మంచిరోజున మామిడితోట పెద్ద బావిలో మోటారింజను దడదడ్లాడింది

తెల్లారి లెగిసింది మొదులు పొద్దు గూకేదాకా రెక్క విరుసుకుంటూ ఏతాం ఎత్తే కష్టం యిప్పుడు ఎంకన్న కుటుంబానికి తప్పింది అసలు నరసింమ్మారావుగోరింటికి ఎంకన్న కుటుంబం సేసే కష్టం యిప్పుడు దాదాపు ఏమీ లేదనే సెప్పుకోవాలి ఒకిదంగా ఆరింటో సిల్లర బొల్లర పనికి ఎంకన్న కుటుంబం వున్న పాళంగా సానా పెద్దది

"ఏం పని చేస్తున్నారు వెంకన్నా ?" అని నరసిమ్మారావుగోరు ఎంకన్న కుటుంబాన్ని గురించి మంచీ సెడు కనుక్కుంటున్నాడు రోజు

"ఏం కష్టున్నాయి దొరా బొత్తిగా సేతులు పడిపోయినట్టున్నాయి " అనేవోడు ఎంకన్న.

"నడుంవొంచి పనిచేసేవారికి చేతినిండా రోజూ పని లేకపోతే శిక్ష వేసినట్టుగా వుంటుంది బయట ఎక్కడయినా వస్తుంటే మీరు చేసుకుంటూవుంటం మంచిది వెంకన్నా " అన్నాడు నరసిమ్మారావు గోరు ఓరోజున కష్టంగా

"యిన్నేళ్లు తమను కనిబెట్టుకు బతికిన యీ జీవాలకి యీ వూళ్లో యింకోసోట మొగం ఎట్ట సెల్లుద్ది దొరా " అన్నాడు ఎంకన్న తలొంచుకుని

యీ కరువు రోజుల్లో తన కుటుంబం నరసిమ్మారావుగోరింటికి గుదిబండయిందని గెహించాడు ఎంకన్న

"అమ్మగారు తెగ యిసుక్కుంటున్నది- ఎట్టనయ్యా ?" అన్నది యీరమ్మ ఎంకన్నతో ఓరేత్రి

"మనం ఎటయినా ఎల్లిపోవాల్సిందే " అన్నాడు ఎంకన్న

"ఎటు పోదాం-?", అంది యీరమ్మ కొళీనాపులు నూత్తూ

"వువు ముంగల మాటలుగట్టు నూద్దాం" అన్నాడు ఎంకన్న గట్టిగా

ఓ కలిసొచ్చే మంచిరోజున తొలి కోడి కుయకతలికే పిల్లల్ని నిదర్లేపి మూట లెత్తుకుండారు ఎంకన్న కుటుంబం గుడిసెలోంచి బయటికొచ్చినాక సుట్టూతా సీకట్లో ఓపాలి నూసి "తలుపు గొళ్ళెం బెట్టు " అన్నాడు ఎంకన్న బార్లగా తెరిసి కాళీగావుండ గుడిసెను నూసి

"అయ్యా యాడకి మనం పొయ్యేది-?" అన్నాడు గోపాయి యింకా నిదర మైకం వొదలక

"అరవమాకండి - ముందు ఇక్కణ్ణుంచి పదండి దబ్బున - " అన్నాడు ఎంకన్న ముందు బయల్దేరుతా యింకా సీపిట్లో సీకట్లో కలిసిపోయారు ఎంకన్న కుటుంబం

★

ఎవరు దొంగ?

(8-వ పేజీ తరువాయి)

దాదాపు వెయ్యిరూపాయి నాణాలు దొరికినయి నగలవిలువే షుమారు మూడు వేల రూపాయలదాకా ఉంటుంది

సబ్ ఇన్‌స్పెక్టరు, పోలీసులు ఆకుండలను జాగ్రత్తగా స్టేషనుకు చేర్చారు కాని క్యాష్ రిజిష్టరులోగాని, ప్రాపర్టీ రిజిష్టరులోగాని, ఈ ఆస్తిని పోలీసులు నమోదు చేయలేదు ఆ డబ్బంతా మూడు భాగాలుచేసి ఒక భాగం ఇన్‌స్పెక్టరు తీసుకొన్నాడు మిగతా రెండుభాగాలు పదిమంది పోలీసులు పంచుకొన్నారు.

నాల్గవరోజున సబ్ఇన్‌స్పెక్టరు విస్సన్నను బస్సులో 8 మైళ్ల దూరంలో వున్న సబ్ మేజిస్ట్రేటు దగ్గిర హాజరు పెట్టి తన ఊరిలో దొంగతనానికి కన్నంవేసిన నేరం కింద పోలీసు కేసు రిజిష్టరు చేయించాడు విస్సన్నను సబ్ జైలుకు పంపారు

తరువాత సబ్ ఇన్‌స్పెక్టరు ఛార్జిషీటు మేజస్ట్రేటు కోర్టులో దాఖలు చేశాడు పదిహేనురోజుల తరువాత విస్సన్నను కోర్టులో హాజరు పెట్టారు మేజస్ట్రేటుఎదుట కిరణ్, మరికొంతమంది గ్రామస్థులు కోర్టుకు హాజరైనారు కోర్టులో కిరణ్ 'విస్సన్న తనయింట్లో దొంగతనానికి కన్నం వేస్తూంటే పట్టుకొన్నట్టు చెప్పాడు ఇద్దరు ముగ్గురు గ్రామస్థులు దానికి సాక్ష్యమిచ్చారు మేజస్ట్రేటు విస్సన్నను 'నీమీద నేరం ఋజువయింది నీవు చెప్పుకొనేది ఏమన్నా ఉందా' అని అడిగాడు


విస్సన్న "ధర్మప్రభువులు మీరు నా మాట చిత్తగించాలి నేన దొంగతనం చేయటానికి కన్నంవేసిన మాట నిజమే కాని పోలీసులు నన్ను చితకబాదారు చూడండి బాబూ నావంటి మీద దెబ్బలు గనపడక పోయినా నావంట్లో ఎముకలన్ని ఇరిగినట్లు మహాబాధపెట్టున్నాయి దానికిమీరు ధర్మప్రభువులు న్యాయందయచేయించాలి " వెంటనే సబ్ ఇన్‌స్పెక్టరు మేజస్ట్రేటుతో "అదంతా వట్టిఅబద్ధం కల్పన మేము వాణ్ణి అసలు ముట్టుకో లేదు, సార్" అని చెప్పాడు. మేజస్ట్రేటు అవునన్నట్లుగా తల ఊపాడు

విస్సన్న! "బాబూ నాది ఇంకో విన్నపం గూడా ఉందండి ఈ పోలీసు వాళ్లు మా గుడిసెలో ఎన్నాళ్లనుంచో దాచుకొన్న నాలుగయిదు వేల రూపాయలు కాజేశారు" అని మొత్తుకొన్నాడు

కాని దొంగమాటలు ఎవరు లక్ష్యపెడతారు? దొంగ ఇంకొకరిమీద దొంగతనం వేస్తే, ఎవరు నమ్మతారు? కోర్టులో విస్సన్న మాటలు గాలిలో కలిసిపోయాయి మేజస్ట్రేటు విస్సన్నకు ఆరునెలలు ఖైదు వేశాడు బోనులోనుంచి పోలీసులు విస్సన్నను జైలులోకి తీసుకొనివెళ్లారు పోలీసులమీద పబ్లికుకోర్టులో దొంగతనం ఆరోపించినందుకు అతనిని ఎముకలలో సున్నం లేకుండా పోలీసులు మెత్తగా తన్నారు

పోలీసులు మెత్తగా ఎముకలు విరగకొట్టగలరని విస్సన్నకు ఆరోజుతో తెలిసింది

★



రఘు - 26 ఏండ్లు- బీదవాడు.
శంకర్ - 27 ,, - జమీందారు
శిరీస్ - 22 ,, - జమీందారు
[కుమార్తె
గుమాస్తా-50 ,, - శిరీస్ గారి
[గుమాస్తా

[భుజంమీద చినిగిపోయిన చొక్కా - మాసిన పంచె - భుజంమీద చాకలి మడత విప్పిన తువ్వాలుతో - పట్నంలోని క్లబ్బుకు రఘుబాబు - తన మిత్రుడైన శంకర్ దగ్గరకు వచ్చును]

శంకర్ [నవీన పద్ధతులలో వేషం - కుర్చీలో కూర్చుని వార్తాపత్రికలు తిరుగ వేయుచుండును]

రఘుబాబు నమస్తే శంకర్! క్షేమమేనా?

శంకర్ ఓ రఘు! ఇదే నా రావడం - చాలాకాలానికి కనిపించేవు - మీ ఊరి నుండేనా?

రఘు అవును ఈ వేళ ఉదయం పది గంటలకు బయలుదేరి యిక్కడకు వచ్చేటప్పటికి ఆరుగంటలయింది (కుర్చీలో కూర్చొనును)

శంకర్ కార్లూ బండ్లూ దొరికలేదా? యింత ఆలస్యం అవడానికి కారణం?

రఘు కావలసినన్ని కార్లూ బండ్లూ సుఖం అనుభవిస్తున్నవారికి! కొద్దు దుమ్ము కాలితో వచ్చేను

శంకర్ *I am very sorry friend* మనం చదువుమానిన రెండేళ్లకు యిప్పటికి చాల మారిపోయావేమిటి రఘూ?

రఘు హాలాహలాన్ని మింగగలిగే శక్తి ఈశ్వరునకున్నది అటువంటివాడు కనిపిస్తాడేమోనని తిరుగుతున్నాను కాళ్ళీడ్చుకుంటూను

శంకర్ చిక్కులు చుట్టుకొని ఉన్నాయన్నమాట - ప్రస్తుతం ప్రపంచ సమస్యంతా చిక్కులతోనే నిండివున్నది

రఘు ధనమెచ్చిన మానవులు లేనిపోని అనుమానాలతో తాము నశించకుండ చేసే ప్రయత్నాలు పరులను చిక్కులు పెట్టడమే తీరలేని ప్రపంచసమస్యగా మారింది

శంకర్ మనస్సు నిలకడలేనిమీదట - దరిద్రం - హెచ్చవుతుంది అది ధనికులను తుడిచివేస్తున్నది ఏమంటావు రఘూ?

రఘు మీరు మింగలేని వస్తువును - కొంచమైన యిచ్చి - చూస్తుండమంటున్నారు వాళ్ల విశ్వాసాన్ని

శంకర్ ఒకళ్లా, యిద్దరా? ఇద్దరి పిల్లలను వొక్కసారి కనగలదా?

రఘు ఎంతో బరువుగల్గి - ఎన్నో వస్తువులను - ఒక్క క్రిను మోసి - ఎక్కడ వుంచవలసివస్తే అక్కడుంచేటట్లు చేస్తున్నది

శంకర్ మేము కొంగల్లాంటి వాళ్లమంటావు?

రఘు ముమ్మాటికి నిజం - నిజంకూడ అంతే - మీకు ఆహారం దొరకడం దుర్లభమైపోదు?

శంకర్: మరో విధంగా జీవించలేమంటావా?

రఘు ఎందుకు జీవించలేరు? చెవికి - చెవిలో గులిమికి దెబ్బలాట రాగానే - అగ్గిపుల్లలు, చీపురుపుడకలు - గులిమితెగ్గ మొదలైన సామగ్రి పంపించుటచేతనైన పనేగా?

శంకర్ ఫలితం?

రఘు ఆయుధాలు పంపినవారికే—

శంకర్ సర్వం తెలిసి చిందులు త్రొక్కడం దేనికి?

రఘు ప్రతిఒక్కరు సుఖంకోరనివాళ్లే వుంటే బలవంతంమీద, సుఖం సమానంగా లభిస్తుంది

శంకర్ యింతకు - ఎవరంటావు?

రఘు కయ్యానికి కాలుదువ్వనిదే - కంగారుపడుతూ - ఎదుట వాళ్ళను రెచ్చగొట్టేవాళ్లు

శంకర్ ఇంతచదువు చదివి ఈవిధంగా అయిపోయేవేమిటి, రఘు?

రఘు చెప్పేనుకాదూ, శస్త్రచికిత్స చేసేవానికి దయలేకపోతే రోగి గతి ఏమవుతుంది?

శంకర్ విషమ పరిస్థితి తినివేస్తున్నదన్నమాట?

రఘు తినివేసింది జీవచ్ఛవాన్నై యున్నాను బొప్పులు తగిలించుకోడానికి పూనుకున్నాను

శంకర్ బొడిపిలు కొద్దిరోజులకు తగ్గిపోతాయిగా?

రఘు బాధను మరచి పోవుటనేది కవి కలం పట్టినపుడు కలంపట్టిన పలుకులు కలకాలం లోకంలో నిండుకుండ

శంకర్ నీ భావం బరువుగావున్నదే?

రఘు బాధయొక్క ఘనపరిమాణం

శంకర్ మీ తల్లిదండ్రులు - క్షేమమేనా?

రఘు శ్రౌత్రీవస్త్రాలను ధరించేరు

శంకర్ అయ్యయ్యో! ఎంతకాలమయింది?

రఘు సంవత్సరం రమారమి

శంకర్ నీ ఆస్తిపాస్తులు?

రఘు ఆస్తిపాస్తులు గలవాళ్లు తీసుకున్నారు

శంకర్ : చిల్లుగవ్వ కూడా లేదా?

రఘు వుంటే - నీకు రోడ్డు దుమ్ము చూపించడ మెందుకు?

శంకర్ : ధనాన్ని కోరివచ్చేవా?

[గుమాస్తా - శిరీస్ కుమారితో కలసి శంకర్ వున్నగదిలోకి ప్రవేశిస్తూ]

గుమాస్తా ఆ రఘుబాబు అంత వ్యతిరేకంగా మాట్లాడుతా డనుకోలేదు

శిరీస్‌కుమారి ఎంతకాలం మాట్లాడుతాడో చూస్తానుగా - సినీమా ప్రపంచం అనుకున్నాడా?

రఘు (ఆలకించి - శిరీస్‌ను చూచి) ముమ్మాటికి సినీమాలోకమే బుద్ధులు లేనివాళ్లే బుద్ధులు గ్రహించడానికి బయలుదేరుతారు బిరుదులు సంపాదించి-కొనుక్కొని ప్రజలకు పత్రికలద్వారా, సభలలోను - ప్రయోజనాలు పంచిపెడతారట సంగీతంపాడే హృదయంలో ఆ మృదుత్వము పాడినతరువాత వుంటుందా అనుకుంటాను కవి కలం దింపినపిదప ఆ ఉదారభావాలు చూపించుతాడా అనుకుంటాను

శిరీస్ మీవంటి మానవుగుండగా మీరనుకున్నవి ఒక్కటుండవు

రఘు మీ నిర్మల ఐక్యకూటమిలో నేను చేరను - నన్ను చేర్చుకోరు - చేర్చుకుంటే మీ మాటకు నామాట గొడ్డలిపెట్టు

గుమాస్తా బాబూ! అటువంటిభావం వుండబట్టే - బాధలతో - అప్రదిష్టలు పాలుపడి-మీరీ విధంగా వుండవలసివచ్చింది.

రఘు మానవుడు బ్రతికివున్నంత కాలము గౌరవమును వినగలడు-తరువాత?

శిరీస్ చచ్చినతరువాతమాత్రం మంచిచెడ్డలు చెప్పుకోకతప్పుతుందా?

రఘు బ్రతికివుండగా మీ గౌరవము నాకక్కరలేనపుడు చచ్చినతరువాత నిజం చెప్పుకోవడ మెందుకు?

శిరీస్ ప్రక్కయింటివాళ్లను ఇష్టము వచ్చినట్లు దోచుకోవడము మీ దృష్టిలో ముఖ్యం కాదూ?

గుమస్తా శాంతంగావున్న యిండ్లు చూస్తే-మీ రాయబారులను ప్రయోగిస్తుంటారా?

రఘు నీ యజమానుల తరఫున మాట్లాడకపోతే నీకు, దిక్కుదివాణం వుండదని కౌరుకూతలు - ఎంగిలి కూతలు కూస్తున్నావు - నీ యింటి నౌకర్లు మీరు పెరుగుతున్న బాధలు నాతో వచ్చి చెబితే విన్నందుకు వార్ని కొన్ని ప్రశ్నలు వేసినందుకు - నీవు- మీ శిరీస్ కుటుంబాన్ని చూచి భయపడేవారి నందరి సహాయంతో - ఆట ఆడిస్తున్నావు, ఆడించేవు

గుమాస్తా మీరు కలుగజేసుకున్నందుకే-మీ యింటికి ముప్పువచ్చింది

రఘు అన్యాయాన్ని ధిక్కరించడం కొఱకు ఉరికంబాలతోనైనా స్నేహం చెయ్యడం ఉత్తమయువకుని ధర్మం రాజకీయవేత్త, కవి గాయకుడు నిర్మలమనస్సుతో ముందడుగు వేయాలి వీరే నాయకులమని పేర్లు ప్రచారంలోకి తెచ్చుకుంటున్నారు గాబట్టి

శిరీస్ అయస్కాంతసూచికి ధ్రువములు రెండని తెలుసు

రఘు ఒకేజాతి ధ్రువాలు ఆకర్షించుకోవు ధనధ్రువం - బీదధ్రువాన్ని దగ్గరకు లాక్కుంటుంది

శిరీస్ పోనీగదా యని దగ్గరకు చేరతీసుకుంటే వదలిపెట్టడం పద్ధతిలేదు

రఘు పచ్చికర్ర - ఎండుకర్రగాచేసి కూడ - బూడిదచెయ్యక మానటం లేదు మీకు ఇవ్వవలసిన అప్పుకు వడ్డీకి వడ్డీలు కట్టి మా తల్లిదండ్రులకు భయాన్ని చూపింది - వారు చనిపోయిన పిదప - గృహాన్నంతటిని - వేలంవేయించి పైచెయ్యి మీరువేసి - సమస్తం స్వాధీనం చేసుకున్నా వదలిపెట్టక - ఇక్కడకు వచ్చి కూడ - సాధింపులు - పైగా శాంతి స్థాపనకు నడుం కట్టాలి అని ఉపన్యాసాలు - వ్యాసాలూ - గేయాలూ - పాడే మీరు "నిర్మల జీవుల"మని నమ్మింప చేస్తున్నారు అమాయక ప్రజానీకానికి. మీలో వొక్కగుణంకూడ మంచిదిలేదు. బాల్యస్నేహం పెద్దవాళ్లమయ్యేవఱకు వచ్చింది మా తల్లిదండ్రులు చదువుకు పంపిన ధనంతో

గుమాస్తా నీవంటివారు ఈర్ష్యబ్బు పుర్శీ

ల్లోకూర్చుంటే - శిరీష్ - శంకర్ బాబు లాంటి వారి కెలాగుంటుంది ?

రఘు. అవును చినిగిన వస్త్రాలకు విలువగ కనిపించేవి మంచి వస్త్రాలు - ఎప్పుడో - అవి - చాకిరేవు బల్లపై చినుగు పట్టక తప్పదు

[బంట్రోతు కలర్సు పట్టుకువచ్చి వొక్కొక్కరికే యిచ్చును]

శంకర్ రఘు ! తీసుకోనుట లేదేం ?

రఘు దాహం లేనపుడు ప్రేమించుట మూర్ఖత్వం

శంకర్ ఇవన్నీ గొప్పలకోసమంటావు?

రఘు పెద్దవ్యాపకర్తవైన నీవు నా నుండి అనుమానాలు తీర్చుకుంటున్నావా ?

శిరీష్ రఘు ! క్లబ్బుకు వచ్చేవెందుకు?

రఘు మీ కందంకోటకు

శంకర్ రఘు ! నేను వచ్చేవరకు వుంగు. (వెళ్లిపోవును)

గుమాస్తా అమ్మగారు నేను వెళతానండి (వెళ్లిపోవును)

శిరీష్ ప్రాణికి మూలాధారమైన సంతోషాన్ని కోరని జీవికి కష్టాలు ఎదురవుతాయి

రఘు హింసలో - హింస - అంతరించడమే కోరుతున్నాను

శిరీష్ వేదాంతాన్ని తరచిన నీవు - తప్పుడుత్రోవలో పోతున్నావు

రఘు పొరబడుతున్నావు

శిరీష్ నీకు కావలసినంత సూధుర్యాన్నిస్తాను

రఘు అక్కరలేదు

శిరీష్ బాల్యస్నేహంనాటి అనురాగమంతా ఏమయింది, రఘు ?

రఘు అభివృద్ధి పొందింది

శిరీష్. ఏలాగ ? ఈ విధంగానేనా ?

రఘు కాంతులు-కలకాలం - కాపరం చెయ్యవు ప్రస్తుత ఉద్రేకాన్ని ప్రేమించడమే కష్టాలను అనుభవానికి తెచ్చుకోవడము

శిరీష్ ఆర్థిక పరిస్థితులలోనా ? ఈ నిమషంలో నీకు ఎన్నిలక్షలు కావాలి చెప్పు ? ఎన్నాళ్లనుండి నిన్ను పొందాలనే ఆశతో ఎన్నిసార్లు వినిపించేను నీకు- ఈ వయస్సులో - ఈ కాలంలో ఈ విధంగా మారుతావని అనుకోలేదు మీ తండ్రి-మా తండ్రి-మీ అమ్మగారు - మా అమ్మగారు అనుకున్న మాటలు తుడిచిపార వేసేవా, రఘు ?-మీ తల్లిదండ్రుల ఆత్మశాంతికైనా వారు అనుకున్న అభిప్రాయాన్ని నెరవేర్చే బాధ్యత నీలో వున్నది వారనుకున్నది-నన్ను నీకిచ్చి వివాహం చెయ్యడమేగా - ?

నేను సిద్ధంగావున్నాను. నీవు పెద్దల కోర్కెను పోగొట్టుతున్నావు

రఘు చాలా అభిమానం వున్నదే ! అందుకనేనా నా చదువువిషయమై నా తండ్రి తనఖా పెట్టినవన్నీ యిప్పుడు లాక్కున్నారు?

శిరీష్ నీకు నన్నిచ్చి వివాహంచేసి మా యింటిలోనే వుంచివేద్దామని

రఘు మీ యింటికి ఎదురుగానే మా యిల్లు వున్నదిగద - ఆమాత్రందానికి మీ యింటిలో నన్నుంచుకుంటే - నా సంపదనంతటిని కోర్టుకీడ్పించి తీసుకోవడములో అర్థం ?

శిరీష్ నీవు వొక్కడవేనని - పాడైపోతావని - నిన్ను నన్ను - మా ఇంటిలోనే వుంచివేయాలని చేసివుంటారు - మరో విధంగా భావిస్తున్నావా?

రఘు శిరీష్ ! ఆడే అబద్ధం ఆలోచించుకుని ఆడు

శిరీష్ నీకిప్పుడు వచ్చిన లోటేమిటి?

రఘు లోటు కలిగిందని నీతో నేను చెప్పలేదే?

శిరీష్ రఘు - కరుణించవూ - నీ చెయ్యి పట్టుకుని చెబుతున్నాను - నీకు ఏ విధమైన లోటు - అపాయం - రానివ్వని బాధ్యత నాది నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు - మా తల్లిదండ్రులతో నిమిత్తంలేదు కావలసినంత ధనం తీసుకురాగలను - పద -

రఘు శిరీష్ - ధనాన్ని చూపుటలోనే స్వార్థపరత్వం ఇమిడివున్నది

శిరీష్ లేదు - ముమ్మాటికి లేదు. మనసార ప్రేమించేను రఘు-'ఉష' అను

రఘు (ఫట్ మని లెంపకాయ కొట్టి కోపంగా) శిరీష్ ! తీసుకురా నీడబ్బు - ఆడబ్బంతా బీద ప్రజానీకానికి పంచివేస్తాను. నాకు వలెనే మామూలు వస్త్రాలతో వచ్చివేయి - హాయిగ యిద్దరంకలసి న్యాయమైన ధనం గడించుతూ జీవించుదాము - ఏమంటావు ఆలోచించి చెప్పు

శిరీష్ రఘూ ?

రఘు మూర్ఖు డనుకుంటున్నావా, లేదా ?

శిరీష్ • ఎందుకు అనుకోరు ? నీకంటె అందగాళ్లు - ధనవంతులు - ఉత్సాహవంతులు వుండగా వారిని వివాహం చేసుకోవడము మాని నీవంటివానితో మెలగడము ఎప్పటికైనా ముప్పే

రఘు ధనంలేని పురుషునికి స్త్రీవొకరాక్షసి నీవు పట్టుకు వచ్చిన ధనం కలంకాలం వుంటుందని నమ్మకమేమిటి ?

శేఖర్ (వచ్చును) శిరీష్ - ఏడుస్తున్నావేం ? ఏమయింది, రఘు ?

రఘు నేన ?గాగ్రుడ నయ్యెనని

శేఖర్ (రీష్ కన్నీరు తన జేబురుమాలుతో తొత్తుచు) ఏడవకు, శిరీష్ - రఘుమ. ? తెలుసుకోవడము కష్టం

శిరీష్ ?నస్సులు వికసించని చోట కలయిక కుదరదు

రఘు శేఖర్ ! ధనసహాయం ఏమైనా చేయగలవా ? ఎప్పుడో నా జీవితంలో తీర్చుతాను

శేఖర్ రఘు-ఇటువంటి దురవస్థకు గురిఅవుతావని అనుకోలేదు అయినందుకు చాలా విచారంగా వున్నది ఏమిచెప్పాలో తెలియడంలేదు ప్రస్తుతం నాదగ్గర ఏమీ లేదు-మరోవిధంగా తలచకు ఈ విషయంలో-యిప్పుడు-నన్ను క్షమించు-అంతే నేను కోరేది

రఘు (ఒక్క చిరునవ్వు నవ్వి) నా ద్వారా నీకు లాభం ల?ంచేది లేనందుకు విచారిస్తున్నాను, శేఖర్ (వెళ్ళిపోవును)

★

కథానిక:

"దుక్కిటెద్దు దేశాంతరం"

★

"వీరయ్య చెప్పకుండా యిల్లు విడిచి వెళ్ళిపోయాక, పొరుగింటి రామయ్యనాయుడు, మంగమ్మ నాతో యిలాగన్నారు వీరయ్యని, చిన్నతనంలో తల్లీ,తండ్రీ పోయినా యింత కాలంవరకూ ఆదెయ్య పెంచాడు. గాని, చివరికి మాట దక్కించుకోలేక పోయేగు తన తమ్ముడూ, మరదలు సీతా లక్ష్మి చనిపోయాక వాళ్ళు లేని లోటును కనపడనీకుండా, తనబిడ్డకంటె ఎక్కువగానే చూచాడు వీరయ్యకి, పాలంపన్లు లేకుండా చదువు చెప్పించాడు ఆదెయ్య ఎంతచేసి ఏం లాభం? వెంకాయమ్మ సూటిపోటి మాటలకే, కోడళ్ల కొరపనగొయ్య తనానికే విసుగెత్తి, ఎనిమిదో క్లాసు చదువుతున్న వాడల్లా చెప్పకుండా పారిపోయాడు "పాపం! తల్లీ తండ్రీ లేని బిడ్డ"! వాడిభాగం "పాతికెకరాలూ," తనే వేసుకుందామన్న తలంపుతోనే చేసిందేమో వెంకాయమ్మ"

ఇదే విధంగా, రెండు రోజులకల్లా వూరంతా అట్టుడికి నట్టుడికింది ఆదెయ్య మాత్రం, వీరయ్య చెప్పకుండా వెళ్లిపోయినందుకు చింతపడ్డాడుగాని, తనకొడుకులూ వెంకాయమ్మా మాత్రం అనుకోనగూడా అనుకోలేదు "మేమంతా, పగలల్లా ఎండలో మాడి, రాత్రిళ్లు పురుగనక బుట్రనక కాపలాకాసి కష్టపడి పండించుకు రావాలి, నీ తమ్ముడికొడుకు, యాళకు నీడపట్టున మెక్కి సదువు సదువుతాడంట, ఆడికేం కొమ్ములొచ్చినయ్యా! అదేమంటే, అమ్మాఅబ్బా లేని పిల్లండ్చిన కేసుకొస్తాడు అని అన్నాడు ఆదెయ్య విచారిస్తుంటే, పెద్దకొడుకు సత్యం

అమ్మా, అబ్బా లేని వీరయ్య, పెద్దమ్మ, అన్నలూ, వదినెలూ పెడుతున్న బాధలకి వోర్పలేక తిన్నగా రాజమండ్రి చేరుకున్నాడు ఏనాడూ, యిల్లు విడిచి పొరుగూరు పోయినవాడు గాదు - తన యిల్లెమో వాకిలేమో తప్ప ఆవూళ్లో తనని, ఆదరించి అన్నం ఎవరు పెడతారు? ఇదే ఆలోచనలో పడ్డాడు వీరయ్య ఆ నాటిరాత్రి రైలుస్టేషనులో పడుకొని నిద్రపోయాడు, పొద్దున్నే లేచి, వూళ్లోకి వెళ్లాడు, వూళ్లో ఎవరిదగ్గరన్నా జీతానికి కుదురుదామని నాలుగిళ్లూ తిరిగాడు. ఆఖరికి, తాసిల్దారు సుందరంపంతులుగారి ంట్లో పని చెయ్యడానికి కుదిరాడు

ఆదెయ్య పక్క పక్క వూళ్లన్నీ వాకబు చేయించి చూచాడు, గాని వీరయ్య జాడ తెలీలేదు కొద్దిరోజులు విచారపడ్డాడు. క్రమంగా వీరయ్య సంగతే మరిచిపోయిందా కుటుంబం

వీరయ్యకి మొదట్లో పిల్లల్ని ఎత్తుకోడం, కూరగాయలు తేవడం, బజారుసామాన్లు మొయ్యడం యిల్లాంటి పన్లు చెప్తుండేవాళ్లు వీరయ్యమాత్రం కాలం వృధాపుచ్చకుండా పిల్లల్ని ఆడిస్తూ ఆపుస్తకం, ఈ పుస్తకం చదువుతూండేవాడు అగివరకంతా, ఎనిమిదో క్లాసు చదివాడు గనక, కొస్త బాగా చదువుని అభివృద్ధి చేసుకున్నాడు సుందరంపంతులు భార్య జయమ్మగారుకూడా, వీరయ్య తెలివితేటలు కలవాడనీ, బజారుపన్లలో చాకచక్యం చూపిస్తాడనీ మెచ్చుకుంటూండేది

రెండేళ్లు కులాసాగా ఆనందంతో గడిచిపోయాయి వీరయ్యకి యిప్పుడు పిల్లల్ని పంతులుగారి స్వంతబండిలో స్కూటుకి తీసికెళ్లడం, యింట్లో నీళ్లు మోయడం, గుడ్డలుతకడం, యిలాంటి పన్లకూడా -ప్తున్నారు ఇవన్నీ పూర్తి చేశాక, పంతులుగార్ని కచేరీకి తీసికెళ్లి, మళ్లా యింటికొచ్చి, పిల్లల్ని మధ్యాహ్నం అన్నానికి తీసుకురావడం, మళ్లా వాళ్లను బళ్లో దింపడం, పంతులుగార్ని మళ్లా యింటికి తీసుకురావడం, ఈ లోపల ఖాళీలో అమ్మగారు చెప్పిన పని చెయ్యడం వీటి మూలంగా తీరికలేక చదువుకోటానికే వీలయ్యేదికాదు వీరయ్యకి

యిట్లా కొన్నాళ్లన్నా కష్టపడి, నాలుగు అక్షరం ముక్కలు నేర్చుకుని ఏ కొల్లోనన్నా గుమాస్తాగిరి చేద్దామని వీరయ్య తలంపు గాని, అమ్మగారు ఎక్కడా తీరికలేకుండా ఏదో పని చెబుతూనే ఉండేది యిలా కష్టపడుతూనే, తలకొరుంచుకుని, తల్లీ తండ్రిని తల్చుకుని ఒక ఏడుపుఏడ్చి తన దుస్థితికి చింతిల్లుతూండేవాడు రోజు లెలాగో గడిచిపోతున్నాయిగాని, వీరయ్య స్థితిలోమార్పేమీ కనిపించలేదు సుందరం పంతులుగారు తిండీ, గుడ్డా యిస్తారుగాని దమ్మిడీ అన్నా యిచ్చేవారుగారు, ఆఖరికి కొనుక్కుతింటానికన్నా.

ఎన్నినాళ్లనుభవిస్తాడు వీరయ్య ఈ కష్టాల్ని? ఎంతో ఓర్పుతో, జాగరూకతతో ప్రవర్తిస్తున్నాడు ఓనాడు వీరయ్య పంతులుగార్ని కచేరీకి తీసుకుపోయి ఇంటికి వస్తూ తన భవిష్యత్తును గురించి ఆలోచనలోపడ్డాడు పోనీ మళ్లా యింటికే పోదామా అనుకున్నాడు, "ఛీ! నాల్గేళ్లనాడు యిల్లు విడిచి వచ్చి మళ్లా వాళ్ల ముఖం చూస్తానా అనుకున్నాడు పోనీ యింకెదన్నా నౌకరి చూసుకుందామా అంటె, ఎక్కడికి వెళ్లినా చాకిరీ తప్పదు గాని, కొద్దోగొప్పో చదువుకుని గూడా ఆడవాళ్ళ బట్టల దగ్గరనుంచీ ఉతకవలసివచ్చిందిగదా అని వాపోయాడు ఎన్నెన్నో ఆలోచనలు బుర్రలో తిరిగాయి గాని "అమ్మగారు ప్రేమతో పెట్టె అన్నం మెతుకులు" విడిచెలా పోవడం, నాల్గేళ్లగాఉన్నామే! చిన్నబ్బాయి "గోపి"ని విడువగలనా? అనుకున్నాడు యింతలో ఎదురుగేటుదాటి సరాసరి అది మామూలుగాపోయి నిల్చేచోట ఆగింది వీరయ్య భావప్రపంచంలో కళ్లుమూసుకుని అదే ధ్యాసగా ఉన్నాడేగాని ఎక్కడికొచ్చామూ అన్న స్పృహే లేదు యింతలో అమ్మగారు వచ్చి, "ఏంరా వీరయ్యా!" ఇంకా అలా మొద్దల్లే బండీలోనే కూచొని నిద్దరపోతే పిల్లల్ని అన్నానికి ఎవరు తీసుకువస్తార్రా! అంది కోపంగా వీరయ్య ఉలిక్కిపడి చూశాడు "ఏంరా యింకా అలానే చూస్తావేం!" గంటయిపోయింది పొద్దున పదిగంటలకి కచేరీకి పోయినవాడివి ఇంతదాకా ఏం ఎలగబెడుతున్నావ్? నిన్నడిగేవాళ్లు లేరని యిష్టమొచ్చినట్లు బండేసుకొని, ఊరంతా తిరిగొచ్చావా

(28-వ పేజీ చూడండి)

రచన
శ్రీ శ్రీనివాస కాశ్యప



"ఏం దుకురా అన్నాయ్ యింత తొందరగా నిద్రలేచావు యివ్వాళ?" కళ్లు నులుముకుంటూనే అయిదేళ్ల చిన్నితమ్ముడు అడిగాడు

"ఇవాళ నీవు స్కూలికి వెళ్లాలిరా రోజూటిలాగా 8 గంటలవరకూ పడుకోవటానికి వీలులేదు ఇప్పటికే ఆలశ్యం అయిపోతూంది, లే "అన్నాను దుప్పటిలాగుతూ

తమ్ముడిముఖం అప్పటికప్పుడే ముకుళించుకు పోయింది తెరుచుకునే కళ్లుఒక్కసారిగా గట్టిగా మూసుకుని దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు పడుకున్నాడు

వీడిని నేను లేపితే లాభంలేదని క్రిందకు వెళ్లాను అమ్మకి చెప్పుదామని అమ్మ అప్పటికప్పుడే తమ్ముడి నూతన విద్యాభ్యాసానికి అన్నిహంగులూ అమరుస్తున్నది క్రొత్తపలకా, బలపాల పెట్టే, వాణీవాచకమూ, ఒంట్లు లెక్కవేసే పూసలచట్రమూ- అన్నీ ఆ క్రిందటిరోజే వన్ను బజారుకిపంపి తెప్పించింది అమ్మ ఇక వాడికి నూతన వస్త్రధారణకి కూడా లోటు లేకుండా సమకూర్చింది క్రొత్తలాగూ, ఖరీదయిన బుష్‌కోటూ, చిన్నబూట్లూ—అన్నీ సంసిద్ధంగానే వున్నవి

అసలు నిజంచెప్పాలంటే వాడంటే మాకందరకూ చాలాముద్దు వాడిమాటలు రత్నాల మూటలే వాడికళ్లు విష్ణుచక్రాలే కోకైరులాంటి ముక్కూ, చిన్ననోరూ వాడూ అందానికి నిజంగా వరప్రసాదేనని చెప్పవచ్చు వాడు యెన్నడూ చిట్టుమ చీదియెరగడు ఆరోగ్యంగా, బొద్దుగా, డాబుగా వున్నవాడిని చూస్తే బలహీనుడినయిన నాకు ఒక్కొక్కసారి యీర్ష్య పుట్టుకువస్తుంది

క్రొత్తగా కుట్టించిన వాడి బుష్‌కోటుకు గుండీలు సరీగా వున్నాయో లేదో చూస్తూ అంది అమ్మ

"లేచాడటరా తమ్ముడూ?"

"లేపానమ్మా. స్కూలుకు వెళ్లాలి లేవరా అంటే మళ్లీ కళ్లుమూసుకుని పడుకున్నాడు."

"అయితేవుండు. నేనే వెళ్లి లేవదీసుకు వస్తాను. నీపని అయిందా?"...అన్నది అమ్మ. "నాపనిఅయి చాలాసేపు అయింది. వీడితో కూర్చుంటే నాకు ఆలశ్యం అయిపోతుందమ్మా. ఆలశ్యంగా వెళ్లితే క్లాసులోకి రానీయరు. శంకరం దగ్గరకెళ్లి నా నోట్సు పుస్తకం తెచ్చుకుంటాను. అంతలోకే వాడిపని కానీయి"... నాన్నగారు ఆఫీసుకి వెళ్లిపోయినందువల్ల కొంచెం విసుగ్గా మాట్లాడటానికి ఆస్కారం యేర్పడింది.


శంకరం దగ్గరకువెళ్లి పుస్తకం తీసుకుని యింట్లో అడుగు పెట్టేసరికి గడియారం తొమ్మిదీ కొట్టింది. హడావిడిగా పుస్తకాలు సర్దుకొని తమ్ముడి ముస్తాబు యెంతవరకూ అయిందో చూదామని గదిలోకి వెళ్లాను.

'నేను బడికి వెళ్లనే అమ్మా!"...... దీర్ఘాలు తీస్తున్నాడు తమ్ముడు. వాడికి స్నానంచేయించి బుష్‌కోటు తొడిగింది అమ్మ. క్రాపు దువ్వుతున్నది.

"బడికి వెళ్లకపోతే యెట్లాగురా బాబూ? మరి నీవు పెద్దచదువు చదివి కలెక్టరు పని చేయవూ? అన్నాయి చూడూ యెంత చక్కగా అప్పుడే ఘోరుఘారం చదువుతున్నాడు. చదువురాకపోతే మొద్దబ్బాయి అంటారురా"...తమ్ముణ్ణి యెట్లా అయినా కలెక్టరుని చేయాలని అమ్మ ఆరాటం.'

వాడి యెఱ్ఱ పడ్డ కళ్లూ, బుంగమూతీ చూస్తూ వుంటే నాకు నవ్వు వచ్చింది స్కూలుకు వెళ్లటమంటే వాడికి అంత కష్టమెందుకో వెంటనే నాచిన్నతనమూ, నేను మొదటిసారిగా స్కూలుకు వెళ్లటమూ జ్ఞాపకం వచ్చింది ఆ రోజున నేనూ యిట్లాగే యేడ్చాను స్కూలుకు అలవాటుపడని ఆ మొదటి రోజుల్లో, బడి అంటే ఒక చెరసాలగానూ, మాస్టరుగారు ఒకభూతం లాగానూ అనిపించేది కథల్లో వచ్చే రాజకుమారుణ్ణినే నయినట్లూ, పైదులోపడి పంతులుగారనే రాక్షసుడిచేత బాధింపబడుతున్నట్లూ,—యీ రాక్షసులనతప్పించుకుని పోవటానికి కథల్లో రాజకుమారులు యేమేమి పన్నాగాలు పన్నారో-యివన్నీ ఆలోచించుకుంటూ ముళ్ళమీద కూర్చున్నట్లు క్లాసులో కూర్చునే వాణ్ణి ఇప్పుడు తమ్ముడికీ అట్లాగే అనిపిస్తున్నది కాబోలు. ఇంకా అయిదారు సంవత్సరాలకు వీడూ

(20-వ పేజీ చూడండి)



"అమ్మాయీ, రాధా! రాధా!!"

"వొస్తున్నా, నాన్నా!"

"ఆయాసం వొచ్చిందే, తల్లీ"

"మందు తెస్తున్నా, నాన్నా!"

"అయ్యో అయ్యో"

ఎలాగైనా లేచి కూర్చోవాలని మరో సారి ప్రయత్నించాడు, కాని, మోచేతుల మీదికి లేచేసరికే ఆయన జర్జరశరీరాన్ని ఆయాసం ఆక్రమించుకుంది సర్వనాడులూ శక్తి ఉడిగి పోయినై సగం వొరిగిన చెట్టు చిన్న దెబ్బతో సాంతం నేలకూలినట్టు వెనక్కి-దిండుమీదకు-వాలిపోయాడు

గుండెలమీది చేతులు గజగజా వణికి పోతున్నై గుప్పిళ్లు బిగించి అదిమి పట్టు కోవాలని ఆయన ప్రయత్నం కాని, వేళ్లు వాటి స్వాధీనం తప్పటంవల్ల వణుకు మరింత యెక్కువయింది

నోట మాట రాదు 'అమ్మాయీ', అని ఎన్నో మారులు లోపల్లోపలే గొణుక్కున్నాడు నియమం తప్పిన నిశ్వాసలో కలిసి ఆ మాట తనకే వినబడలేదు

ఇవ్వాళా? నిన్నా?—తను మంచాన పడిన మూడు నెలల్లో యిలా యెన్నో మారులు విఫల ప్రయత్నం చేశాడు ఆయాసం కొని తెచ్చుకున్నాడు

తనంత తాను లేచి కూర్చున్న రోజులు వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు - ఇన్నాళ్ళ నుంచి తన్ను కంటికి రెప్పలా కనిపెట్టి వున్నది రాధ మాత్రమే ఆమె సాయం లేనిదే ఇటు కాలు అటు కదల్చలేడు రోజు మొత్తంలో యెప్పుడో వొకసారి కూర్చో బెడుతుంది రాధ వెన్నున ఆనుకుని వెనక్కి పడిపోకుండా కనిపెటి వుంటుంది అదైనా ఆయాసంరాని వోక్షణం మాత్రమే

ఎప్పుడు అన్నం వండుకుంటుందో ఆధరువు చేసుకుంటుందో కంచంలో పెట్టుకున్న అన్నం తినబోతే మెతుకైనా నోటి కెక్కదు ప్రాణం లేని ప్రతిమలా అక్కడే అలాగే, కూచుండిపోతుంది ఎంతసేపో ఆమెకే తెలీదు కెరటాలుగా పొంగి పొరలివస్తున్న దుఃఖంలో ఆమె మనస్సు సుడి తిరిగిపోతుంది

ఎంత ప్రయత్నించినా గడచిన జీవితం మరపుకు రాదు ముందుగతి ఏమౌతుందో అది ఊహా కందని విషయం

'తను - నాన్న' ఈమాట తల్చుకుని తల్లడిల్లిపోతుంది వొళ్లంతా గరిపొడుస్తుంది వెన్నుమీద చెళ్లున చరిచినట్లవుతుంది, రక్తం గడ్డకడుతుంది శరీరం ముద్దయి పోతుంది - ఎంతసేపటికి తెలివి వస్తుందో మరెంతసేపటికి జీవశక్తి చైతన్యం కలిగి స్తుందో

వెనక్కి చూసుకుంటే శూన్యం వెక్కిరిస్తుంది వికృతంగా, భయదంగా - కన్నీరు గుండెలమీంచి దిగజారి వుంటుంది

'అయ్యో ఏమిస్తున్నా కావుల్ను పిచ్చి మొద్దున' అని తనను తానే సముదాయించుకో జూస్తుంది పైటచెంగుతో కళ్లద్దుకుని, గుక్కెడు మంచినీళ్లు తాగి పొడారి పోయిన పెదిమలు తడుపుకుంటుంది

ఇంతలోకే 'అమ్మాయీ', అని నాన్న పిలుస్తాడు చెయి కడుక్కు త్వరగా వెళ్లి పోతుంది

ఆ అన్నం అక్కడే చీమలు పట్టి చిందర వందరగా అయిపోతుంది —

ఈ తీరున రోజులు గడుస్తున్నై అయినా అన్నీ దిగమ్రింగుకుని తన కర్తవ్యం నిర్వర్తించుకుంటోంది రాధ

ఎలాగో తమాయించుకుని నాన్న పిల్చిన కొద్ది క్షణాలకే యివతలకు వచ్చింది

కళ్లు మూసుకునే పడివున్నాడు నాన్న ఆయాసం అతిశయించటంవల్ల నోరు దాసం తట అదే తెరుచుకుంది 'నాన్నా' అని పిల్చింది మామూలుగా నాన్న మూలిగినట్టున్నాడు, గొంతులో గురగుర, మంది

రోజూ లాగు నాన్నను చూస్తే ఇవ్వాళ యేడుపు వస్తోంది ఎందుకనో?

వో క్షణం తలుపుచాటుకు వెళ్లి కళవళంగా ఏడ్చేసింది రాధ పెద్దగా మూలిగాడు నాన్న

"మాత్ర మింగు, నాన్నా!" అన్నది రాధ దగ్గరసా వచ్చి

ఏదో లోకంలోనుంచిలా కళ్లు తెరిచి చూశాడు నాన్న

"పడెయ్యి" అన్నట్టు కనులతో సౌంజ్ఞ చేశాడు నిస్పృహగా పెదవి విరిచి ఊరుకున్నాడు

మాత్ర గొంతులో వేసి గుక్కెడు నీళ్లు పోసింది రాధ

గుండెలమీద రాయమన్నట్టు చేత్తో రాచి చూపించాడు నాన్న

ఆయాసం తగ్గుతున్నకొద్దీ నరాలకు కొంత బలం చేకూరుతోంది అటూ ఇటూ కదులుతున్నాడు

మళ్లీ లేచావుకావున్ను ఆయాసం వొచ్చింది చూడు!-అన్నది రాధ గుండెల మీద రాస్తూ

“అమ్మయ్య కొస్త అడాయించుతోంది అన్నాడు నాన్న మాట పెగుల్చుకుంటూ

“నేను వున్నాగా, నాన్నా! నువ్వు పట్టుబలకంతాన లేచి ఇంత ఆయాసపడడ మెందుకూ?” కొంగుతో నాన్న పెదవులమీద కారిన చొంగ తుడిచింది రాధ

“అమ్మాయీ! ఎంత ఆయాసమొచ్చిందే! అమ్మా! ప్రాణం తల్లడిలిపోయింది ఏమిటిది ప్రాణమంటే తట్లా పుట్లా? సాంతం అయిపోయిందనే అనుకున్నా”

“వూరుకో, నాన్నా కాసేపు స్థిమితంగా పడుకో కళ్లుమూసుకుని!”

“ఇవ్వాళ నాకేమిటో కడుపులో గుబులుగుబులుగా వున్నదే తల్లీ!”

“ఆయాసంవల్ల నాన్నా! ఎంత ఆయాసం వొచ్చిందని!”

“అవునే, అమ్మా, ఎంతసేపని, ఎన్నాళ్లని ఇలా మంచంలో పడుకోనే? ఒక్కసారి లేచి కూచుందామంటే, దానమ్మకడుపు కాలా-ఒక్కసారి కూచోనివ్వకూడదుటే? కూచోడానికి మొహం వాచిపోయినట్టుందే, తల్లీ! ఇదుగో నా గుండెల్లో చెయిపెట్టి చూడు ఎలా కొట్టుకుంటున్నాయో

“వల్లగింజవాసయినా కాళ్లు కదల్చలేనుగదా, పొద్దున నువు ఎట్లా పడేసి వెళ్లావో అంతే

“అమ్మాయీ ఈ రోగం వచ్చినవాళ్లు బతకడం కష్టమమ్మా!” గొంతులో స్వరం సన్నగిలింది రాధ మొహంవంక తదేకంగా చూస్తున్నాడు

“నువు కూడా అధైర్యపడితే ఇంక యెవరు చెప్తారు నాన్నా, మనకి?”

“ఏంచెయ్యమన్నావే తల్లీ రాయంటి ముండాకొడుకుని నాకే రావాలి యీ రోగం? ఎన్నడైనా దగ్గూ, పడిశం ఎరుగున్నానా? పొలంలో పడి ఎంతపని చేసుకుపోయినా, చలి అంటూ వుండేదా? బస్తాలుబస్తాలు బంతుల్లాగా యెగరేసుకుపోయేవాళ్లం! నాకు ఈ రోగం రావడమేమిటే, తల్లీ! తల్చుకుంటే నవ్వొస్తుంది

“నువు ఎన్నైనా చెప్పు, ఇవాళ నా గుండెల్లో ‘పీచుపీచు’ మంటూనే వుంది చూడు నేను బతుకుతా నంటావా?”

నాన్నమాటలు వింటూంటే రాధకు కడుపులోంచి దుఃఖం ఉవ్వెత్తున పొంగుకు వస్తున్నది కాని, నాన్నయెదట ఏడిస్తే అధైర్య పడిపోతాడు తనను సముదాయించబోయి ఆయన లేస్తే ఆయాసం వొచ్చి పడుతుంది

ఈ ఇంట్లో నాన్నా తను మూడో మనిషి యెవరు వచ్చి తనను ఓదార్చుతారు? పళ్లు బిగపట్టుకుని వొణుకుతున్న పెదవులు చేత్తో కప్పెట్టుకుంది నాన్నవంక రెప్ప వాల్చకుండా చూస్తోంది

ఒకసారి ఆవలించి గుండెలు అదిమి పట్టుకున్నాడు నాన్న “అమ్మాయీ ఇటు చూడు! నేను దిగులుతో కుమిలి చచ్చిపోతున్నానే! ఏంజెయ్యనూ నేను ఏం జెయ్యగలను? —” విచారంతో ఆవేదంతో వొక్కసారి కళ్లు మూసుకుని ‘అబ్బా’ అని బాధగా మూలిగాడు

“దిగులెందుకు, నాన్నా? ఇప్పుడు ఏం కావాలి?” నాన్నకు ధైర్యం చెప్పేవుద్దేశంతో మాటాడుతోందన్నమాట కాని, వెల్లువలుగా పొంగి పొర్లివచ్చే దుఃఖాన్ని దిగమ్రింగలేక పోతోంది రాధ గొంతులో తలసంట్రుకల తుట్టె అడ్డంపడినట్లుగా వుంది మాట పెగిలిరావటం లేదు

“నాకేం కావాలమ్మా మహా బతికితే ఇంకా రెండు గంటలు అయిపోయిందమ్మా! భూమిమీద నాకు ఋణం తీరిపోయినట్టే తోస్తోంది”

“ఏం మాటలు, నాన్నా, ఇవి? ఇప్పుడే వస్తానుండు” రాధ ఒక్కనిమిషమైనా అక్కడ నిలవలేకపోయింది చివాల్న లేచి ఇంట్లోకి వెళ్లిపోయింది పిచ్చిదానిలా వంటింట్లో తిరుగుతూ ఎంతసేపో యేడ్చింది గుండె చెరువయేలా కాని, కొన్నియుగాలు ఇలా యేడ్చినా మూడో వ్యక్తి యెవరూ రారు తన్ను తానే ఓదార్చుకోవాలి ఈ సంగతి నాన్నకు తెలిస్తే ఆయన లేవడానికి ప్రయత్నిస్తే అమ్మో ఈ భయంకర పరిణామానికి తనే కారణమైతే ఇన్నాళ్లూ తను చేసిన చాకిరీ అంతా వొక్క నిమిషంలో వమ్మైపోవలసిందేనా?

నాన్న ఏమైనాడో, చటున గుర్తు వచ్చింది కళ్లూ మొహమూ తుడుచుకుని ఇవతలకు వచ్చింది

నాన్న వెర్రిగా చూశాడు రాధవంక తనేదో పెద్ద తప్పుచేసినదానిలా నాన్న వంక చూడడానికే భయపడుతోంది

“అమ్మాయీ, ఇలా రా తల్లీ,” నాన్న పిల్చాడు ఆయన గొంతులో ఇన్నాళ్లనుంచీ లేని ఏదో ప్రశాంతభావం వినవస్తోంది

పసిపిల్లలా వెళ్లి ఆయన పక్కలో కూర్చున్నది రాధ చెయిపట్టుకుని భుజం మీద రాస్తూ ఏదో అనుమానం తోచిన వాడిలా కళ్లు విప్పి రాధ మొహంలోకి పరకాయించి చూశాడు నాన్న

“అమ్మా, ఇటు చూడు నావంక చూడు, తల్లీ! ఏం అలా వున్నావేం అమ్మా? మాడు నీ చెవుల దిద్దులేమైనయ్యే, తల్లీ!” భుజం మీద నిమురుతున్న చేత్తో చెవితమ్మె పట్టుకుని ఏమైనయ్యే, అమ్మా చెప్పవు?' ఆదుర్దాగా ఆవేదనగా అడిగాడు నాన్న

తల్లోనరాలన్నీ వొక్కసారి జివ్వుమన్నట్టయింది రాధకు ఎన్నడూ అడగని వాడు ఈ నాడు ఇలా యెందుకు అడుగుతున్నాడు నాన్న? ఏమీ పాలుపోక గజిబిజి అయిపోయింది రాధ వినీవిననట్టు నటించాలని యత్నించింది మళ్ళీ అడిగాడు నాన్న బుగ్గమీద రాస్తూ

“ఇటు చూడు, తల్లీ! ఏమైనయ్యో చెప్పవు?” ఈ సారి నాన్న గొంతు బొంగురు పోయింది జరిగిన సంగతంతా వొక్కసారి ఊహించుకుని లోలోన క్రుంగి క్రుంగి పోతున్నట్టు ఆయన మాటల్లో అంతులేని ఆందోళన వ్యక్తమవుతోంది

తను దాచిపెట్టినా నాన్న ఎలాగూ గ్రహించాడనుకున్నది రాధ గడచిన వారం సరిగా ఇదే రోజున జరిగిన సంఘటన మనసులో గుప్పుమన్నది ఆనాడు ససేమిరా వద్దని వారించాడు నాన్న ఆయన మనసుకు ఏం కష్టం తోచిందో అటకమీద వున్న రెండు మెట్టనాగటి దుంపలు, ఓ కొయ్యపెట్టె, మూడు కుప్పనూర్పిడి బల్లలు, రెండు రాగి పట్టెళ్లు రామస్వామిచేత అమ్మించి మందు కొనిపించాడు

‘ఈనాటితో నా జీవితంలో నేను సంపాయించుకొన్న వన్నీ అఖరయినయ్యి' ఎంతోసేపు దిగులుగా యేడ్చాడు

వారం గడిచిపోయింది చేతిలో యెర్ర యేగానీ లేదు ఇంట్లో వొక బత్తాయికాయైనా లేదు రాత్రంతా యీ విషయమే గిజాటుగా ఆలోచించింది రాధ ఏమీపాలుపోలేదు తన దగ్గర మిగిలినవల్లా యీ రెండు దుద్దులు నాన్నను సలహా చేస్తే ఎలాగూ వారిస్తాడు ఆయన్ను అనవసరంగా హైరానుపెట్టడం ఇష్టం లేక ఉద

యమే రామస్వామికి ఇచ్చిపంపించింది ఆయాసం మాత్రలూ, పళ్ళు, వొక శేరు బియ్యమూ కొనుక్కు వచ్చాడు మిగిలింది తనకే ఇచ్చిపోయినాడు —

“ఉన్నయిలే, నాన్నా, ఇప్పుడే తీశాను!” అన్నది రాధ కళ్ళనిండా నీరు నిండడంవల్ల నాన్న మొహం కనిపించడం లేదు గుడ్లు కదిపితే కుంచెడునీళ్లు కారేట్టు న్నయ్ ఏడుస్తోందనుకోకుండా తనకు తానే నిగ్రహం ప్రదర్శించుకుంటూంది

బుగ్గమీద నిమురుతున్న చేత్తోనే కను రెప్పలు రెండూ వొత్తాడు నాన్న జోట జోటా ఆయన గుండెలమీదకు వేడిగా జారి ఇంకిపోయినై

“నాతల్లీ, ఇంకా ఎందుకు దాస్తావమ్మా, నువు అంత పనీ చేస్తావని ఆనాడే అనుకున్నాను నాతో చెబితే వద్దంటానని నువ్వే పంపించావా? వొంటిమీద చిన్న మెత్తయినా లేకుండా అంతా నిలువు దోపిడీ ఈ ముసలి పీనుగకోసం పీడి మందులకోసం ” ఆయన గొంతులో నాదం తగ్గుతున్న కొంగీ కళ్లవెంట నీరు ధారలుగా జారిపడుతోంది పైటచెంగుతో ఆయన కళ్లు అద్దింది రాధ కాని, గుంటలు పడిపోయిన ఆయన కళ్లల్లో విగూలనించో కుండజలలా వూరుతూనే వున్నది నర నరాల్లోనూ జీర్ణించిన వాత్సల్యం గుండెల వేడికి వెన్నలా కరిగి కన్నీరై దిగజారుతున్నట్టున్నది

ఆయన ఏదో మాటాడుకుపోతున్నట్టున్నాడు మూగభాషలో పెదవులు కదుల్తున్నయ్ కళ్లు మూతలు పడినయ్

“నాన్నా” అని పిల్చింది రాధ గుండెలమీద చెయిపెట్టి

కళ్లు తెరచి చూశాడు నాన్న పది తాళ్ల లోతున ఉన్న పాతాళగంగలా ఉండీ లేనట్టు మిలమిల్లాడుతున్నయ్ దించుకుపోయిన నల్లగుడ్లు—

క్షణకాలం నిశ్శబ్దం అలుముకున్నది

“అమ్మాయీ!” అని పిచ్చిగా అరిచి రెండు చేతుల్తోనూ రాధ శిరస్సు తనగుండెల కదుము కున్నాడు నాన్న

రాధకు ఏదో ధ్వని వినబడుతోంది అది యేదీ కాదు నాన్నగుండెల ధ్వని గుండెలు ఇలా కొట్టుకొంటయ్ కాబోలు. తను ఎన్నడూ వినివుండలేదు ఆ మోత

జీవితంలోని కష్టపరంపర, దుఃఖం, ఆవేదన అక్కడ గూడుకట్టుకుని పెరిగి పెద్దవై వెలికి చీల్చుకువచ్చే ఉద్రేకంలో పరస్పరం తన్నుకులాడుకుంటున్నట్టున్నయ్

రాధచెవులకు ఏదో భాష వినబడుతోంది అది జీవితం విలువలను వినిపించే భాష గుండెలలోతు తెలియని అభాగ్య జీవులకు అర్థంగాని భాష అది

నాన్న గుండెలమీద చెవి ఆనించి వింటున్నకొద్దీ తన కేదో మైకం కమ్మినట్టవుతోంది తన శరీర మే తాను మర్చిపోతున్నట్టున్నది

నాన్న మూలిగాడు మెల్లిగా తలయెత్తి చూసింది రాధ నాన్న ఏడుస్తున్నట్టు వెంటనే గ్రహించింది

“పసిపిల్లడిలా అలా యేడుస్తా వెందుకు నాన్నా!” అన్నది జారిపోయిన వ్రేలుముడి సరిచేసుకుంటూ

“ఏం చెయ్యనే, తల్లీ, ఏడవక నే నేం చెయ్యగలను? ఎన్నాళ్లు ఏడ్చినా నేను చేయగలిగిం దేమీ లేదు ఆ రెండువస్తువులూ కూడా అమ్మేశావ్ కదే, తల్లీ! అయ్యో - రెండు చేతులతో మొహం కప్పేసుకున్నాడు నాన్న

“దిగులెందుకు నాన్నా, నీకు జబ్బు నయమయితే ”

వట్టిది వట్టిది- నేను బతకనే, తల్లీ! ఈ రోగం వొచ్చి ఎవరికి నయమయిందని?”

“పోనీలే, నాన్నా వాటికోసం విచారించబోకు!” పోయిన వాటిని గురించిన నిస్పృహను వ్యక్తం చేస్తోంది రాధగొంతు దానివెనుక తన కర్తవ్యాన్ని నిర్వర్తించుకున్నానన్న తృప్తి, జీవిత సర్వస్వాన్ని త్యాగం చేసిన శక్తి పైకి ఉబికి వస్తున్నట్టున్నయ్

“నిన్ను ఎలా విడిచిపెట్టిపోనే, తల్లీ! ఈ పాడులోకంలో నిన్ను చూసే దిక్కెవరు? కాకులకు, గద్దలకు విడిచిపెట్టిపోనా, ఎలా బతుకుతావే, అమ్మా- ఒక్కముండాకొడుకు దగ్గిరకి రాడుకదా! ఉన్నన్నాళ్లూ తిన్నవాళ్లేగాని తిన్న విశ్వాసం వొక్కడికి వున్నదేమో చూశావూ? ఆ రామస్వామి ముండాకొడుకు వొక్కడు- వొదిలిపెట్టలేక పట్టుకు పాకులాడుతున్నాడు”

“మనకు ఎవరూ అక్కర్లేదు లే, నాన్నా!”

“నా తల్లీ! నాకోసం బతికించావే నిన్ను ఖర్మం కాకపోతే నీ పసుపూ కుంకుం కూడా యెత్తుకుపోవాలీ!” ఈ మాటలు వినబడీ వినబడనట్టు గొణుక్కున్నాడు నాన్న

చెళ్లున వెన్ను చరచినట్టయింది రాధకు- తన అభాగ్యజీవితాన్ని గురించి యెన్నడూ విచారించుకోలేదు నిజంగా తనే ఇక్కడ లేకపోతే నాన్నగతి అమ్మో – రెండు చెవులూ గట్టిగా మూసుకుంది తనలో లయహీనమైన ఏదో నాదం మార్మోగుతోంది ఉండి వుండి సముద్ర సంఘోషంలా హోరెత్తుతోంది.

ఈప్రపంచంలో తను పుట్టింది నాన్న కోసమే - మరెవరి కోసమూ కాదు గతించిన అభాగ్య జీవితం మరుపుకు రాకపోయినా గడుస్తున్న క్షణంలో ఏదో సంతృప్తి తన కర్తవ్యాన్ని నిర్వర్తించి సఫలం చేసుకొన్న జీవితానందం!

తన జీవితం ఎందుకు ఇలా కాలంతో పందెం వేసుకుని ముందుకు సాగిపోతున్నదో ఈ ప్రపంచంలో మరెవరూ లేరు, తను, నాన్న

“ఏమీ అమ్మ పోతూపోతూ నిన్ను నా చేతుల్లో పెట్టిపోయిందే, తల్లీ, నేనెవరి చేతులో పెట్టిపోనే, అమ్మా!” నాన్నకు దగ్గు తెర వచ్చింది గొంతులో నరాలు వానపాముల్లా జలగల్లా ఉబ్బినై గుడ్లు తేలవేస్తున్నట్టు భయావహంగా చూశాడు గుండెల్లో రాస్తూ నాన్న కళ్ళల్లోకి కళవళంగా చూసింది రాధ ఓ క్రమాలకి దగ్గు ఆడాయించుకుని నాన్న తిరిగి చెప్పుకుపోతున్నాడు

“ఉండటానికి ఇల్లు కూడా లేకుండా చేశాను ఈ ఘటం దాటిపోయిన మొన్నాడు వాడొచ్చి వేలం వేసుకుపోతాడు ఈ భూమిమీద నాదీ, అని చెప్పుకోడానికి పూచిక పుల్లైనా మిగల్లేదు నీకు ఏమీ ఆధారం చూపించనే, అమ్మా?”

“గొడ్డుమోతుముండాకొడుకులు కాకపోతే నీకు మనోవర్తి కింద రావలసిన మూడెకరాలూ ఎగవేసి మాకు సంబంధం లేదు

తమ్ముడి చదువు

(16-వ పేజీ తరువాయి)

బడికి వెళ్లనని మారాము పెట్టే యింకో చిన్న కుర్రాడిని చూసి నవ్వుతాడు కాబోలు. చిన్నవాళ్లు పెద్దవాళ్ళవటమూ, పెద్దవాళ్లకు చిన్నప్పటి ఉద్దేశ్యాలూ, ఊహాలూ మారిపోవటమూ యీ సృష్టి పరిణామానికి ఆశ్చర్యం వేసింది.

బూరబుగ్గల మీదుగా కారే జలప్రవాహాన్ని తువాల పెట్టి తుడుస్తూ పలకా, బలపమూ, వాణీవాచకము-వాడి చేతిలో పెట్టి ఒక్కసారి తమ్ముడివంక సంతృప్తిగా చూసి అన్నది అమ్మ—

"ఏడవ మాకురా నాయనా నీకేమీ భయం లేదులే అన్నాయి వెంటే జాగ్రత్తగా వెళ్లు సాయంత్రం మళ్లా అన్నాయి వెంటేరా నా బంగారు బాబువి కదూ ఇంక వెళ్లు"

తమ్ముడు పెరిగి పెద్దవాడై, కలెక్టరు ఉద్యోగం చేస్తున్ననాడు తానెంత ఆనందం పొందుతుందో ఊహించుకుని కాబోలు అమ్మ ఒక్కసారి కళ్లు మూసుకుంది. తమ్ముణ్ణి నాకు ఒప్పగింతలు పెట్టి జాగ్రత్త అని మరీమరీ చెప్పి సాగనంపింది మమ్మల్ని.

స్కూలుకు టయిమయిందని వడివడిగా నడవసాగాను. ఇక యేడ్చి లాభం లేదనుకున్నాడో యేమో, చెక్కిళ్ళ మీదుగా కారే ఆఖరు కన్నీటి చుక్కను తుడిచి పలకను రాసి దుఃఖం దిగమ్రింగి, నాతోపాటే పెద్దపెద్ద అంగలు వేస్తూ నడిచాడు తమ్ముడు.

ఒక క్లాసులో తమ్ముణ్ణి కూర్చోపెట్టి, మాస్టరు గారికి అప్పజెప్పాను. కొద్దిమంది పిల్లలు మట్టుకు అక్షరాలు దిద్దుతున్నారు. ఒకపిల్ల బలపం ముక్కను నోట్లో పెట్టుకుని ఒక కన్ను తెరుస్తూ మూస్తూ మాస్టరువంక చూస్తూ కూర్చున్నది. ప్రక్కనే యింకో చిన్న అబ్బాయి క్రొత్తగా వచ్చాడు కాబోలు పంతులును దెయ్యమో భూతమో అన్నట్లుగా బిత్తరి చూపులు చూస్తున్నాడు. తమ్ముణ్ణి మాస్టరుగారు మొదటి వరుసలో కూర్చోపెట్టటం చూసి ఏమీ భయపడకద్దనీ గంట అవగానే నేను వస్తాననీ చెప్పి క్లాసు కేసి నడిచాను.

మధ్యాహ్నం అమ్మ టిఫినులో పంపిన అన్నము యిద్దరం తిన్నాము. తమ్ముడు యేమీ మాట్లాడలేదు. సాయంత్రం బడి గంట కొట్టగానే ఒకటవ తరగతి దగ్గరకు వెళ్లాను. అప్పటికే పలకా పుస్తకమూ పట్టుకుని నుంచుని వున్నాడు తమ్ముడు.

ఎప్పుడూ చిలిపిగా వాగే తమ్ముడు తగని మౌనంగా వున్నాడు. ప్రపంచంలో పడవలసిన కష్టాలన్నీపడి విసిగి, వేసారి, చివరకు పరమార్థం కనుక్కున్న వేదాంతి వలె తలకాయవంచుకుని పెద్ద పెద్ద అంగలు వేస్తూ నడుస్తున్నాడు.

"ఎట్లావుంది రా స్కూలు?" ఏమి చెబుతాడో చూదామని అడిగాను, "బాగానే వుంది" అంత చిన్న వయస్సులో అంత యీసడింపుగా మాట్లాడటం వాడికి యెట్లా చేతనయిందో నాకు యిప్పటికీ ఆశ్చర్యం వేస్తుంది. "ఏమిరా అట్లా అంటావు? పంతులుగారు అక్షరాలు దిద్దపెట్టలేదా?" అన్నాను విడువకుండా.

"దిద్దపెట్టరేమి? ఆయనకు యింకేమి పని వుంది? చిన్నపిల్లలను యేడిపించటం తప్ప?" తనను స్కూలుకు పంపించటానికి కారణం నేనే అయినట్లు నావంక కోపంగా చూస్తున్నాడు. వీడితో ఆపే మాట్లాడితే బాగుండదని మెదలకుండా నడిచాను. అమ్మ నాకు చెప్పినపని-వాడిని వెంటపెట్టుకుని వెళ్లి క్లాసులో కూర్చోపెట్టటం, మళ్లా యింటికి జాగ్రత్తగా తీసుకురావటం నా పని యేదో అయిపోయింది. మధ్యన వాడితో వాదన నాకెందుకూ?

తమ్ముడు పలక పట్టుకుని యింటికి రావడం చూసి అమ్మ ముచ్చటపడింది. కాని వాడి హృదయంలో యెన్ని అగ్ని పర్వతాలు పేల్లిన బ్రద్దలవుతున్నాయో యెంత కోపాగ్ని ప్రజ్వరిల్లుతున్నదో - అమ్మకు కూడా బాగా తెలిసి వుండదు. పున్నమి చంద్రుడివంటి తమ్ముడి ముఖం చిన్నబోయింది. తమ్ముడి ముఖాన మందహాసమే అంకురించలేదు ఆరోజున.

అయిదేళ్లు నిండని ప్రక్కయింటి కిట్టు వచ్చాడు తమ్ముడితో ఆడుకోవటానికి. పైన్ను పారగలో ఊపిరితిత్తుల బొమ్మని వేస్తూ కూర్చుని ఈ చిన్న స్నేహితుల సంభాషణను యాదాలాపంగా వింటున్నాను.

"ఇవాళ ఆడుకుందామని వస్తే నీవు లేవు ఎక్కడకు వెళ్లావురా, బాబ్జీ?" కిట్టు అడుగుతున్నాడు తమ్ముణ్ణి.

"ఇవాళ నన్ను బడికి పంపించారురా కిట్టూ ఇకనుంచీ నేను చదువుకోవాలిట" తనపుట్టి యేమిటో మునిగిపోయినట్లు చెపుతున్నాడు తమ్ముడు.

"అయితే రోజూ వెళతావా?"

"ఆ"

ఇద్దరూ కాస్సేపు మౌనంగా కూర్చున్నారు. ఇద్దరూ దిగులుగానే వున్నారు. కిట్టులాగా హాయిగా ఆడుకోకుండా ఈ బడి తగలాటము నాకెందుకు వచ్చిందని ఆలోచిస్తున్నాడు తమ్ముడు.

బాబ్జీ చక్కగా బడికి వెళ్తుంటే ఆడుకోవటానికి తోడు యెవరూ లేకుండా అస్తమానమూ యింట్లో ఒక్కడూ వుండాలెనని అనుకుంటున్నట్లున్నాడు కిట్టు.

స్నేహితులిద్దరూ కోరైన మారుముఖాలతో ఆడుకోవటానికి వెళ్లారు. అపుకుంటున్న నవ్వంతా ఒక్కసారి మనసారా నవ్వి పూర్తి అయిన డ్రాయింగుకు షేడ్ చేయటం మొదలెట్టాను.

భోజనాలకు కూర్చున్నాము అందరమూ

(19 వ పేజీ తరువాయి)

పొమ్మంటారూ? నేనే బతికి ఉంటేనా, వాళ్ల దుంపతెగేసేవాణ్ణి! నేను చచ్చిపోతున్నానే, తల్లీ!

"నాన్న నిన్నొక పక్షినిచేసి పోతున్నాడు ఎలా బతుకుతావే అమ్మా? నీ ఆకలి కనుక్కుని పట్టెడు మెతుకులు నీ కెవరు పెడతారే, అమ్మా!"

తిరిగి ఆయాసం వస్తున్నట్టున్నది. గుండెల్లో వేగం హెచ్చుతోంది.

"మాత్ర వెయ్యనా, నాన్నా?" అనడిగింది రాధ.

"ఇంకా మాత్ర యెందుకు?" నిరాశగా పెదవివిరిచాడు నాన్న. కింది పెదవి అడుగున పచ్చగా వున్నట్టున్నది. తిరిగి పరీక్షగా చూసింది రాధ. తనది పొరపాటు కాదు. నిజమే - కళ్లు చూసింది, పచ్చగా వున్నై. గాభరాగా వొళ్లంతా చూసింది పచ్చగా కనబడింది.

నాన్న మొహం అంతకంతకూ నిస్తేజమవుతున్నట్టున్నది. "మాత్ర తేనా నాన్నా" అని తిరిగి అడిగింది రాధ.

నాన్న దానికి సమాధానం చెప్పలేదు. గజగజ వణికి వేలాడిపోతున్న చేతులతో రాధను దగ్గరకి తీసుకున్నాడు. "నన్ను కౌగలించుకో, అమ్మా గట్టిగా కౌగిలించుకో. నాన్న నిన్ను వదిలి ఎట్ల, దిక్కు లేకుండా వదిలిపోతున్నాడు. కౌగిలించుకో, తల్లీ! నాతల్లీ గట్టిగా కౌగిలించుకో! అమ్మా!—

రాధ మొహంలోకే చూస్తున్న ఆ నాన్న కళ్లు మజిలీ చేరుకుంటున్న రైలు ఇంజనులా గుండెల సంచలనం క్రమంగా ఆగి ఆగి ఏకో అయిపోయింది.

నాన్నను కౌగిలించుకున్న రాధను కళ్లు చీకట్లు కమ్మినై. నాన్నా "హృదంతరాళం చీల్చుకు వెలికి వచ్చిందా జీవితనాదం శూన్యంలో గొరబడి ఇంకిపోయింది—

జంగురుబిల్లి పెంపుడుకూన మెడకోరిక పారిపోయింది.

★

వంటయింట్లోనుంచీ చిటపటా శబ్దాలు వస్తున్నాయి నాన్నగారు ఆ దేమిటని అడిగారు తమ్ముడు మూతి ముడుచుకుని కూర్చుని వున్నాడు అమ్మ అంది—

"ఇవాళ అబ్బాయి బడికి వెళ్లి వచ్చాడు కదూ? అందుకని దృష్టి తగిలిందేమోనని కాస్త తీసి పడేశాను"

నాన్నగారు ఒకటే నవ్వు అమ్మ దంతా ఒట్టి చాదస్తమట దృష్టీ లేదూ ఏమీ లేదూ అంతా మూఢ నమ్మకమన్నారు ఉప్పూ మిరపకాయలూ తీసి పడేసి మెటికలు విరిచినంత మాత్రాన జబ్బు చేయదని నమ్మటం శుద్ధ తెలివితక్కువన్నారు

నాన్నగారి మాటలు అమ్మకేమీ నచ్చలేదు తమ్ముడికి పెరుగన్నం కలిపి పెడుతూ అన్నది అమ్మ

"దృష్టీ లేదు యేమీ లేదని అంటారేమిటి? మీరు యీ కాలానికి పుట్టుకొచ్చి యింగ్లీషు చదువుకున్నంత మాత్రాన అనాదినుంచీ వున్న నమ్మకాలూ, ఆచారాలూ-అబద్ధం అవుతా యేమిటి? నిన్న వాళ చిట్టికి పుట్టిన రోజు పండుగచేస్తే చీకటి పడేసరికల్లా జ్వరంతగిలి, వాంతులూ, తలనొప్పి యేన్నో వచ్చాయి పాపం అప్పటికప్పుడు లంబాడి లచ్చిని పిలిపించి దృష్టి తీయించి రక్షకట్టిస్తే గంటసేపటికల్లా అన్నీ తగ్గిపోయి పిల్ల యెంత చక్కగా ఆడుకుంటున్నదని? ఇంత దృష్టాంతంగా కనిపిస్తుంటే దృష్టితగలటం అబద్ధం అంటారేమిటి?"

ఇక్కడ ఒక విషయం చెప్పాలసి వుంది లంబాడిలచ్చి, అంటే మావూళ్లో అందరకూ తగనిగురి పసపిల్ల యెవరయినా కొంచెం గట్టిగా యేడ్చినా, ఏ పిల్లవాడయినా చిక్కిన చీదినా,-వెంటనే లంబాడి లచ్చి దగరకు వెళ్లి రక్షకట్టించో, దృష్టితీయించో తృప్తిపడితేనే కాని మనసు కుదుటపడేది కాదు మావూరివాళ్లకు అన్నిటిలోకీ దృష్టి తగిలినట్లయితే అద్భుతంగా కనుక్కుని నివారణ చేస్తుందని ప్రసిద్ధి అసలు దృష్టిదోషమో, లేక యేదయినా యితర జబ్బో యిట్టే కనిపెడుతుంది చిన్నపిల్లలకు యేమాత్రం జబ్బుచేసినా, డాక్టరుకన్నా ముందు లచ్చిదగ్గరకే పరిగెత్తటం అలవాటయిపోయింది లంబాడి లచ్చిహస్తం సిద్ధహస్తం లచ్చిదృష్టి నిసితదృష్టి లచ్చికట్టిన రక్ష శ్రీరామరక్ష

* * *

తమ్ముణ్ణి నిద్రలేపుదామని మేడమీదకు వెళ్లాను వాడు పల్లకిలా పడుకుని చేతులు త్రిప్పుతూ, తనలోతనే యేదో మాట్లాడుకుంటున్నాడు నేను రావటంచూచి ఏమీ ఎరగనట్లు కళ్లుమూసుకుని పడుకున్నాడు వీడు యెట్లాఅయినా స్కూలు యెగకొట్టాలని చూస్తున్నాడని గ్రహించాను దగ్గరకు వెళ్లి వీపుమీద తట్టిలేపాను తమ్ముడు కదలనూలేదు మెదలనూలేదు బెల్లంకొట్టిన రాయిలా పడుకుని వున్నాడు

గట్టిగా కదిలిస్తూ, బడికి వేళఅయిందనీ, త్వరగా లేవమనీ పిలిచాను వాడు ఆవులిస్తూ కళ్లు సగం తెరిచి ముఖం సీరియస్‌గా పెట్టి "అన్నాయ్, యివాళ యెంత తలకాయ నొప్పిగా వుందనుకున్నావురా? అమ్మ అబ్బా"-అంటూ మూలగటం మొదలు పెట్టాడు

ఒక్క నిముషంముందు నేను గదిలోకి వచ్చినప్పుడు తమ్ముడి తలకాయనెప్పి యేమయిందో అర్థంకాలేదు నాకు

"తలకాయ నెప్పీ లేదు యేమీ లేదు లేవరా నీ యెత్తులు నాకు తెలుసులే బడి యెగకొట్టటానికి వీల్లేదులే!" అన్నాను పట్టుదలగా

వాడు రౌద్రమూర్తి అయినాడు కళ్లు యెఱ్ఱజేసి కోపంగా నావంక చూస్తూ- "నాకు జ్వరంకూడా తగిలిందిరా నీకేం తెలుస్తుంది? నాకెంత బాధగావుందో నేను లేవలేను అమ్మా" గోడవేపు తిరిగి పడుకున్నాడు

అమ్మ ఆత్రంగా పైకివచ్చి తమ్ముడిమీద వంగి "ఏమిటిరా, నాయనా"- అన్నది

"జ్వరం తగిలిందే అమ్మా తలకాయ పగిలిపోతున్నది కళ్లు మండిపోతున్నవి ఒళ్లంతా నెప్పిపుడుతున్నది అబ్బబ్బా" తమ్ముడి యాక్షనుకు కడుపు పుబ్బేటట్లు నవ్వు వచ్చింది

అమ్మ వాడి తలమీదా పొట్టమీదా చెయ్యి వేసి చూచింది 'నిజంగానే వేడిగా వున్నదే' - అన్నది

అది అంతా ఒట్టివేషమనీ, బడి జ్వరమని నేనెంతచెప్పినా, వినలేదు పైగా అమ్మకూ తమ్ముడికీ నామీద కోపం వచ్చింది

త్వరగా కాఫీ కాసియిచ్చి తమ్ముడికి త్రాగించి రమ్మనిపంపింది అమ్మ ఈ దొరగారికి సేవచేయాలి కాబోలు ననుకుంటూ పైకి వెళ్లాను రెండు దిండ్లు బాగా వొత్తిపెట్టుకుని, బ్లాంకెటు కప్పుకుని ఒంటికి వేడి తెప్పిస్తున్నాడు వాడు

ఇంత చిన్నవాడికి యింత ఆలోచనా యిన్ని వూహాలూ యెక్కడినుంచీ వచ్చాయో అనుకున్నాను లంబాడి లచ్చి దగ్గరకు వెళ్లుతూ గన్నేరు చెట్టు విరగపూసింది తమ్ముడి తెలివిలో సగమయినా నీకు రాలేదేమని అడుగుతున్నాయి గన్నేరుపూలు తెలివితేటలూ, ఆలోచనాశక్తి, యెత్తులు వేయకలిగే నేర్పూ-ఉన్నవాడే బ్రతుకనేర్చినవాడు ఈ సూక్తిని అప్పటికీ యిప్పటికీ మరిచిపోలేదు నేను

లంబాడి లచ్చిని తీసుకువచ్చి పైకి వెళ్లాను తమ్ముడు గోడవేపు తిరిగి పడుకుని గోడకివున్న బొక్కలు వ్రేలితో పెద్దవి చేయటంలో నిమగ్నుడై వున్నాడు వీడి పన్నాగానికి అమ్మ చాదస్తానికీ తగని కోపం వచ్చింది ఈ సమయంలో నాన్నగారే వుంటే వీడి ఆటలు సాగనిచ్చేవారు కాదు కాని అప్పుడే ఆఫీసుకు వెళ్లిపోవటం మూలాన గ్రంథం యింతవరకూ వచ్చింది

మేము రావటం చూచి చప్పున వెల్లకిలా పడుకుని పెద్దగా మూలగటం ప్రారంభించాడు లంబాడి లచ్చికి తమ్ముణ్ణి చూపించింది అమ్మ ఆ క్రిందటిరోజు స్కూలుకు పంపినామనీ, ఆరోజు తెల్లవారేటప్పటికి జ్వరమూ, తలకాయనొప్పి వచ్చాయనీ, తప్పకుండా దృష్టితగిలి వుంటుందని తనకు అనుమానమనీ, అమ్మ ఒక్క గుక్కలో చెప్పేసింది

తమ్ముడు అందుకున్నాడు "నిన్న వాళ్లకిట్టుదృష్టి తెప్పించాడే అమ్మా నేను బళ్లోకి వెళ్తున్నానని, వాడు యింట్లోనే కూర్చోవాలని, తనకూడా వస్తే బాగుంటుందని అన్నాడే"

వీడి తెలివిచూసి కోపంపోయి నవ్వు వచ్చింది ఇదంతా నాటకమనీ, లంబాడి లచ్చిని పంపివేయమని అరిచాను అమ్మ నా వంక చురచురా చూచింది "తమ్ముడికి జ్వరం వస్తే నీకు దిగులు లేదేమిరా?" అన్నది

లంబాడి లచ్చి అబ్బాయి చేయిపట్టుకుని చూసింది తమ్ముడి కళ్లల్లోకి సూటిగా చూచింది ఆకాశంకేసి చూచి కాస్సేపు ఆలోచించింది 'నీకేమి జబ్బు, బాబూ?'

అన్నది వాడు తగుముకోకుండా బాధలన్నీ యేకరువు పెట్టాడు

లంబాడి లచ్చి తల వూపింది చెవులకు తగిలించిన జూకాలు గలగలమన్నాయి వాడికి దృష్టి తగిలినదీ

తేక పోట్టి జ్వరమయినదీ తేల్చుకోవాలి దానికి లచ్చి ఒక పరీక్ష చేస్తుంది ఒక గ్లాసుతో నీళ్ళూ, కొబ్బరినూనే తెమ్మన్నది ఆ గ్లాసుడు నీళ్లు తమ్ముడిచుట్టూ త్రిప్పి గదిలో ఒకమూలను కూర్చున్నది ఒక కత్తి తీసుకురమ్మన్నది లచ్చిచేసే పరీక్ష సుప్రసిద్ధమైనది నీళ్ళల్లో రెండు నూనె బొట్లు వేస్తుంది నీటిమీద తేలిన నీటి బొట్లను కత్తితో మధ్యకు వేరుచేస్తుంది అవి రెండూ కలుసుకున్నట్లయితే దృష్టి తగిలినట్లు ఆ పరీక్ష లచ్చికి తెలిసినట్లు ఈ వరికీ తెలియదు

"కత్తి యెందుకురా అమ్మాయ్?" తమ్ముడు బెరుకుగా అడిగాడు

వీడి రోగం బాగా అణచాలనుకున్నాను ఒక్క దెబ్బకి రెండు పక్షులు వీడికి యిప్పుడు చేసిన జబ్బూ పోతుంది ఇక ముందెప్పుడూ యిటువంటి జబ్బు చేయడు

"ఆ కత్తితో నీకు దృష్టి తగిలినచోట కోసి వేస్తుందటరా"

ఆకాశంలోనించి హఠాత్తుగా ఒక పిడుగు వచ్చి యింకో నిముషంలో తలమీద పడుతుందని విన్నవాడుకూడా అంతగా వులిక్కిపడడు చూస్తుండగానే వాడి ముఖంల్లో నెత్తురుచుక్క లేకుండాపోయింది

"నాకు దృష్టి యెక్కడ తగిలిందిరా అమ్మాయ్?" - ఎప్పుడూ లేని ఆప్యాయత వినిపిస్తున్నది వాడి స్వరంలో

"కిట్టు నీకు దృష్టి పెట్టాడు కదరా? అంటే నీ ఒళ్లంతా దృష్టితగిలిందన్న మాట" - వాడి ముఖవైఖరి చూస్తుంటే తెగనవ్వు వస్తుంది

అపర హనుమంతావతారంలాగా ఒక్క గెంతు గెంతాడు తమ్ముడు పెద్దగా యేడుస్తూ పరిగెత్తుతూ అమాంతం అమ్మ వొళ్ళోకి వచ్చిపడ్డాడు "ఏమిరా నాయనా! ఏమి వచ్చిందిరా? నెప్పి యెక్కడరా?" ఆత్రంగా అడిగింది అమ్మ మా రహస్య సంభాషణ అమ్మ చెవిన పడలేదు

భోరున యేడుస్తూ అమ్మకి దణ్ణంపెడుతూ వెక్కిళ్ళమధ్య మాటల్ని సాగదీస్తున్నాడు తమ్ముడు

"నాకు దిష్టీలేదు యేమీలేదే అమ్మా! నిజంగా చెప్తున్నానే జ్వరము కూడా తగలలేదే తలకాయనెప్పి, కళ్లు మంటలూ అబద్ధమే నే ఎగతాళికి చెప్పేనే అమ్మా దాన్ని పంపివేయవే"

వెక్కి వెక్కి యేడ్చే తమ్ముడి వంకా, ప్రక్కనే నుక్కలుపట్టి నవ్వుతున్న నా వంకా అర్థంకాక చూస్తున్నది అమ్మ లంబాడి లచ్చి చేతిలో కత్తిక్రింద పడిపోయింది తెల్లబోయి చూస్తున్నది

నవ్వు ఆపుకుని తమ్ముడికి జ్వరం లేదనీ, లంబాడి లచ్చిని పంపివేయమనీ చెప్పి దాని చేతిలో ఒక పావలా పెట్టి సాగనంపాను అమ్మకి విషయమంతా తెలిపి చెప్పేవరకూ నామీద కోపం పోనేలేదు తమ్ముడు ఆ రోజల్లాయింట్లో యెవరితోనూ మాట్లాడలేదు.

రాత్రి భోజనాలకు కూర్చున్నాను తమ్ముడిముఖం చిన్నబోయివుంది నోరెత్తి మాట్లాడలేదు కన్నెత్తి చూడనూ లేదు స్తబ్ధుగా బుద్ధవిగ్రహంలా కూర్చున్నాడు

"ఇవాళ మా చిన్న అబ్బాయిగారు మౌనంగా వున్నారేం? - నాన్నగారు అడిగారు జరిగిన సంఘటన యెవరూ చెప్పలేదు

"ఇవాళ అసలు వాడు అల్లరే చేయలేదు చక్కగా బడికిపోయి వచ్చాడు" - అన్నది అమ్మ తమ్ముడివంక చూచి నవ్వుతూ.

"చాలా బుద్ధిగా వున్నాడు" - అందుకున్నాను

"నోట్లో ముద్ద దిగమ్రింగి మా యిద్దరి వంకా వోరచూపులు చూచాడు తమ్ముడు

"అంత బుద్ధిమంతుడయినాడా? అయితే యివాళ వర్షం వచ్చినట్లే" - అన్నారు నాన్నగారు

"వచ్చినట్లే కాదు" నిజంగానే వచ్చింది" - అనుకోకుండానే అమ్మా నేనూ అన్నాము

తమ్ముడికి యెప్పుడయినా జ్వరంకాని, తలనొప్పికాని వస్తే, ముందుగా చెప్పటానికి యిప్పటికీ జంకుతాడు తమ్ముడు కనిపించి నప్పుడల్లా లంబాడి లచ్చి అదోరకంగా చూస్తుంటుంది ★

చిత్రసమీక్ష:

అశ్వనీ వారి

"మాయలమారి"

★

[తెలుగు జానపద చిత్రం]

రచన తాపీ ధర్మారావునాయుడు
ఫోటోగ్రఫీ బి. ఎస్. రంగా
సంగీతం ఆదినారాయణరావు
ఆర్టు టి. వి. ఎస్. శర్మ, వాలి
డాన్సులు వేదాంతం రాఘవయ్య
ప్రొడక్షన్ లక్ష్మణమూర్తి
డైరెక్షన్ శ్రీధర్
స్టూడియో శోభనాచల
నటులు అంజలీదేవి, నాగేశ్వరరావు, ముక్కామల, లక్ష్మీకాంత, సురభి బాల సరస్వతి, శివరావు, సీత, రామ్మూర్తి, సీతారాం వగైరా.

ఇందుమతి (అంజలి) ని పెండ్లాడిన వాడికి రాజ్యం కూడా వస్తుంది. అందుచేత, సేనానాయకుడూ, ఆమె మేనమామా అయిన భాస్కరవర్మ (ముక్కామల) ఆమెమీద కన్నువేశాడు. కాని ఆమె తన బావను ప్రతాప్ (నాగేశ్వరరావు) ను ప్రేమించింది. రాజుగారు తన కూతురి మనస్సు తెలుసుకొని ఇద్దరికీ పెళ్లి తలపెడతాడు. ఈ పెళ్లి పడగొట్టటానికి భాస్కర్ తన అనుచరుల ద్వారా ఇందును అపహరించి రహస్యంగా నిర్బంధంలో ఉంచుతాడు. ప్రతాప్ ఇందు జాడ తెలుసుకుని ఆమెను నిర్బంధంనుంచి తప్పించుకుని ఆమెతో రాజ్యం దాటిపోయి పేదిభాగవతులలో చేరుతాడు. భాస్కర్ దూతలు వీరిరువురినీపోల్చి పట్టుకోబోగా ఇద్దరూ తప్పించుకుని ఒంటరిగా ఎక్కడికో వెళ్లిపోతారు.

శాపంచేత వికృతరూపం ధరించిన ఒక గంధర్వస్త్రీ (లక్ష్మీకాంత) మాయోపాయంచేత ప్రతాప్‌ను తీసుకొనిపోయి అతని ద్వారా తన శాపం పోగొట్టుకొని అతన్ని కామిస్తుంది. కాని ప్రతిఫలంలేక తన దారిన తాను పోతుంది.

ప్రతాప్‌ను పోగొట్టుకున్న ఇందూ నదిలో పడి ఆత్మహత్య చేసుకోబోగా కోయనాయకుడు ఆమెను బతికించి తన ఇంటికి తీసుకుపోయి చెరపడతాడు.

మాయలమారిని వదిలించుకుని మళ్లా భాస్కర్ అనుచరులకు దొరికి పారిపోయే ప్రతాప్‌ను "కురంజి" అనే కొండసాని (బాలసరస్వతి) రక్షించి అతనికి కోయ వేషం వేస్తుంది. నాయకత్వంకోసం కొట్టుకోవటంలో కోయనాయకుణ్ణి ప్రతాప్ ఓడిస్తాడు. అనంతరం కోయనాయకుడు తాను చెరపట్టిన ఇందూను చెరచబోవటంలో ఇల్లు అంటుకుంటుంది. మంటలనుంచి ఆమెను ప్రతాప్ రక్షించేలోపునే ఇందూ బయటపడి తప్పించుకుంటుంది.

ఈలోగా భాస్కర్, అతని అనుచరులు గడ్డాలు పెట్టుకుని భక్తులవలె ఆశ్రమం నడుపుతూ ఉంటారు. వారికి ఇందూ చిక్కుతుంది. ఇందూ జాడ "కురంజి" తెలపగా విని ప్రతాప్ అక్కడికి వచ్చి భాస్కర్‌కు బందీ అవుతాడు.

అదితరకే తన అక్కనూ బావనూ ఖైదులో ఉంచిన భాస్కర్, ఇందూ తనను పెళ్లాడడానికి ఒప్పుకోకపోతే ప్రతాప్‌ను ఉరితీయిస్తానంటాడు. ప్రతాప్‌ను ఉరితీయబోయే సమయానికి కోయదండు వచ్చిపడి భాస్కర్ పరివారాన్ని జయిస్తుంది. ప్రతాప్‌తో కత్తియుద్ధంచేసి భాస్కర్ చచ్చిపోతాడు. కోయరాజుకు నాయకత్వం తిరిగి వప్పజెబుతాడు ప్రతాప్. ప్రతాప్ ఇందూ పెళ్లాడి సుఖంగా ఉంటారు.

కథకు "మాయలమారి" అన్న పేరు అంతే సార్థకంగా లేదు. ఇందులో మాయలమారి కథను ఒక్క అంగుళమైనా నడిపించదు. భాస్కర్ అనుచరులు భాగవతం ఆట భగ్నంచేసిన సమయంలో ఇందూ ప్రతాప్‌లు చెరొకదారీ అయిపోయినట్లయితే కథ ఇప్పుడున్నట్టే ఉండేది. మాయలమారి పాత్రా, ఆ పాత్రను సంబంధించిన సన్నివేశాలూ ఎత్తివేస్తే ఇంద్రజాలం లేకుండా కథ వాస్తవికంగా నడిచిఉండేదికూడానూ. అట్లా జరగకుండా ఉండగలందులకే మాయలమారి పాత్ర ప్రవేశపెట్టారేమో. అయితే కథకు ఆ పాత్రపే రెందుకు పెట్టారో తెలియదు.

కథలో కొట్టవచ్చినట్టు కనపడే అభూతకల్పన ఏమంటే ఒక సేనానాయకుడు తన రాజునూ, రాణినీ చెరపెట్టించటం. సాధారణ పరిస్థితుల్లో పాతకాలంలో ఏ సేనాధిపతీ ఈపని చెయ్యలేడు. రాజసౌధంలో భటులు సేనాపతి ఆజ్ఞపై రాజదంపతులను ఖైదుచెయ్యరు. అట్టి చర్య ఎన్నడూ నిర్విఘ్నంగా సాగదు. ఒకవేళ సాగినా చుట్టుపక్కల రాజులు ఊరుకోరు. రాజు దుష్టుడైఉండి రాజుపై ప్రజల ఆగ్రహం రగులుకొంటున్నప్పుడు ఆ ఆగ్రహాన్ని సేనాపతి తన స్వార్థానికి వినియోగించుకోవచ్చు. ఈ కథలో అటువంటి దేమీ కనపడదు. ఈ సేనాపతి అంత రాజద్రోహం చెయ్యటమే గాక తన కాలమంతా ప్రతాప్ ఇందూలను వెతకటానికే, గడ్డాలూ, మీసాలూ తగిలించుకుని ఆశ్రమాలు నడపటానికే వినియోగిస్తాడు. ఈ చిత్రంలో ముఖ్యపాత్రఅయిన భాస్కరవర్మ కేవల అభూతకల్పనగా గోచరిస్తుంది.

రాజభవనంలో ఎట్టి తిరుగుబాటూ లేకుండానే కర్రలు పట్టుకొచ్చిన కోయవాళ్ళు రాజసైనికులను ఓడించటంకూడా అభూతకల్పనే.

ఇందూ ప్రతాపులు రాజ్యంవదిలిన అనంతరం, తిరిగి వాడు భాస్కరుడు దొరికేవరకూ జరిగే సన్నివేశాలకు వేటికీ కథా నియమాలు లేవు — కోయవాళ్లకు సంబంధించిన అంశాలు మినహా. దురదృష్టవశాత్తూ మనం తెరమీద చూసే సంఘటనలు హెచ్చుభాగం ఈ నియమరహిత సంఘటనలే. ఇందులోనే నాయికా నాయకుల కష్టాలూ, హాస్యమూ జాస్తిగా ఇముడ్చబడ్డాయి. ఈ సంఘటనలలోనైనా కొత్తదనం ఏమీ లేదు. నాయికా నాయకులు ఏ అరణ్యంలోనో చీలిపోవటమూ, నాయిక ఏ కిరాతకుడిచేతనో పడటమూ, నాయకుణ్ణి ఏ మంత్రగత్తో, గంధర్వస్త్రీయో ఎత్తుకుపోవటమూ మొదలైన సంఘటనలు అనేక జానపద చిత్రాలలో చూశాం. ఈ కలగాపులగంలో కోయవాళ్లు మాత్రం సద్వినియోగమైనారు. ఇందూ కష్టాలు గట్టెక్కించటానికి పైనుండి సహాయం రావాలన్నది కథ మొదట్లోనే ప్రేక్షకులకు రుజువైపోయింది. ఎందువేతనంటే భాస్కర్ నిర్బంధంనుంచి ఇందూను

తప్పించిన ప్రతాప్ ఆమెను తీసుకుని నేరుగా రాజభవనానికిపోయి భాస్కర్ దుర్మార్గం బయటపెట్టటానికి బదులు ఆమెతోసహా అడవిమార్గం పడతాడు, భాగోతులలో చేరిపోతాడు, ఇందూ ప్రతాప్‌ల వెంటపడిన అరడజనుమంది భాస్కర్ మనుష్యులనుంచీ రక్షించే శక్తులు రాజభవనంలో లేనట్టు అక్కడే రుజావయింది

"మాయలమారి" కథ కొన్నిచోట్ల చూడ బుద్ధిపుడుతుంది, కొన్నిచోట్ల విసుగెత్తిస్తుంది కొన్నిచోట్ల వేగంగా నడుస్తుంది, కొన్నిచోట్ల కుంటుతుంది, ఎక్కడా హృదయాన్ని గట్టిగా పట్టుకోదు

అనేక లోపాలుగల ఈ కథను శ్రీధర్ సాధ్యమైనంత నేర్పుతో నిర్మించాడు ఏ దృశ్యానికా దృశ్యం తీసుకుని చూస్తే డైరెక్షన్ భావగర్భితంగానే ఉన్నది కొన్నిచోట్ల కెమెరా కూడా డైరెక్షనుకు అనుగుణంగా ఎంతో జీవంతో కదిలింది. కాని మొత్తంమీద ఫోటోగ్రఫీ మొదటి నుంచి కొసవరకూ ఒకే స్థాయిలో లేదు అక్కడక్కడా రాత్రిదృశ్యాలకూ, పగటి దృశ్యాలకూ తారతమ్యం తెలియటంలేదు ఇంటర్వల్ తరవాత ఫోటోగ్రఫీ చాలా బాగున్నది మాయలమారి గుహలలో నెన్ని వేశాలూ, ఉరిస్తంభం దగ్గర కొట్లాటలు మొదలైనవీ చక్కగా ఫోటోగ్రాఫు చేయబడ్డాయి

ప్రధానపాత్రలు ధరించిన వారందరూ తమ పాత్రలను ఉన్నంతవరకు బాగానే పోషించారు అంజలీదేవీ, నాగేశ్వరరావూ, ముక్కామలా, సురభి బాలసరస్వతీ తమ పేరు కాపాడుకోగలిగారు ముక్కామల ధరించిన భాస్కరవర్మ పాత్ర సృష్టిలో చాలా వెలితి కనిపిస్తుంది అందుచేత ఆ పాత్ర ఎంతకూ రక్తికిరాలేదు అతని దుర్మార్గానికంతకూ కారణం ఇందూమీది ప్రేమే అయితే, అతను ఇతర విధాల మంచివాడని రుజువుచేసి ఉండవలసింది, కాకపోతే అతని దుర్మార్గానికి ఇతర నిదర్శనాలు చూపి ఉండవలసింది "నువే నన్ను క్రూరుణ్ణి చేశావు," అని భాస్కర్ ఇందూతో అన్నప్పుడు ప్రేక్షకులు అతని మాటలు నమ్మటానికిగానీ, ఆమాటలు అబద్ధమని రుజువు చెయ్యటానికిగాని అశక్తులై ఉంటున్నారు ఇదే ఈ పాత్రలో వెలితి

ఆధునిక నృత్యాలుకూడా ఈ చిత్రంలో పెట్టారు ఈ నృత్యాలు ఎంత ఆధునికమంటే నృత్యాలలో ప్రస్తావించబడిన వాటిలో జమీందారీల రద్దూ, దొంగవ్యాపారమూ, రైతు విజయమూ ఉన్నాయి!

పాటలు బాగానే ఉన్నాయి మట్లు చాలాభాగం స్వతంత్రంగా ఉన్నందుకు సంగీతదర్శకుడైన ఆదినారాయణను అభినందించాలి కథలోఉన్న చౌకబారుతనం చిత్రనిర్మాణంలో లేదు సెట్టింగులు, దుస్తులు మొదలైనవాటిల్లో ఎట్టి లోపమూ జరగలేదు అందుకైనా ఈ చిత్రం కొంత ప్రజాదరణ పొందవచ్చు ★



★ "దీక్ష"లో రామగోపాల్, వరలక్ష్మి ★



"నవ్వితే నవరత్నాలు' లో

★ కృష్ణకుమారి ★

సినిమా స్క్రిప్టు: దాని పరిణామం

★

తెలుగులో టాకీలు పుట్టేనాటికే పాశ్చాత్యదేశాలలో సినిమా కళ చాలా అభివృద్ధి చెందిఉన్నది టాకీలు ఆ దేశాలకూ కొత్తేఅయినప్పటికీ సినిమాకళను "మూవీ"ల ద్వారా పాశ్చాత్యులు చాలా ఉన్నత స్థాయికి తెచ్చిఉన్నారు సినిమా చిత్రం తాలూకు సినారియో, ఫొటోగ్రఫీ, ఎడిటింగు మొదలైన అంగాలను వివరిస్తూ బోలెడన్ని గ్రంథాలుకూడా ఇంగ్లీషులో వెలువడి ఉన్నాయి ముఖ్యంగా పుడోవ్కిన్ రాసిన "ఫిల్ము టెక్నిక్", "ఫిల్ము ఆక్టింగ్" అనే పుస్తకాలు మూవీ సినిమా కళకు చెందిన అనేక రహస్యాలను బయట పెట్టాయి

అయినప్పటికీ పాశ్చాత్యులు సినిమా రంగంలో సాధించిన శిల్పవిశేషాలను భారతీయ చిత్రనిర్మాతలు చిత్రనిర్మాణంలో ఏమాత్రమూ వినియోగపరచుకో లేదు ముఖ్యంగా సినిమా స్క్రిప్టు విషయంలో ఇది సుస్పష్టమయింది అనేకమంది హిందీ చిత్రనిర్మాతలూ, చాలామంది తెలుగు చిత్రనిర్మాతలూ కూడా స్క్రిప్టు అనదగినది లేకుండానే సినిమా చిత్రాలు తీశారు

చిత్రానికి కథ అనుకున్నాక ఆ కథను అనేక రంగాలుగా-నాటకంలోని రంగాలకంటె చాలా చిన్నవిగా-విభజించి, ప్రతి రంగంలోనూ చేసే సంభాషణను ఏ "కవి" గారి చేతనో రాయించటమూ, ఆ సంభాషణలను "షాట్స్"గా విభజించటమూ, దాన్నే స్క్రిప్టు అని కామెరావాడి మొహాన పారెయ్యటమూ ఆచారంగా ఉండేది ఈ సంభాషణలు రాసే ఆయనను "కవిగారు" అని పిలిచేవాళ్ళు నిజానికి ఆయనవల్ల ప్రొడ్యూసర్లు ఆశించేది కవిత్వమే పాటల్లోనూ, మాటల్లోనూ కూడా "కవిత్వం" ఉండాలి పాత్రోచిత సంభాషణాలూ, సహజ సంభాషణలూ అన్నవి ఊహించరానివిగా ఉండేవి సంభాషణలు గ్రాంథికభాషలో ఉండేవని వేరే చెప్పనక్కర్లేదు

దీనికి తగ్గట్టే ఆనాటి రికార్డింగు తరుచు ఫిడెలిటోన్, బ్లూబర్డ్ మొదలైన సాధనాలతో జరిగేది నటులు తమ సంభాషణలను పట్టిపట్టి చదవాలి గొంతు ఆడే తగ్గించరాదు చివర "క్రాప్" వచ్చిందంటే రికార్డిస్టు "ఓకే" చేసేవాడు కాదు అయితే ఈ పెద్ద ఆర్ సి ఏ, వెస్టర్న్ ఎలక్ట్రిక్ వగైరా రికార్డింగు యంత్రాలు వచ్చాక తీరిపోయింది ఇవాళ రహస్యాన్నికూడా అవలీలగా రికార్డు చేస్తున్నారు

తొలిదశలో మన చిత్రనిర్మాతలు స్క్రిప్టును గురించి పాశ్చాత్యుల పద్ధతులు నేరవకపోవటానికి కారణం ఆనాడు తీసిన పౌరాణిక చిత్రాలే కావచ్చు పౌరాణిక



"ఆడబ్రతుకు" చిత్రంలో శ్రీరంజని, మల్లిక.

చిత్రాలలో పాత్రలనుగాని, కథనుగాని ప్రత్యేకించి ప్రేక్షకులకు పరిచయం చేయనవసరం లేదు

క్రమేణా సినిమా స్క్రిప్టులో మార్పు రాసాగింది పౌరాణిక చిత్రాలుపోయి సాంఘిక చిత్రాలు రాసాగిన తరవాత ప్రేక్షకులకు – ముఖ్యంగా విమర్శకులకు– కథలోని లోపాలు కొట్టవచ్చినట్టు కనపడసాగాయి స్క్రిప్టు రచయితలుగా కథకులు రావాలన్న ఆందోళన బయలుదేరింది ఈ ఆందోళన ఫలించలేదనే చెప్పాలి ఎందుకంటే ఈ దశలో కొత్తగా స్క్రిప్టు రాయటానికి తీసుకురాబడ్డవాళ్లు కథనంలో ఆరితేరినవారు కారు–సంభాషణలు రాయటంలో కొంత సామర్థ్యం గలవాళ్లు—సాంఘిక చిత్రాలు ముందుకు వచ్చినాక సినిమా సంభాషణలలో పరిణామం కలిగింది గ్రాంధిక భాష స్థానే వ్యావహారిక భాష వచ్చింది సంభాషణలు చాలావరకు పాత్రోచితంగా ఉండసాగాయి

కాని సంభాషణలు మాత్రమే స్క్రిప్టు అనిపించుకోవు స్క్రిప్టులో సంభాషణలది ఆఖరు తాంబూలం ముఖ్యమైన కథకు డైరెక్టర్లే పూచీపడసాగారు. ఈ డైరెక్టర్లు కథనంలో సిద్ధహస్తులయినా కాకపోయినా, వీరికి చిత్రనిర్మాణానికి చెందిన పరిజ్ఞానం ఉండటంచేత కథను వ్యక్తపరచటంలో కామెరామన్ నిర్వహించగల పాత్రకు కొంత ప్రాముఖ్యం ఇవ్వగలిగారు. సినిమా చిత్రనిర్మాణానుభవం లేని కథకులకు ఇది సాధ్యం కాదు ఈ మార్పు ఫలితంగా సినిమా చిత్రనిర్మాణంలోకి కథకులు దిగని లోపం అట్టే ఉండిపోయినా సినిమా కథలు ప్రదర్శించటంలో కామెరా యొక్క పనితనానికి ప్రాముఖ్యంమటుకు తప్పక ఏర్పడింది

ఇటువంటి పరిస్థితిలో చిత్రనిర్మాణానికి సిద్ధహస్తుడైన కథకుడు అవసరమే లేకుండా చేస్తూ జానపద చిత్రాలు వచ్చాయి వాయిల్, జార్జెట్, క్రేప్ వగైరా తానుల నుంచి ముక్కలు చించి రకరకాల అద్దకాలూ, అంచులూ ఏర్పాటుచేసి చీరెలు చెయ్యటంలాటిది జానపద కథలు తయారు చెయ్యటం ఎటువంటి పాత్రలనైనా అందులో పెట్టవచ్చు, ఎటువంటి సన్నివేశాలైనా కథలో ఇరికించవచ్చు, మనస్తత్వాన్ని కూడా ఆట్టే పాటించనవసరం లేదు (ఉదాహరణకు' నిత్యజీవితంలో మనకు జాలిగాని, అసహ్యంగాని పుట్టించే పాత్రలు జానపద చిత్రాలలో హాస్య పాత్రలుగా ఉంటాయి)

ఇప్పుడు విశేషంగా వెలువడే జానపద చిత్రాలు వెనకపడ్డాక చిత్రనిర్మాతలు తిరిగి సాంఘిక చిత్రాలకు వచ్చితీరాలి ఇక ముందు తీయబోయే సాంఘిక చిత్రాలకూ కొంతకాలంక్రితం వచ్చిపోయిన సాంఘిక చిత్రాలకూ ఒక పెద్ద తేడా ఉండబోతుంది "మాలపిల్ల," "రైతుబిడ్డ," "మళ్లీపెళ్లి," "సుమంగళి", 'దేవత" మొదలైన చిత్రాలలో లాగ వ్యక్తి సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చి చిత్రాలు తీస్తే అవిసెగ్గవు ఇక ముందు ఎత్తుకొనే సమస్యలు విస్తృత సమాజానికి చెందినవై ఉండాలి జీవితం తెర మీద వాస్తవికంగా చిత్రించబడాలి. వినోదంకలిగించే చిత్రాలు ఎట్లా ఉన్నా ఇబ్బందిలేదు గాని, భావోద్రేకంతో కూడినచిత్రాలు కృత్రిమ జీవితాన్ని చిత్రిస్తే ప్రజలు ఆదరించకపోవచ్చు. ఇటువంటిమార్పు సాహిత్యంలో బాగా వచ్చేస్తున్నది సినిమాలలోకి వస్తుందనుకోవటానికి అవకాశం లేకపోలేదు ఇటువంటి పరిణామంతోబాటు కథకులు చిత్రనిర్మాణంలో ప్రవేశించక తప్పదు. ★

"నువ్వు నన్ను చేసుకోనంటున్నావు గనక ఇక నేను ఆజన్మ బ్రహ్మచారినే.

"అదేమిటి? నేను చేసుకోకపోతే నిన్ను మరొకరు చేసుకోకూడదూ?"

"నువే చేసుకోకపోతే నన్నింకెవరు చేసుకుంటారు? ఎవరూ చేసుకోరు".

* * * *

భీమాఅధికారి: అమ్మా, మీ భర్తకు మేమేమీ ఇవ్వనక్కర్లేదు. ఆయన మాదగ్గిర చేసుకున్నది అగ్ని భీమా

వితంతువు అదే నేననేది. మా ఆయనకు దాహనక్రియలు చేశారు.

"దుక్కిటెద్దు దేశాంతరం"

(15-వ పేజీ తరువాయి)

ఏమిటి? అంది అమ్మగారు పాత మెప్పు చెప్పినట్లు

"వీరయ్య సమాధానం చెప్పకుండా, బండిని అట్లాగే మలుపుకొని బడిదగ్గరకి వెళ్లాడు"

ఒకరోజుకంటే ఒకరోజు వీరయ్యకి కష్టాలు జాస్తయినాయి ఎంత కష్టపడి పనిచేసినా, అమ్మగారికి తృప్తిలేదు కాసేపు కూచున్నా "గోళ్లు గిల్లుకుంటూ" అలా కూచున్నావేంరా చెట్లకు నీళ్లన్నా పొయ్యక" అనేది అమ్మగారు చెప్పిన పనులన్నీ ఓర్పుతో చేస్తునే వచ్చాడు ఓనాడు సుందరంపంతులుగారు ఏ ఖర్చులకనో జయమ్మగారికి డబ్బిచ్చి పోయారు, కచేరీకి వారితోపాటే వీరయ్య కూడా బండి తోలుకొని వెళ్ళాడు

పంతులుగార్ని కచేరీకి తీసుకెళ్లి తిరిగి వీరయ్య వచ్చేసరికి "ఏంరా వీరయ్యా!" నడవాలో కొచ్చినప్పుడు డ్రాయరుమీద వున్న "పదిహేను" రూపాయిలున్నా చూశావా? అని ప్రశ్నించింది వీరయ్యకి కాళ్లూ చేతులూ వణకసాగాయి, విభ్రాంత పోయి చూస్తున్నాడు మళ్లా జబర్దస్తీగా గదమాయించింది అమ్మగారు "ఏ పాప"మూ ఎరుగని వీరయ్యేం చెబుతాడు? యిలా సే మధ్యాహ్నం దాకా తర్జన భర్జనలు జరిగాయి వీరయ్య తన మామూలు పనులన్నీ సాయంత్రానికి నిర్వర్తించాడు

సాయంత్రం పంతులుగారు రాగానే, ఈ "కేసు" విచారణ కొచ్చింది పంతులుగారు సామ, దాన, భేద దండోపాయాల్తో ప్రయత్నించి చూచారు కాని, వీరయ్య నోటంట "తెలీద"న్న ఒక్క మాట తప్ప యింకోటి చెప్పించలేకపోయారు వీరయ్య కన్నీరు మున్నీరుగా ఏడవడం తప్ప యింకోమాట నోటంట రాలేదు పంతులుగారాలోచించి, ఆలోచించి, భార్యనడిగారు "ఏ మేవీడిమీద అనుమానముందా?" అని "ఏమో?" మీ రాఫీసుకు వెళ్లేటప్పుడు బండిలో లివాసీ వెయ్యటానికని నడవాలోకి వచ్చాడు మీ రప్పుడే యిచ్చినరూపాయలు డ్రాయరుమీద పెట్టున్నాయంది

ఏమయితే ఏం పంతులుగారు, నాలేళ్లగా ఉన్న వీరయ్యమాటని విశ్వసించలేకపోయారు "ధనమూల మిదం జగత్" కదండీ! ఎలా నమ్మగలరు? వాడికా రాత్రి అన్నం కూడా పెట్టకుండా, యిల్లు విడిచిపోవలసిందిగా ఆర్డర్ పాస్ చేసి వెళ్లగొట్టారు

వీరయ్య రాత్రి యిల్లు విడిచి వెళ్లి పోయాక, ఏదో పని మీద వంటింట్లోకి వెళ్లిన జయమ్మగారికి అలమర తియగానే పదిహేను రూపాయలూ కనిపించాయి వెంటనే ఆమె గుండెలు కొట్టుకో నారంభించాయి ఒక పక్క ఏపాపమూ ఎరుగని వీరయ్యని దండించి వెళ్లగొట్టినందుకూ, ఇంకో పక్క తాను చేసిన తప్పిదానికి ఇంకో ప్రాణిని అప్రతిష్ఠ పాలు చేసినందుకూ, తీరా ఈ సంగతి పంతులుగారికి తెలిస్తే ఏమంటారో ననీ ఆమె కుమిలి పోజొచ్చింది గాని, తాను చేసిన ఈతప్పిదాన్ని పంతులుగారికి చెప్పకుండా దాచలేకపోయింది, యికనైనా వీరయ్యని వెతికి తీసుకురావచ్చునన్న ఊహతో వెంటనే వెళ్లి పంతులుగారాఫీసు రూములో కూచుని ఏవో ఫైల్సు చూసుకుంటూంటే, వెళ్లి నిశ్చేష్టురాలై నిలబడింది

పంతులుగారు ఫైల్సు చూసుకుంటూ, చూసుకుంటూ తలెత్తి చూచేసరికి భార్య కనిపించింది 'కళావిహీనం'గా వున్న భార్యముఖాన్ని తదేక దృష్టితో చూస్తున్నాడు సూర్యకాంతులకు వికసించు పద్మంలా, తన్ను చూచేసరికి కళకళలాడుతూ ఆనందాతిరేకంతో సంభాషించే ప్రియురాలి మోము మూచి కొయ్యబారి పోయాడు పంతులుగారు

జయమ్మగారికి నోటమాట రావటంలేదు అడగడానికి పంతులుగారి కంతకన్నా నోరాడటంలేదు కాస్సేపటికి తెప్పరిల్లి కొని "ఇదిగోనండీ రూపాయలు" అంది భార్య సుందరంపంతులుగారు ఒక్కమారు ఆపాదమస్తకం కంపించిపోయారు వీరయ్య నిజాయితీకి విలువకట్టలేకపోయారు వెంటనే పిచ్చెత్తినవాడిలా, బజార్నబడి "వీరయ్యా! వీరయ్యా!" అంటూ వీధులూ, రైలుస్టేషనూ అన్నీ గాలించివచ్చారు ఎక్కడున్నాడు వీరయ్య? ఆనాటి రాత్రే ఫలానిపిల్లకాయ రైలెక్కి మద్రాస్ వైపు వెళ్ళాడని అక్కడి వాళ్లు చెప్పారు సుందరంపంతులుగారు విచారవదనులై యిల్లు చేరుకున్నారు సుందరంపంతులుగారి కుటుంబం వీరయ్యని మరుద్దామన్నా మరువలేకపోయింది

వీరయ్య మర్నాటికి మద్రాస్ చేరుకున్నాడు టిక్కెట్ కలెక్టర్లనందర్నీ తప్పించుకొని స్టేషన్లో ఓమూలకూచొని తనకు తెల్సినవాళ్లపిల్లాడు ఆవూళ్లోనే ఉన్నాడన్న విషయం జ్ఞాపకం చేసుకున్నాడు ఎక్కడున్నాడో ఎలా తెల్సుకోడం! ఈమహాపట్నంలో అనుకున్నాడు తెల్సుకున్నా యిన్ని సంవత్సరాలనాడు పారిపోయొచ్చిన నా సంగతాయనకు జ్ఞాపకం ఉంటుందా! ఉన్నా, మావాళ్లతో చెప్పేస్తాడేమో! కనబడితే అనుకున్నాడు వీరయ్య కొంత సేపాలోచించుకొని దారీ తెన్నూ తోచక, నిమ్మదిగా టౌన్లోకి నడిచాడు అవీ ఇవీ చూసుకుంటూ నడుస్తున్నాడు. అప్పటికి పదకొండుగంటలవేళ దాటుంటుంది ఎండవేడిమి జాస్తిగా వున్నది నెత్తిమాడుతూ, కడుపుకాల్తూ ఉన్నాయి గతదినం తిన్నతిండి, ఏ హోటల్కోపోయి తిందామా అంటే చేతిలో ఎర్రనిఏగానీ లేదు నానా బదములాపడి ఎలాగో చేరుకోటమే గగనమయిందాయెను, యింతలో ఆ ప్రక్కనే "ఆంధ్రాకేఫ్" అనే పెద్దపెద్ద అక్షరాలతో ఓ హోటల్ కనిపించింది దాన్ని చూడగానే ఎప్పుడూ మదరాసు చూడని వీరయ్యకి యిక్కడ గూడా "మనవాళ్లున్నారే!" అని సంతోషాశ్చర్యాలు కలిగాయి యిన్నాళ్లూ మదరాసులో "అంతా అరవమే" అనుకుంటున్నాడు వీరయ్య కాని యిప్పుడు తెలుగవాళ్లకుకూడా యిక్కడ మంచి స్థానమే ఉందనీ, మనవాళ్లుకూడా యిక్కడ పెద్దపెద్ద వ్యాపారాలు చేస్తున్నారనీ, తెల్సుకోగలిగాడు నిమ్మదిగా హోటల్లో అడుగపెట్టాడు లోపలికి వెళ్లి "కౌష్ ముందర' బుర్రమీసాలూ, అమెరికన్ కటింగ్

క్రాపూ, వ్రేళ్లకు ఉంగరాలూ అతిరివిగా కూచున్న యజమానిని చూచి ఎవరో కమ్మ నాయుడల్లే ఉండే అనుకున్నాడు వీరయ్య

నిమ్మదిగా యజమాన్ని సమీపించాడు సమీపించి తన దీనావస్థను చెప్పుకున్నాడు "ఈ పూట భోజనం పెట్టించా" లని మెల్లగా అడిగాడు ఎంత సుదరాసు అరవ వాళ్లతో స్నేహంచేస్తున్నా పోగా మిగిలిన ఆంధ్రత్వాన్ని నిలబెట్టుకోటాని కన్నట్లు అలాగే చెయ్యబ్బాయీ అని ఒక సర్వర్‌ను పిలిచి ఏమో చెప్పాడు వీరయ్య లోపలికి వెళ్లి భోజనానికి కూచున్నాడు అంతా అరవగోడుగా ఉన్నది బోర్డుమాత్రమే ఆంధ్రత్వాన్ని సూచిస్తున్నది గాని, లోపల పదార్థాలూ, మనుషులూ అంతా అరవ గోడుగా తోచింది వీరయ్యకి ఎలాగో ఈ పూటకి తన క్షుద్బాధ కొంత తీరింది కదా అనుకుని ఆ 'నాల్గు రేపక్ మెతుకు'లూ ఫలహారంలా నోట్లో వేసుకొని బయట పడ్డాడు

పోతూ, పోతూ యజమానిని కల్సుకొని అయ్యా! ఏదెయినా నాకు నౌకరీ యిప్పించ కూడదా? మీ హోటల్లో అని ప్రశ్నించాడు ఏంపని చెయ్యగలవని అడిగాడు యజమాని ఏపని చెయ్యమన్నా చేస్తా నన్నాడు వీరయ్య అయితే మా హోటల్లో సర్వర్ గావుండు, భోజనం పెట్టి పదిరూపాయలు యిస్తానన్నాడు యజమాని వీరయ్య అందుకు సంతోషించి సరేనని ఒప్పుకున్నాడు

మర్నాటినుంచీ వీరయ్య పనిలో ప్రవేశించి చేస్తున్నాడు వీరయ్య తెలుగోచ్చిన వాడవటంచేత, యజమాని యింటిపన్లను గూడా చేయించుకుంటున్నాడు వీరయ్యకి మొదట నాల్గయిదురోజులు కొంత కష్టంగా తోచలేదుగాని, క్రమంగా, సుందరం పంతులుగార్నే పోలనిపించేది అలానే అన్నిటికీ ఓర్చి, కష్టాలు "కాపురముంటాయా" అన్నమాట జ్ఞాపకం చేసుకుని పనిచేసుకుపోతున్నాడు వీరయ్య

ఒకనాడు, సర్వు చేస్తుండగా వీరయ్యను చూచాడు ఐదేళ్లనాడు, రామయ్య నాయుడిగారి ఇంట్లో వెళ్లిపోయాడనుకున్న వీరయ్యని ఈనాడీ హోటల్లో చూడగలిగాడు నేను వెళ్లి కుర్చీలో కూచోగానే నన్ను చూచి వీరయ్య నిశ్చాంతపోయాడు కొంతసే పయాక నన్ను సమీపించి, కుశల ప్రశ్న చేశాడు ఆ మాటా మాటమీద మా వూరి కబుర్లొచ్చాయి ఆదెయ్యకి జబ్బుగావుందనీ, నిన్ను చూడాలని మనసులో చాలా బాధపడుతున్నాడనీ, నిన్ను చూచి, ఆ కొంత ప్రాణం విడవాలని ఉగ్గబట్టుకు ఉన్నాడనీ వీరయ్యకి చెప్పాను వీరయ్యకూడా, వెళ్లాలన్న ఉత్సాహాన్నే కనబరిచాడు పూర్వపు విరోధాన్ని మరిచి వెంటనే యజమాన్ని శెలవు గావాలని అడిగొచ్చాడు కాని యజమాని శెలవివ్వడం సాధ్యపడదనీ, యిష్టముంటే ఉండమనీ లేకపోతే నీ యిష్టమనీ అన్నాడు వీరయ్యకి చాలా దుఃఖమూ, కోపమూ ఒకేమారు వచ్చాయి అంత ప్రమాద స్థితిలో ఉన్న మనిషిని చూడ్డానికూడా శెలవివ్వని ఉద్యోగం ఎందుకను కున్నాడు వీరయ్య సేరుగానాదగ్గరకువచ్చి ఈ విషయమంతా చెప్పి, నకు రావాల్సిన డబ్బు తీసుకుని, హోటల్ యజమానికి "గుడ్ బై" చెప్పి, "దుక్కి ఎద్దు దేశాంతరం"లాగే అయింది నా బ్రతుకు అనుకుంటూ, నాతోపాటే ఆవాళ మెయిలెక్కాడు వీరయ్య కాసేపటికి మెయిలు కదిలింది రైలుకూడా, "దుక్కి ఎద్దు దేశాంతరం" అన్నట్టే తోచింది వీరయ్యకి రైలు వేగంగా పోతున్నకొద్దీ అదే మననం చేస్తూ, స్వస్థానం చేరాడు వీరయ్య ★

"స్నేహితుడిని కనక చెప్పాలి సొచ్చింది శంకరం నిన్ను గురించి చాలా అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడు"

"దానికేం లే? వాడు నన్ను గురించి నిజం చెప్పటం మొదలు పెట్టినప్పుడు చెప్పు, వాడి భరతం పట్టిస్తా"

* * * *


లాయరు అయ్యా, కోర్టు రామాయణాన్ని తమ కుక్క తినే సింది

న్యాయమూర్తి అయితే సాక్షిని కుక్కను నెత్తిన పెట్టుకుని ప్రమాణం చెయ్యమనండి కొత్త రామాయణంకోసం కేసు వాయిదా వెయ్యాలిసొస్తుంది.

* * * *

"మర్యాదంటే ఏమిట్రా, అన్నయ్యా?"

"కావాలని ఉన్నప్పుడు అక్కర్లేదనటం."



చిట్టితల్లి

రాంషా

అనగా అనగా ఒక కొండపక్క
ఊళ్లో, ఏటి ఒడ్డున గుడిసెలో
ఉండేది ఒక చిట్టితల్లి. అందాల
పాలవెల్లి, సుగుణాల కల్పవల్లి
రూపాన కనకవల్లి ఆ చిట్టితల్లి.

ఆ ఊళ్ళో అంతటా
తరుచుగానే వినుచుందుము
చిట్టితల్లీ చిన్నిమాటలు,
తెల్లవారే వేళలందున
ఒంటిగానే కానిపించును;
చిట్టితల్లీ చిన్నిమాటలు
తరచుగానే వినుచునుందుము.

హితుల నెరుగదు, సఖుల నెరుగదు,
చిట్టితల్లీ చిన్ని బ్రతుకు,
గుడిసె ప్రక్కన మర్రివృక్షం
నీలినీడల ఒంటిగానే
చిట్టితల్లీ ఆడుకొనుచూ,
వెర్రి పాటలు పాడుకొనుచూ,
తనతో తానే మాటలాడుచు,
యుగయుగాలకు చిరంజీవిగ
గడుపుతుంటుంది.

రంగురంగుల పూలపైపై
ఎగిరిపోయే సీతచిలుకలనో,
ఆకుపచ్చని నేలపైనే
ఆడుకొను ఏ చెవుల పిల్లులనో,
చూడ సాధ్యం ఔను కానీ,
చిట్టితల్లీ మాత్ర మెప్పుడు
గోచరం కాదు.

జగతిలో అచ్చెరువు లెన్నో,
జగతిలో దుర్ఘటన లెన్నో,
జగతిలో దుఖ మ్ములెన్నో,
ఇదియు నందొకటి.

". కారుమబ్బులు దెసల క్రమ్మెను;
గాలివర్షం వచ్చితీరును,
చేలగట్లను నీదు తల్లీ
దిక్కుతోచక నిలచిపోవును;
గొడుగు పట్టుకు వెళ్లి రావమ్మా;
తల్లితో ఇటు తర్లి రావమ్మా!"

తండ్రిమాటలు చెవిని పడగా
శిరసుపైనే దాల్చుకొంటూ
తల్లి కోసం చేలగట్లను
తడుముకొంటూ అడుగు లిడినది
చిట్టితల్లీ సంజవేళల్లో.
వాన రాకడ, ప్రాణ పోకడ
దైవమైనా ఎరుగనేరదు;


వర్తమానపు మంచు తెరలలో
తడుములాడే నరుల కిం కెట్లు?
కారు మబ్బులు గడ్డకట్టెను,
నేల వానన దెసల గ్రమ్మెను,
మబ్బు కరిగీ ఏకధారగ
కుంభవృష్టిని వెళ్ళగ్రక్కెను,
చేలు గట్లూ ఏకమయ్యెను,
దిక్కులే సంద్రాలు అయ్యెను
నీటి తోపుకు, నీటి ఊపుకు,
తడుముకొంటూ, తూగులాడుతు
తల్లికోసం తండ్రి ఆజ్ఞను
పొలములంబడి వెళ్ళిపోయెను

దిక్కు తెన్నూ లేని చిట్టి
తల్లి తండ్రి రాత్రి అంతా
చిట్టికోసం వెదుకజొచ్చిరి—
దిక్కులన్నీ పిక్కటిల్లగ
చిట్టితల్లిని పిలుచుకొంటూ.

చిట్టి వెళ్ళిన జాడగానీ,
చిట్టి కంఠస్వరముగానీ,
చిట్టి నడచిన చోటుగానీ,
చిట్టడవిలో కానరాదయ్యెన్.
చిట్టికోసం బెంగటిలుతూ,
చిట్టికోసం కలలుగంటూ,
చిట్టికోసం ఏడ్చుకొంటూ,
తల్లి తండ్రీ తిరిగి వచ్చారు.
నాల్గురోజులు గడిచిపోయెను,
వాన నీరే తరిగిపోయెను,
ఊరి వెలుపల పొలములంబడి
నేలనూతిని చిట్టి తేలింది

ఆ కథనే నేటికీ ఆ గుడిసె ప్రక్క మర్రికొమ్మల చీకటి జీమూతంలో కీచురాళ్లు పాడుకొంటూంటాయి ఆ చిట్టితల్లి చావునే స్మరించి నేటికీ అక్కడి గుడ్లగూబలు రోదిస్తూంటాయి, ఆ తల్లిదండ్రుల మూర్ఖత్వాన్ని తలచుకొని ప్రతిరోజూ తీతువుపిట్ట తిడుతూనే ఉంటుంది.





జరిగిన కథ —

1537 వ సంవత్సరం లండన్‌లో హెన్రీ మహారాజుకు ఎడ్వర్డు అనే కొడుకూ, నిరుపేద జాన్ కాంటీకి టామ్ అనే కొడుకూ కలిగారు ఇద్దరూ ఒకే పోలిక పదేళ్ల వయస్సప్పుడు టామ్ రాజభవన కేసి వెళతాడు యువరాజు ఎడ్వర్డు టామ్‌ని లోపలికి తీసుకుపోయి ఆదరిస్తాడు ఒకరి జీవితంమీద మరొకరికి ఆసక్తికలిగి దుస్తులు మార్చుకుంటారు టామ్ దుస్తుల్లో యువరాజు కోటబైటకు రాగానే అతన్ని ప్రజలు నానా బాధ పెడతారు తను యువరాజునంటున్న కొద్దీ వాళ్లు అతన్ని ఇంకా ఎక్కువబాధ పెడతారు అక్కడ కోటలో యువరాజు దుస్తులుధరించిన టామ్‌ను యువరాజుగానే అంతా పరిగణిస్తారు అతడు తను బిచ్చగాళ్ల కుర్రాడినని చెప్పినా వాళ్లు పిచ్చెక్కింద నుకుంటారేగాని అతనిమాట నమ్మరు ఈలోగా వృద్ధరాజు హెన్రీ చనిపోతాడు అటు యువరాజు ఎడ్వర్డును మైల్స్‌హెండన్ అనే వీరయువకుడు రక్షించి తనుండే సత్రానికి తీసుకుపోతాడు ఇక చదవండి

15

బాలరాజు నీటి బేసిన్‌వద్ద మౌనంగా నుంచోవటం చూసి మైల్స్‌హెండన్ అన్నాడు

"ఫస్టుక్లాసయిన భోజనం వచ్చింది. వేడివేడిగా, పొగలు గక్కుతూ, ఆహ్వానిస్తున్నది చూశావా? ఇదేమిటో తెలుసా? కోడిమాంసం, రా, నీ కడుపు పట్టి నంతతిను తిని, నీళ్లుతాగి, కాస్సేపు కునుకు తీశావంటే, పోయిన ఉషారు తిరిగివస్తుంది"

బాలరాజు ఇంకా మౌనంగానే నిల్చున్నాడు అతని ముఖంలో కొంచెం చిరాకు, విసుగు కూడా కనిపిస్తున్నాయి హెండన్‌కి అర్థం కాలేదు సంగతేమిటో

"ఏమిటలా చూస్తావ్?" అని అడిగాడు

శ్రీ ... మోహనరావు

"నేను ముఖం కడుక్కోవాలి"

"ఓస్ ఇంతేనా? దీనికోసం నన్నడగాలా? ఇక్కడి వస్తువులు నీ ఇష్టమొచ్చినట్టు, నీ సొంతంలాగా వాడుకో. దేనికీ నన్నడగక్కర్లేదు."

అయినా బాలరాజు కదల్లేదు, మెదల్లేదు, అలాగే నుంచున్నాడు, చిరాగ్గా కాలితో నేలతంతున్నాడు, హెండర్ ఇంకా విస్తుపోయాడు అర్థంకాక.

"అరె అలా నిలబడి పోయావేమిటి? ఇంకా ఏం కావాలి?

"నీళ్లు అందించాలని తెలియదూ? అనవసరంగా వాగక నీళ్లు పొయ్యి"

హెండర్ వెక్కిరింపుగా నవ్వబోయాడు, కాని నవ్వును బలవంతాన అణుచుకుని, "చచ్చాన్రా దేవుడా! ఇదా సంగతి ఇతని ప్రవర్తన అంతకంతకు విచిత్రమై పోతున్నదే," అనుకున్నాడు లోపల గబగబ లేచి బాలరాజు ఆజ్ఞ నిర్వర్తించాడు ఇంతలో,

"చాలు తువ్వాలు—" అని గద్దింపు వినబడింది ఉలికిపడి బుజాన వున్న తువ్వాలు తీసి మూట్లాడకుండా అందించాడు తరవాత తను కూడా ముఖం, చేతులు, కాళ్లు కడుక్కున్నాడు బాలరాజు కుర్చీటపీ లాక్కుని భోజన మారగించటానికి సిద్ధపడుతున్నాడు హెండన్ రెండో కుర్చీపీట దగ్గిరగా లాక్కుని కూర్చోబోయాడు బాలరాజు గభాలున లేచి అధికార స్వరంతో గర్జించాడు

"ఆగు మహారాజు సన్నిధిలో కూర్చుంటావా? బుద్ధిలేదూ?" *

* ముఖచిత్రం చూడండి

పిడుగుపాటు లాంటి ఈ గర్జనకు హెండర్ పునాదులతోసహా కదిలిపోయి నిల్చున్నాడు

"ఓ. ఈపిచ్చివాడి పిచ్చి, కాలంతోపాటు మారుతోందే. వృద్ధరాజు పోయిన సంగతి ఇతనికికూడా ఎలా తెలిసిందో? వేల్సుయువరాజు దశలోంచి మహారాజు దశలోకి దిగింది పిచ్చి. ఇతనితోపాటే నేను కూడా మారాలి, కొంత కాలంపాటు ఈ పిచ్చికి తగ్గట్టే నడుచుకోవాలి. మరో మార్గంలేదు లేకపోతే నన్ను లండన్ గోపురంలో ఖయిదుచేస్తానంటాడు కూడాను"

ఈ ఆలోచనతో తనలో తనే తనేనవ్వుకున్నాడు రెండో కుర్చీపీట ఇవతలకు లాగివేసి బాలరాజు వెనక చేతులు కట్టుకునుంచున్నాడు. సేవకుడివలె అవీ, ఇవీ, అందిస్తున్నాడు. కాళ్లు నొప్పులు పెట్టినయ్ ఆకాలి మీద కాసేపు, ఈ కాలిమీద కాసేపునుంచుటున్నాడు

బాలరాజు భోజనం పూర్తయింది సుష్టుగా తినటంవల్ల రాజరీవి కొంచం నడలింది, ఉషారు హెచ్చింది, మూట్లాడాలని బుద్ధి పుట్టింది

"నీ పేరేమిటన్నావ్?"

"మైల్స్ హెండన అంటారు ప్రభూ!" అని జవాబిచ్చాడు 'ఇక నితో పేచీరాకుండా వుండాలంటే ప్రభూ, మహారాజా, స్వామీ మొదలైన పదాలు ఉపయోగించాల్సిందే ఇంతలో వచ్చిన నష్టమేమీ లేదుగదా! నేను కొంచెం మోటుగా వ్యవహరిస్తే అంతా అభాసవుతుంది,' అనుకున్నాడు తనలోతను

బాలరాజు ఇంకోగ్లాసెడు సారాయం తాగి మూతి తుడుచుకున్నాడు; హృదయం విచ్చబడింది. సగం మూసుకున్న కళ్లలోంచి సంతృప్తి తొంగిచూస్తోంది! ఇలా అన్నాడు:

"ఊ, నీకథ కాస్త వినిపించు. నిన్ను చూస్తే దయకలుగుతోంది. ఏదన్నా ప్రభుకుటుంబంలోని వాడివా?"

"అవును మహారాజా! నాతండ్రి కెంట్ రాష్ట్రంలోని 'హెండన్ హాల్' అధిపతి, ఆయనపేరు సర్ రిచర్డ్ హెండన్"

"ఎప్పుడో విన్నట్టే జ్ఞాపకం. ఊ, నీ కథ చెప్పు"

"ఆ, పెద్దకథంటూ ఏం లేదు ప్రభూ! ఓ అరగంటసేపు తమరికి వినోదంగా చెప్పమంటే చెబుతాను. నా తండ్రి సర్ రిచర్డ్ చాలా ధనవంతుడు, ధర్మగుణానికి పేరుపడ్డవాడు. నా తల్లి నా చిన్నతనంలోనే చనిపోయింది. నాకు ఆర్థర్ అనేఅన్న, హ్యూ అనే తమ్ముడు వున్నాడు ఆర్థర్‌కు మా తండ్రి గుణాలే అబ్బినై, కాని హ్యూ 'దుష్టబుద్ధి' అనేపేరుకు తగినవాడు, నీచుడు, అసూయ, ద్రోహం, చింత, స్వార్థం మొదలైన దుర్గుణాలు మూర్తీభవించినవాడు అతగుచిన్నప్పటినుంచీ అంతే, పదేళ్లకిందట నేను స్వదేశంనుండి వెళ్లగొట్టబడినప్పుడూ అంతే అప్పటికతనికి పందొమ్మిదేళ్ల వయస్సు. నాకిరవై ఏళ్లు, నా అన్న ఆర్థర్‌కు ఇరవై రెండేళ్లు ఉంటాయి మా మేనత్తకు ఎడిత్ అనే కూతురున్నది, ఆమె కప్పటికి పదహారేళ్లుంటాయి మా ఇంట్లోనే ఉండేది,

అందాలబరిణె, సుగుణాలమూట ఆమెకు అన్నదమ్ము లెవరూ లేరు, తండ్రికున్న అపార సంపదలన్నిటికీ ఆమె వారసురాలు. నే నామెను ప్రేమించాను, ఆమె నన్ను ప్రేమించింది కాని మా తండ్రి ఆమెను ఆర్థర్ కివ్వాలని సంకల్పించాడు ఆర్థర్ అదివరకే మరొక పిల్లని ప్రేమించి రహస్యంగా పెళ్లి చేసుకుందామనే ఆలోచనలోవున్నాడు అందుచేత అతడు నాకు, ఎడిత్ కు అడ్డంగానని, మేమిద్దరం స్వేచ్ఛగా ప్రేమించుకోవచ్చునని చెప్పాడు నా తమ్ముడు హ్యూ వున్నాడే, వాడికి ఎడిత్ కుగల అపార ధనంమీద ప్రేమ పుట్టింది ఎడిత్ ను పెళ్లిచేసుకుంటే ఆ ధనమంతా తనకే చెందుతుందిగదా అని వాడి దురాశ ఎలాగైనా మా ఇద్దర్నీ విడదీయాలని చూశాడు. నామీద ఎన్నో చాడీలు ఎడిత్ కు చెప్పాడు కాని ఆమె వాణ్ణి నమ్మక తోసివేసింది

మా తండ్రికి మా అందరిలోకీ హ్యూ అంటే విపరీతమైన అభిమానం. కడగొట్టుకొడుకు కనుకనూ, అందరికీ వాడంటే అసహ్యం కనుకనూ, హ్యూను మా తండ్రి ప్రేమగా చూసేవారు పైగా వాడు ఆయన దగ్గర జేరి తియ్యటి మాటలు చెబుతుండేవాడు. అంత చాకచక్యంగా అబద్ధాన్ని నిజం చెయ్యగల దొంగ ఇంకోడు లేడు నేనా రోజుల్లో కొంచెం జల్సాగా, పోకిరీగా తిరిగేవాణ్ణి అంటే ఇతరులకు హాని చేసే వాణ్ణని అర్థంకాదు నా నడత వల్ల ఎవరికీ బాధకలగకుండా మాసుకుపేవాడిని అయినా హ్యూ మాత్రం నా మీద పగకొద్దీ మానాయనగారి దగ్గర కొండెములు చెప్పి నేనంటే ద్వేషంపుట్టేట్టు చేశాడు మా అన్న కొంచెం రోగిష్టిమనిషి. అతడు కాస్తా ఎప్పుడో గుటుక్కుమంటే, ఈలోగా నన్ను తన కడ్డంరాకుండా దూరానికి పంపించి వెయ్యవచ్చుననీ, ఇక ఎడిత్ ధనసంపదలు తనకు చెందటానికి అడ్డంకి వుండదని హ్యూ ఎత్తువేశాడు ఆ తరవాత జరిగిన కథంతా చెప్పాలంటే చాలాసేపు పడుతుంది, టూకీగా చెబుతాను, మేడమీద నా గదిలో కిటికీకి ఒకరోజున హ్యూ తాడు వేళ్లాడదీశాడు మా తండ్రిని పిలుచుకువచ్చి ఆ తాడు చూపించాడు నేను ఎడిత్ ను లేవదీసుకుపోయి రహస్య వివాహం చేసుకోవాలని పన్నాగం పన్నాననీ, అందుకే తాడు అలా వేళ్లాడదీశాననీ, నామీద కల్పించి చెప్పాడు, కొందరు సేవకులక్కూడా లంచాలు ముట్టజెప్పి వాళ్ల చేత సాక్ష్యమిప్పించాడు నా తండ్రికి పట్టరాని కోపంవచ్చింది

తత్ఫలితంగా నేను దేశద్రిమ్మరిని కావలసివచ్చింది మా తండ్రి మూడేళ్లపాటు నన్ను ఇంగ్లండు దేశంనుంచి బహిష్కరించారు యూరప్ ఖండంలో అప్పుడు యుద్ధాలు ముమ్మరంగా జరుగుతున్నాయి వాటిల్లో ఇంగ్లడుపక్షాన చేరి పోరాడాను. ఒక యుద్ధంలో నేను శత్రువులకు ఖైదీగా చిక్కాను ఆ దేశపు కారాగారాల్లో పదేళ్లపాటు నరక జీవితం గడిపాను తరువాత జరిగిన సంధిలో ఖైదీలందరినీ విడిచిపెట్టారు. నేనుకూడా విడుదలై స్వదేశానికి వచ్చాను, నేను తెచ్చుకున్న డబ్బు ఖర్చయిపోయింది, ఇక ఏకొద్దిగానో మిగిలింది, ఈ పదేళ్లలో హెండన్ హాల్ లో ఏం జరిగిందో, మా తండ్రి మా అన్న బతికున్నారో లేదో కూడా నాకు తెలియదు ఎడిత్ ఏమైందో తెలియదు, సాధ్యమైనంత త్వరగా ఇంటికి పోవాలని మనస్సు ఉరుకులు, పరుగులు పెడుతోంది ఇదీ నాకథ"

బాలరాజు కథ సావధానంగా విన్నాడు కాసేపు మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు

"నీకు చాలా అన్యాయం జరిగింది కాని నీకు త్వరలోనే న్యాయం జరిగేట్టు చేస్తాను ఏసుక్రీస్తుసాక్షిగా, శిలువసాక్షిగా మహారాజునైన నేను వాగ్దానం చేస్తున్నాను," అన్నాడు

మైల్స్ హెండన్ కథ వినగానే బాలరాజుకు కూడా తన సొద చెప్పుకోవాలని బుద్ధిపుట్టింది తను టామ్ దుస్తుల్లోకి ఎలా వచ్చిందీ, టామ్ తన బుస్తుల్లో మహారాజుగా ఎలా చెలామణీ అవుతున్నదీ, తను ఏయే కష్టాలు పడ్డదీ, అంతా వివరంగా వర్ణించాడు హెండన్ ఈ వృత్తాంతం విని పొందిన ఆశ్చర్యం అంతా ఇంతా కాదు. బాలరాజు తనకథ ముగించగానే, హెండన్ తనలో తను ఇలా అనుకున్నాడు

"ఇతని తెలివితేటలు అద్భుతంగా వున్నాయి ఎంత చక్కని కథ అల్లాడు! నిజమా అని భ్రమింపజేసేట్టుందితనికల్పితకథ సామాన్యమైన బుర్రకాదు. పాపం, ఈ అనాథశిశు

ఎవరో ఇలా పిచ్చివాడై జాలి గొలుపుతున్నాడు నేనితన్ని విడవను. స్నేహితుడుగా, తమ్ముడుగా ఆదరిస్తాను; మనోవ్యాధిని నయం చేయిస్తాను. ఎప్పటికో ఒక రోజుకి సంపూర్ణ వ్యక్తి అవుతాడు, తనకీ, నాకూ పేరుతెస్తాడు ఇతడునావాడు, నే నతనివాణ్ణి.

బాలరాజు మళ్లీ ప్రారంభించాడు

"నన్ను అవమానం నుంచి, దెబ్బలనుంచి రక్షించావు నా ప్రాణాన్ని రక్షించటం మూలంగా ఇంగ్లండు దేశ కిరీటాన్నే రక్షించావు. నీకు కృతజ్ఞుణ్ణి. నిన్ను బహుమానించటం నావిధి నీఇష్టమొచ్చిన వరమడుగు, అనుగ్రహిస్తాను."

ఆలోచనలో మునిగి వున్న హెండర్ ఈ మాటలు విని తెప్పరిల్లాడు 'నావిధి నేను నెరవేర్చాను, నాకు బహుమాన మెందుకు,' అని చెబుదామనుకున్నాడు. ఇంతలో చక్కని ఆలోచన తట్టింది

"ఆలోచించుకో నెమ్మదిగా. ఇంత ముఖ్య విషయంమీద తొందరపడి నిర్ణయం చెయ్యబోకు. తరవాలేదు, నీకేం భయం లేదు," అన్నాడు రాజు.

హెండర్ ఆలోచించాడు:

"ఆ, అది. అది అడుగుతాను ఇదే సమయం. ఇది దాటిపోతే మళ్లీ కుదరదు గంటనుంచీ చూస్తున్నాగా, చాలా బాధగా వుంది. ఇప్పుడడక్కపోతే ఇలా ఎన్నిరోజులు బాధపడవలసి వస్తుందో అతడు వరమిస్తాననడం మంచిదే అయింది."

హెండన్ అతివినయంగా రాజు ముందు మోకరించాడు.

"ప్రభూ! నేను తమ భృత్యుణ్ణి భృత్యుడు చెయ్యవలసిన కర్తవ్యమే నేనుచేశాను, మహారాజుకు ప్రాణదానం చెయ్యగలగటం కంటె వేరే అదృష్ట మేం కావాలి నాకు? అయినా తమరు కోరుకోమన్నారు గనక ఒకచిన్న కోరిక కోరుకుంటాను.

సుమారు నాలుగువందల ఏళ్లకిందట ఇంగ్లండు రాజైన జాన్‌కు ఫ్రాన్సురాజుకూ విరోధం వచ్చిన సంగతి తమకు తెలుసు. ఈ విరోధంపరిష్కారం చెయ్యటానికి ఇద్దరు రాజులూ ఒకతేలికమార్గం కనిపెట్టారు, తమ తరఫున ద్వంద్వ యుద్ధంచేసేందుకు ఇద్దరు వీరులను నియమించారు. ఈ శౌర్యప్రదర్శనానికి సాక్షిగా స్పెయిన్‌రాజు నెన్నుకున్నారు. ప్రదర్శన స్థలంలోకి ఫ్రెంచి వీరుడు ప్రవేశించాడు. అతడదివరకే అనేక ద్వంద యుద్ధాల్లో గెలిచి ప్రఖ్యాతి పొంది వున్నాడు అతన్నిచూసి ఇంగ్లీషు వీరులంతా హడిలి వెనకంజవేశారు ఒక్కరూ సాహసించి ముందుకు రాలేక పోయారు. అందుచేత ఇంగ్లీషురాజుకు ఓటమికలిగేట్టు కనిపించింది, ఆఖరి ఉపాయంగా జాన్ రాజు లండన్ గోపురంలో ఖైదీగా మగ్గుతున్న డికోర్సీప్రభువును విడుదల చేసిపిలిపించాడు డికోర్సీ ప్రభువు ద్వంద్వయుద్ధానికి ఇష్టపడి, రంగస్థలంలోకి అడుగుపెట్టాడు; మనిషి తాడిచెట్టుఎత్తున, మర్రిచెట్టు లావున, రాక్షసిలాగా వున్నాడు. ఆయన్ని చూసీచూడగానే ఫ్రెంచి వీరుడు హడలిపోయాడు ఆయన పేరువినగానే మూర్ఛ పోయినంత పని అయింది అతనికి. ఎందుకంటే డికోర్సీ ప్రభువు బలశౌర్యాలు ప్రపంచ ప్రఖ్యాతి గలవి. చివరికి ఫ్రెంచివీరుడు కత్తిపారేసి కాలికి బుద్ధిచెప్పాడు అందుచేత జాన్ రాజు గెలిచాడు. తనని గెలిపించినందుకు కృతజ్ఞతగా డికోర్సీప్రభువును "నీఇష్టంవచ్చిన కోరిక కోరుకో" మన్నాడు డికోర్సీ తనకేమక్కర లేదనీ, తనూ, తనసంతతివాళ్లూ ఇంగ్లండు రాజుల సమక్షంలో టోపీతీసివేయ నవసరంలేకుండా అనుగ్రహించ మన్నాడు. జాన్ రాజు ఆ కోరిక మన్నించాడు. డికోర్సీప్రభువు సంతతివాళ్లు ఇప్పటికీ ఇంగ్లండు రాజుల సమక్షంలో టోపీలు తీసివేయరని తమకు తెలుసుగదా! అదే విధంగా నేను కూడా ఒక చిన్న కోరిక కోరుతున్నాను. నేను, నా సంతతివాళ్లు ఇంగ్లండు రాజులసన్నిధిలో నుంచో నవసరంలేకుండా, కూర్చోటం అపరాధం కాకుండా అనుగ్రహించాలి. ఇదే నాకోరిక"

"తే, సర్ మైల్స హెండర్! నీ కోరిక అనుగ్రహించాం. సూర్యచంద్రు లున్నంత వరకూ, భూమిమీద ఇంగ్లండు దేశం, ఇంగ్లండులో మహారాజపదవి ఉన్నంతకాలం నీ కోరికకు అంతరాయంరాదు," అని గంభీరంగా అంటూ, బాలరాజు హెండర్ ఖడ్గం తీసుకుని అతని బుజంమీద లాంఛన ప్రకారం తాకించాడు.

హెండర్సన్ లేచి కుర్చీపీట లాక్కుని ఉసురుసురుమంటూ చతికిలపడ్డాడు. బాలరాజు ఏదో ఆలోచిస్తూ గదిలో పచార్లు చెయ్యసాగాడు హెండర్సన్ అతన్ని చూస్తూ అనుకున్నాడు:

"సమయానికీ ఆలోచన తట్టింది గాని లేకపోతే చచ్చేవాణ్ణే. ఎన్ని వారాలు నుంచుని ఉండవలసి వచ్చేదో? ఈ పిచ్చివాడు నన్ను కూర్చోవద్దం టాడయ్యో నయమే. ఇకఫర్వా లేదు, దేశాలు తిరిగి తిరిగి, నాకాళ్లు అసలే పచ్చిపుళ్లుగా వున్నాయి. ఇప్పుడు నాకన్నిటి కంటే ముఖ్యంగా కావలసింది విశ్రాంతి. అన్నట్టు నన్ను సర్ మైల్స్ హెండసన్ అని పిలిచాడు నాకు 'సర్' బిరుదు కూడా తగిలించా డన్నమాట. నవ్వొస్తోంది ఇతని తరహా చూస్తే కాని నవ్వగూడదు పాపం. నాకేది నవ్వుకలిగిస్తోందో అది అతనికి పరమ సత్యం దాన్ని వెక్కిరిస్తు న్నట్టు తెలిస్తే నొచ్చుకుంటాడు. . కొంపతీసి ఇతర్లముందు కూడా నన్ను సర్ మైల్స్ అని పిలవడుగదా. నావాలకానికి, సర్ బిరుదానికి చాల మైళ్లదూరముంది. జనం ఏడిపించిపారేస్తారు. పోనీలే పిలిస్తే పిలవనీ. సర్ మైల్స్ అని పిలిస్తే అతనికి సంతోషం కలిగేటప్పుడు నేను మాత్రం ఎందుకు వద్దనాలి? అతని సంతోషమే నాకు సంతృప్తి"

16

మిత్రు లిద్దరికీ ఒక్కసారే నిద్ర ముంచుకొచ్చింది బాలరాజు మంచంమీదికి చేరాడు

"అరె. ఇతడు మళ్ళీ నామంచం ఆక్రమించాడే? నేనేం చెయ్యను, ఎక్కడ పడుకోను?" అనుకున్నాడు హెండర్సన్. హెండర్సన్ భావాలు గ్రహించాడో ఏమో, బాలరాజు బద్ధకంగా ఆవిలిస్తూ ఆజ్ఞాపించాడు "నువ్వు తలుపు మూసి దాని దగ్గరే పడుకో. జాగ్రత్తగా కాపలా కాయి" మరుక్షణంలో బాలరాజు దుప్పటి ముసుగెట్టి కష్టాలకన్నిటికీ దూరంగా నిద్రాదేవి ఒళ్లోకి పారిపోయాడు.

"ఇతడు నిజంగా రాజై పుట్టవలసిన వాడుగాని సామాన్యుడు కాడు ఎక్కడా వెలితిలేకుండా రాజుపాత్ర నటిస్తున్నాడు," అని మెచ్చుకున్నాడు హెండర్సన్. తను తలుపుకడ్డంగా కాళ్లు చాచుకుని వట్టి నేలమీదే మేను వాల్చాడు వెంటనే నిద్ర పట్టింది. అప్పటికి తెల్లవారటానికింక ఎంతో వ్యవధి లేదు. హెండసన్ ఆపడుకోవడం, పడుకోడం మధ్యాహ్నం ఒంటిగంటదాకా పడుకున్నాడు నిశ్చింతగా. తరవాత లేచి ఇంకానిద్ర పోతున్న బాలరాజు ముసుగు తొలగించాడు. దారం ముక్కలతో అతని కొలతలన్నీ తీసుకున్నాడు కొలతలన్నీ తీసుకోవటంపూర్తయ్యే క్షణంలో రాజు మేలుకున్నాడు. చలిఎక్కువగా వుందని గునిశాడు. ఏంచేస్తున్నావని అడిగాడు.

"ఏం లేదు ప్రభూ! కొంచెం బజార్లో పనివుంది, వెళ్లి వెంటనే తిరిగొస్తాను. తమరు నిద్రపొండి. ఆ గండి, బాగా కప్పుతాను, ఆ, అలా" ఈ చివరిమాటలు వినబడే లోపుగానే బాలరాజు స్వప్నప్రపంచంలో అడుగు పెట్టాడు. హెండసన్ నిశ్శబ్దంగా తలుపు తెరిచి, మూసిబయటికి వెళ్లాడు అరగంట తరవాత తిరిగివచ్చాడు బాలరాజుకు సరిపోయే కోటు, లాగు, బూట్లు మొదలైనవి కొనుక్కొచ్చాడు అవన్నీ పాతవే. అయినా అట్టే చిరగలేదు కొంచెం మాసివున్నాయి. మంచంకేసి ఒకసారి చూసి హెండసన్ కుర్చీపీట మీద కూర్చుని దుస్తులు పరిశీలించాడు

"డబ్బుంటే ఇంకా మంచివి కొందును. లేనప్పు డేం చేస్తాం, ఉన్నదాంతోనే సంతృప్తిపడాలి -

"సోకైనా పిల్లరా,-దాని
చూపు లెంత వాడిరా
కొంగు
సోకినంత సాలురా, - గుండె
సోలి సోలిపోవురా

అని హెండసన్ జానపదగీతం అందుకున్నాడు.

"పసివాడు కొంచెం కదిలినట్టున్నాడు మన బండగొంతిక కొంచెం తగ్గించాలి లేకపోతే మేలుకుంటాడు ఎంత అలిసివున్నాడో, బాగా నిద్రపోయినంతసేపు పోనివ్వాలి ముందింకా బోలెడు ప్రయాణం చెయ్యాలి కూడాను. . ఈలాగు బాగానే వుంది. రెండు చోట్ల మాత్రం కాస్త టాకీలు వెయ్యాలి కోటు ఫరవాలేదు. ఓర్. ఈ చిరుగు చూడలేదే. . బూట్లు గట్టిగానే వున్నాయి. అతని చిన్న పాదాల కివి చాలు. కాళ్లు వెచ్చగా వుంచటానికేగదా. ఇవి

చాలు, అట్టే ఫాషన్‌గా లేకపోతేనేం?

"సోకైనా పిల్లరా, - దాని
సూపు లెంత వాడిరా —"

హెండర్సన్ నెమ్మదిగా పాడుతున్నాడు. చొక్కా జేబుకు గుచ్చిన సూది, జేబులోంచి దారమూ తీశాడు సూదిలోకి దార మెక్కించటం ఒక పెద్ద సమస్య అయిపోయింది మగవాళ్లందరికున్న అలవాటే హెండర్సన్‌కూ ఉన్నది. సూది కదలకుండా గట్టిగా పట్టుకున్నాడు. దారం రెండో చేత్తో పట్టుకుని సూదిలో కెక్కించటానికి ప్రయత్నం చేశాడు. ఎన్నిసార్లు ప్రయత్నించినా గురి తప్పిపోతోంది. ఆడవాళ్లు అలా చెయ్యరు. దారం కదలకుండా పట్టుకుని సూదినే కదులుస్తూ దారం ఎక్కిస్తారు అది తేలికపద్ధతి కాని పురుషులకీ పద్ధతి వెయ్యి జన్మ లెత్తినా అలవడదు అసలు సునాయాసంగా సూదిలోకి దార మెక్కించటం వారికి శరీర శాస్త్రరీత్యా చేతకానిపని అనిపిస్తుంది

హెండర్సన్ తన ప్రయత్నంలో విజయం పొందేటప్పటికి ముచ్చెమటలుపోసి మొహం కందగడ్డలా ఎర్రబడింది చిరుగులు వెదికి కుట్టడం ప్రారంభించాడు

"సత్రవాడికి ఇచ్చెయ్యగా మిగిలేదాంతో రెండు గాడిదలు కొనాలి దాంతోనే ప్రయాణపు ఖర్చులు కూడా సరిపెట్టుకోవాలి. హెండర్సన్ హోలుకు ఇక్కణ్ణించి ఎలా లేదన్నా రెండురోజుల ప్రయాణం వుంటుంది ఇహా అక్కడి కెడితే మొయ్యలేనంత డబ్బు.

కొంగు
సోకినంత సాలురా, - గుండె
సొలిసేలి .

అబ్బా! సూది కసిక్కిన దిగింది. ఈ యుద్ధాల్లో తగిలిన గాయాల ముందు ఇదో లెక్కా, పత్రమా, జమా? హెండర్సన్ హోలులో అడుగు పెట్టామూ అంటే, ఇక మన్ని అడిగేవా డెవడూ లేడు మన ఇష్టం వచ్చినట్టు దర్జాగా ఉండచ్చు. . . ఎడిత్ ఏం చేస్తూవుంటుందో వెళ్లేటప్పటికి?...

ఏటిబడ్డు వాడలో, - నిమ్మ
తోటలోని నీడలో, - 'ఓయి
నీటుకాడ!' రమ్మని - కన్ను
గీటి నన్ను పిలిచెరా .
సోకైనా పిల్లరా

హే.. మైల్స్ హెండర్సన్‌కు కుట్టుపని చేతకాదని ఎవరనగలరు? అన్ని చిరుగులకీ టాకీలు కుట్టేశాను," అనుకుని కుట్టిన బట్టలు ఎత్తిపట్టుకుని తన నేర్పుకి తానే ఆశ్చర్యపడుతూ చూసుకున్నాడు

"చాలా బావున్నాయి బట్టలిప్పుడు ఆ తోలు గుడ్డలు విప్పి ఇవి తొడిగించానంటే పిల్లి జమీందారులా వుంటాడు నా మిత్రుడు అతని అందమైన లేతముఖానికి ఈ టోపీ మరింత అందం తెస్తుంది. ఇక లేపి, ముఖం, చేతులు కడిగించి, బట్టలు తొడగాలి ఈలోగా భోజనం తయారై వస్తుంది.

సోకైనా పిల్లరా, - దాని
సూపు లెంత వాడిరా .
అహా సోకైనా, .
ఓహో సోకైనా, . .
బల్ సోకైనా పిల్లరా, - దాని
సూపులెంత వాడిరా

అంటూ లేచి మంచందగ్గిరికి వెళ్లాడు. ముసుగు తీసి చూశాడు. బాలరాజు లేడు !! అతనిస్థానంలో పొడుగాటి తలగడ వుంది. మైల్స్ హెండర్సన్ విస్మయంతో నోరు తెరుచుకుని చూశాడు, గదిలో అన్ని మూలలూ చూశాడు, పరుపుకింద, మంచం కింద, బల్లకింద చూశాడు.

ఇంతలో నౌకరొకడు భోజన సామగ్రి తీసుకుని పైకొచ్చాడు. వాడిమీద విరుచుకుపడ్డాడు మైల్స్ హెండర్సన్.

"చెప్పు ఆకుర్రాడేమయ్యాడో. పందీ, కుక్కా, అంట్లవెధవా! నీకు కాలం మూడింది," అంటూ వాడి మెడ పట్టుకున్నాడు హెండర్సన్. "ఎక్కడికి పోయాడా కుర్రాడు?"

నౌకరు భయంతో గజగజ వణకుతూ జరిగిన సంగతంతా పూసగుచ్చినట్టు చెప్పాడు.

"మీరు బయటికి వెళ్లగానే ఒకబ్బాయి ఎవరోవచ్చి ఆ కుర్రాణ్ణి తీసుకు రమ్మన్నారని చెప్పాడు. సౌత్‌వార్కుకు పోయే దోవలో వంతెనమీద మీరు నుంచున్నారనికూడా చెప్పాడు. నేను పిల్లాణ్ణి లేపి మీరు రమ్మంటున్నారట, అని చెప్పాను అతడు 'ఇంత పొద్దున్నే లేపట మేమిటి' అని గొణుగుతూ విసుక్కున్నాడు మీరు వచ్చి 'మనవి చేసుకోవాలిగాని, ఎవడో ముక్కు మొహం ఎరగని వాడితో కబురుపంపట మేమిటి?' అనికూడా విసుక్కున్నాడు తరవాత ఆ కొత్తబ్బాయితో కలిసి వెళ్లాడు.

"ఓరి పందీ! నీ కామాత్రం బుద్ధి లేదట్రా? నేను రమ్మన్నా

నంటే ఎల్లా నమ్మావురా గాడిదా, కుక్కా! మంచంమీద చూశావా? ఎవరో పడుకున్నట్టు నమ్మించటానికి తలగడ పెట్టి ముసుగువేసివుంది. అది చూసైనా, నీకు తెలియలా మోసం జరుగుతోందని?" అంటూ మళ్లీ మెడ పట్టుకున్నాడు హెండన్

"నేను చూడలేదు బాబూ! రక్షించండి. నేనే పాప మెరగను."

"ఛీ వెధవా! ఇదంతా కుట్రగా కనిపిస్తోంది ఇదిగో, ఆ వచ్చిన కొత్తవాడితో ఇంకెవరన్నా ఉన్నారా?"

"ఒక్కడేనండి బాబూ!"

"నిజమేనా?"

"అమ్మతోడండి."

"ఆలోచించు, జ్ఞాపకం చేసుకో. నిజం చెప్పకపోతే పీకనులిమి చంపేస్తాను"

నౌకరు కొంతసేపు ఆలోచించాడు.

"ఆ కొత్తాడు వచ్చినప్పుడు ఎవరూ లేరండి కాని పిల్లవాణ్ణి వెంట పెట్టుకుని తీసుకపోతుంటే రోడ్డుమీద కెళ్లేసరికి ఎవడో తాగుబోతు వాళ్లదగ్గరి కొచ్చాడు. ఇంతలో.."

"ఏం జరిగింది? తొందరగా చెప్పు"

"రోడ్డుమీద మంద ఎక్కువై ఇంక, వాళ్ళెవరూ కనిపించలేదండి. అప్పుడే కొంప మునిగినట్టు మా యజమాని నన్ను కేకేశాడు. నేను లోపలికి పోవల్సివచ్చింది.."

"ఛీ వెధవా! అవతలకు పో. దూరంగా మళ్లీ నా కళ్ళ పడ్డావంటే నరికేస్తాను ఆగు. వాళ్లు ఏవేపు పోయారన్నావు?"

"సౌత్ వార్కువేపు పోయారండి"

"ఛీ, ఇంకా ఇక్కడే ఉన్నావ్? ఫో అవతలకి దేబె పీనుగ, యాక్కు మొహమూ, వీడూను"

నౌకరు మాయమైపోయాడు. వాడివెంటే హెండన్ కూడా మెట్లు దిగాడు ఒక్కొక్క అడుగుకి రెండేసి మెట్లు చొప్పున దిగాడు. "వాడే, ఆ తాగుబోతు ముండా కొడుకే, అతన్ని తన కొడుకని లాక్కుపోయినవాడే. ఎక్కడని వెదకను? నా చిట్టిరాజా ఎక్కడికి పోయావు? అయ్యో నిన్ను పోగొట్టుకున్నాక నేనుండి ఏం లాభం? ఛా! నిన్ను పోగొట్టుకోవటమేమిటి? భూప్రపంచంలో ఎక్కడున్నా సరే నిన్ను వెదకక మానను. బైబిల్ సాక్షిగా ప్రతిజ్ఞ చేస్తున్నాను. నువ్వు కనిపించేదాకా నేను నిద్రపోను, అన్నం తినను"

ఈలోగా హెండన్ లండన్ వంతెనమీద కొచ్చేశాడు జనాన్ని తోసుకుంటూ, నెట్టుకుంటూ దారి చేసుకునిపోతూ చుట్టూ పరీక్షిస్తున్నాడు అతని కొకటే భావం తిరిగి తిరిగి మనస్సును కలచివేస్తోంది.

"విసుక్కున్నాడట పాపం వెళ్లేముందు అయినా నేను రమ్మన్నానన నేటప్పటికి లేచి బయల్దేరాడట ఇంకోడు పిలిస్తే వెళ్లేవాడా? ఊహు వెళ్లడు నేనంటే ఎంత నమ్మకం లేకపోతే అలా కొత్తవాడితో పడిపోతాడు?"

(ఇంకా వుంది)


పెద్దమనిషి: అబ్బాయీ, పెద్దవాడవైనాక ఏం చెయ్యదలుచుకున్నావురా,

కుర్రాడు: దానాలుచేస్తాను. దానాలుచేసే వాళ్లదగ్గిర చాలా డబ్బుంటుంది.

* * * *

ఆయన: నాకునచ్చిన మనుషులు నిజంగా ఇద్దరే ఉన్నారు.

ఆవిడ. రెండో ఆయన ఎవరు?



అనగనగా ఒకరాజు

అనువాదం: గోపాల్

మా అమ్మమ్మ నాకా కథ చెప్పిన రోజు బాగా జ్ఞాపకం. ఆ రోజంతా హోరున వర్షం కురుస్తూంది వీధులన్నీ వాన నీటితో నిండిపోయాయి మావీధిలో పడవలు వెళ్లేలాగా నీరు ప్రవహిస్తోంది నేను మా వరండాలో ఒక కుర్చీమీద కూర్చుని వర్షం కేసి చూస్తున్నాను.

అప్పుడు నేను "వర్షం ఆగకుండా ఉంటే దేముడికి టెంకాయ కొడతా" అని కోరుకున్నాను ఎందుచేతనంటే రోజూ సాయంత్రం ఐదుగంటల కల్లా మా ప్రయివేటు మేష్టారువచ్చి కూర్చుంటారు వర్షం తగ్గకపోతే మేష్టారు రారుకదా అని.

అబ్బే మంత్రాలకు చింతకాయలు రాలతాయా? రంగున ఐదు గంటలు కొట్టేసరికి మా వీధిచివర నుంచి ఆ చిరిగిన గొడుగుతో ప్రత్యక్షమయ్యారు మామేష్టారు.

చచ్చేనురా దేముడా. ఇవాళ కూడా మొట్టికాయలు తప్పవేమిట అనుకొంటూ ఒక్క గంతులో మా అమ్మదగ్గిరకి పరిగెత్తేను లోపలికి.

అప్పుడు మా అమ్మా, అమ్మమ్మా వైకుంఠపాళీ ఆడుకుంటున్నారు.

"అమ్మా అమ్మా! మామేష్టారు వస్తున్నారమ్మా! నాకు తలకాయ నొప్పి చంపేస్తుంది ఇవాళ పాఠాలు చదవలేనమ్మా."

మా అమ్మ నాకు తలకాయ నొప్పిగాఉందనీ, ఇవాళ పాఠంచెప్ప నక్కరలేదనీ మేష్టారిని పంపివేసింది. ఒక్కసారేనా, మంచం మీద పడుకోపోతే బాగుండదని తలగడా క్రింద తల పెట్టుకుని అటూ ఇటూ దొర్లడం మొదలెట్టాను.

అబ్బే! నా కక్కడ తోస్తుందీ? అసలు తలకాయ నొప్పిగా ఉంటే కదూ? కొంతసేపటికి మంచం దిగి మా అమ్మమ్మ పక్కకి చేరాను. అప్పటికి పెద్ద పాముగడికి మూడు గళ్లు కుడివైపున ఉంది మాఅమ్మమ్మ. ఆట ఎంతో పసందుగా నడుస్తూంది.

"అమ్మమ్మా! అమ్మమ్మా! నాకో కథచెప్పవూ?

"బాబూ! అట్టే మారాంచేయక పోయి పడుకో" అంది

ఆట చాలా జోరుగా సాగుతూంది


నేను కదిలితేగా అక్కడనుంచి.

"ఆట అయ్యేక చెప్తుందిరా! ఏమిటా పట్టింపు?" అని కసిరింది మాఅమ్మ

నాకు కథకావాలీ ఊఁఊఁ .. అంటూ మా అమ్మమ్మ ఒడిలో కూర్చున్నాను.

"అబ్బబ్బ వీడితో వేగలేకుండా ఉన్నాను ముందర వాడికేం కావాలో చెప్పమ్మా!" అంటూ వైకుంఠపాళీ మూసేసింది మాఅమ్మ.

(43-వ పేజీ చూడండి)



కోతి బావ రుస రుస లాడుతూ బయటకి వచ్చాడు "హు దాని కెంత పొగరు? లేక పోతే మాటకుమాట ఎదురు చెపుందా? తనంతటివాడ్ని, తన లాంటి వృత్త మున్ణి, కేవలం చవట క్రింద జమ కట్టేసుందా? భార్యఅయిన తర్వాత ఎంత నిదానం, సహనం వుండాలి? భర్తని ఎంత భక్తిగా చూడాలి? అదేమీ లేకుండా "నువ్వెంత? అంటే నువ్వెంత" అని మాటకు మాట బదులు చెప్తుందా? ఛీ దీనితో యీ జన్మంలో మాట్లాడకూడదు ప్రాణం పోయినా సరే మాట్లాడ కూడదు ఆంజనేయ స్వామితోడు దీని విషయం తలుచుకోనే తలుచు కోను దీనిముఖంచూడనేమాడను"

కోతిబావ శపథం పట్టేశాడు, ఘోరమయిన, భయంకర మయిన శపదం పట్టేశాడు కోతిబావ పట్టు పట్టా డంటే ఒకటే పట్టు దానికిక తిరుగు లేదు

కోతి బావయినా శపథం పూరి కినేపట్టాడా? అతని ప్రాణం ఎంత వినగిపోతే అటువంటి ప్రతిజ్ఞ పూన్నాడు? కోతి బావ శపథానికి కోతెమ్మ ఎంత తపించి పోతుందో కదా? ఎంత కుమిలి పోతుందో పాపం అయితే కోతిబావ చలించదు అణుమాత్రమయినా చలించడు, అది తనను ఎదిరించి నందుకు నరకం అనుభవించాల్సిందే

కోతిబావ యీ ఆలోచనలతో అడవంతా తిరిగేస్తున్నాడు అతను దారీ, తెన్నూ ఆలోచించటం లేదు గబగబా వెళ్లిపోతున్నాడు


ప్చ్ ప్చ్ ప్చ్ పాపం కోతిబావ కాలు సరుక్కుమంది దాంతో మొదలంటూ కూలి పోయాడు కాని కోతిబావ చాల ధైర్య వంతుడూ, సాహసుగాను అందువల్ల వెంటనే తెప్పరిల్లు కున్నాడు జాగ్రగా లేచాడు బాధ పెడుతున్న వెనక కాలును కష్టంమీద వంచిమాశాడు పాపం ఆద్భుశ్యం మాడగానే అతని ధైర్యం అంతా సడలిపోయింది కళ్లు గిర్రు తిరగసాగాయి ఎంతో కష్టంమీద లేచి ఒక చెట్టుక్రింద కూలబడ్డాడు అసలు సంగతేమిటంటే కోతిబా సున్నిత పాదంలో అరంగుళం లోతున ఒక తుమ్మముల్లు పాతుకు పోయింది అప్పటి కప్పుడే రక్తం చిమ్మసాగింది పాపం కోతిబా పడే బాధ వర్ణించలేం కళ్లలో కొంచెం నీరు కూడా వుబికింది అయినా కోతిబావ మొగవాడు సాహసఅయిన మొగవాడు అందు వల్ల ఆ బాధనంతా ఓర్చు కున్నాడు

ఇప్పుడా తుమ్మముల్లు లాగా య్యాలి కోతిబావ యింకొకరి సహా యమును ఎప్పటికి కోరడు అటువంటి ఎచ్చిపనులు చాతకావసలు అందు చేత ఆముల్లు తనే లాగేసుకోవాలి మెల్లిగా చెయ్యి పోనిచ్చాడు

(43 వ పేజీ చూడండి)

కవికి బహుమానం

మాస్టర్ చెకొవ్



పూర్వం ఒక దేశములో ఒక రాజు వుండేవాడు ఆ రాజు గారు తన దేశములో ఈ క్రింది బోర్డు వేయించాడు

"కవులెవరైనా క్రొత్త పద్యములను రచించి వాటిని నాసమక్షాన చదివినచో, వారా పద్యాలను దేనిపై వ్రాసిరో దానికి సమానమైన బరువుగల ధనమును బహుమానముగా నొసంగెదను".

ఇది చూచి చాలమంది కవులు క్రొత్త క్రొత్త పద్యాలను చక్కని శైలిలో, ఉత్తమభావాలతో రచించి కొండంత ఆశతో రాజు వద్దకొచ్చి భావయుక్తంగా వప్పజెప్పే వాళ్లు కాని రాజుగారు చప్పరించి "అబ్బే- అవన్నీ పాతపద్యాలే, మీరు రచించినవికావు-అవి నాకుకూడా వచ్చు" అనిచెప్పి ఆపద్యాలన్నిటిని వరుసగా మాట పొల్లుపోకుండా, గుక్క త్రిప్పకుండా వప్పజెప్పేవాడు ఆ కవులు నిలువునా నీరైపోయేవారు "అంత కష్టపడి కవనముచేస్తే అవి పాత పద్యాలంట!" అని అనుకునే వారు

"మీకింకా అనుమానమైతే పట్టమహిషి నాభార్య- రాణికి కూడా వచ్చు కావాలంటే వినండి, "అని దూరముగా తెరచాటునున్న రాణి గారికి సంజ్ఞచేసేవాడు ఆమెకూడా తన శ్రావ్య కంఠంతో ఆ పద్యాలన్నిటిని వప్పజెప్పేది అది విన్న కవులకు తమపై తమకే అనుమానము వేసేది

"మీకింకా అనుమానము పోనట్లున్నది-అదుగో నా సేవకుడు కూడావప్పజెప్పగలడు అరే సేవకా! ఈ పద్యాలన్నీ పాతపద్యాలేకదూ- అవి నీకుకూడా వచ్చుగదూ" అని ఓరగా సేవకునివైపుచూచి అడిగి అవన్నీ చదవమనే వాడు చివరికి ఆ సేవకుడు కూడా వాటిని పొల్లుపోకుండా చదివేవాడు అది విన్న కవులు యింకా ఏముఖం పెట్టుకొని అవి తమ పద్యాలని చెప్పుకోగలరు? అందుకని అవమానంతో తిరిగి వెళ్ళిపోయేవారు

పాఠకులారా! మీకీ కవులపై అనుమానమున్నది కదూ అదికాదు! ఈరాజే మోసగాడు! ఇందులో పెద్ద కుతంత్రం యిమిడివుంది ఈ రాజుకు జ్ఞాపకశక్తి ఎక్కువ ఏదైనా ఒకసారి వింటే అది మళ్ళీ పొల్లుపోకుండా వప్పజెప్పగలడు రాజు గారిభార్య ఏదైనా రెండుసార్లు విన్నచో చెప్పగలదు తరువాత సేవకుడు ఏదైనా సరే మూడుసార్లు విన్నచో చెప్పగలడు ఇదీ వీరి శక్తులు వీటితో ఎందరినో కవులను అవమానించారు కాని అదిఎప్పుడు అలాగే దాగుతుందా ఏదో ఒక రోజు బయటపడదూ?

ఒక రోజు ఈ తంత్రాన్ని గ్రహించిన ఒక పెద్ద తెలివిగల మహాకవి కొన్నిపద్యాలను కష్టభూయిష్టమైనమాటలతో రచించి రాజుగారి వద్దకుపోయి తన సంగతి చెప్పాడు

"ఓహో!-పద్యాలను రచించా

వన్న మాట-సంతోషము-ఏవీ చదువుము" అని రాజుగారు తన నిండు ఠీవిలో ఎగతాళిగా అంటూ తన భార్య వైపు, సేవకుని వైపు చూచాడు.

కవి తనపద్యాలను ఏక ధాటిగా చెప్పేస్తున్నాడు. రాజు గారికి అయోమయంగా వుంది. తనకేమీ అర్థంగావటం లేదు. అసలు నోరే తిరిగే టట్టు లేవా పద్యాల్లోని మాటలు. భార్యవంక చూచాడు, సేవకునివంక చూచాడు. ఇద్దరూ తెల ముఖాలు వేసుకుని చప్పరించారు. రాజుగారి ఎత్తులన్నీ ఒక టొకటే పడిపోతున్నాయి.

కవి తన పద్యాలను చదవడం ఆపివేశాడు. పెద్ద గాలివాన కొట్టి కొట్టి ఆగిపోయినట్లు ఆస్థానమంతా ప్రశాంతంగా వుంది. రాజా గారి ముఖం చిన్నబోయింది. కత్తి వాటుకూడ రక్తం లేదు. ఇంక చేసే దేమీ లేక లేని సంతోషాన్ని తెచ్చుకొని "కవీ! ఇవిసీ సొంత పద్యాలే సందేహం లేదు. చాలా బాగా రచించావ్, ఏదీనీవు వ్రాసిన కాగితం, వాగ్దానం ప్రకారం దానికి సమాన ఎత్తుగల ధనము ఇస్తా" అన్నాడు. కవి చేతులు గట్టుకొని "మహా ప్రభూ! నేనీ పద్యాలు రచించేప్పుడు నావద్ద కాగితాలు గాని, కలముగాని లేవు-అందువల్ల-ఆ పద్యాలను ఒక రాతి బండపై చెక్కాను," అని చెప్పాడు. అది విన్న రాజుగారిఒళ్లు మండింది. కాని లాభంలేక తగ్గాడు.

"సరే - అయితే ఆ బండ తెచ్చావా" అని అడిగాడు రాజు.

"తెచ్చానండి-బరువైన బండ గనుక బండిమీద వేసుకొని తెచ్చానండి-బయట సింహద్వారం వెలుపల దించాను" అని చెప్పాడు

ఆ పెద్ద బండనుచూచిన రాజా గారి గుండెలు ఝల్లు మన్నాయి కాని లాభంలేదుగా! అట్లాగే అతి కష్టంమీద దానిని తూనిక వేయించి సమాన బరువు గల ధనాన్ని చ్చే టప్పటికి రాజా గారి కోశాగారం మొత్తం ఖాళీఅయింది.

అప్పటినుండీ ఆ రాజా మరెప్పుడూ అట్లు మోసం చేయలేదు. ★

కోతిబావ శపథం

(40-వ పేజీ తరువాయి)

ముల్లుపట్టుకుని కొంచం... .అబ్బ, బాధ, పాపం కోతి బావ తెగబాధ అనుభవిస్తున్నాడు. మరి సాహసం లేకపోయింది. ముల్లును ముట్టుకోటానికే హడిలిపోయాడు. ఇంకేం చేయటానికి తోచ లేదు. కొంత సేపయింతర్వాత నెమ్మదిగా లేచి కుంటు కుంటూ, కుంటు కుంటూ నడవసాగాడు కోతి బావ.

అలానే కొంత దూరం బాధ తోనే పోయాడు అలా పోతుంటే నక్క ఎదురయి "అరెరె, అదేమిటి బావగారూ అలా కుంటు కుంటూ నడుస్తున్నారు" అంది ఆశ్చర్యం అభినయిస్తూ. నక్కని చూడగానే కోతి బావ దుఃఖము పెల్లుబికింది.

"ఏం చెప్ప నేయ్ నక్కమరదలా! వెధవముల్లు ఒక్కటె కాలులో దిగ బడిపోయింది. చాలకుంటగా వుంది" అన్నాడు జాలిగా

"అలాగా, చుచు, ఏదీ నన్ను చూడనివ్వు. ఆ.. ఆఁ బాగా దిగ బడిపోయిందే జాగ్రత్తగా తీసెయ్యనా మరి" అన్నది నక్క.

"ఊఁ. మెల్లిగా తియ్యాలిసుమా" అని కోతిబావ అక్కడే చతికిలబడ్డాడు, నక్క ముందుకువచ్చి ముల్లు తియ్యటానికి తన శాయశక్తులా ప్రయత్నించింది. కాని ముల్లు ఎంత సేపటికీ బయటకు రాలేదు. పైపెచ్చు నక్క అదంతా కెలికి వదిలిపెట్టింది. కోతిబావ యిందాకటినుంచి ముల్లు వస్తుందేమోననే ఆశతో బాధనంతా వహించుతూ వచ్చాడు. ఎంత సేపటికీ రాక పోయేసరికి వళ్లు మండి పోయింది. కోపంతో వళ్లు కంపించ సాగింది. వెనకా ముందూ ఆలోచించకుండా చర్రునలేచి నక్క మీదపడి పీకిపీకి వదిలి పెట్టాడు. కోతిబావ కోపంచూసి నక్కవణికి పోయింది. ఎలాగో తప్పించుకుని బ్రతుకుజీవుడా అని మళ్ళీ వెనక్కి చూడకుండా ఒకటే పరుగుతీసింది.

కోతి బావ బాధ వున్న కొలదీ ఎక్కువ కా సాగింది. కళ్లనీళ్ల పర్యంతం అయింది ఏం చేయటానికీ తోచక ఆలోచిస్తుండే సమయంలో ఆ సమీపం లోనే చెరువు గట్టున నిల్చుని యిందంతా చూస్తున్న కొంగ కోతి బావ దగ్గర కొచ్చి "ఏవండోయి బావగారూ అలా దిగాలుబడి వుండి పోయారేమిటి?" అని ఆదరంగా ప్రశ్నించింది. మళ్ళీ కోతిబావ తనగోడంతా వెళ్లబోసుకున్నాడు. పాపం కొంగకు జాలేసి తను తీస్తానంది. కోతిబావ వద్దనేదేముంది? భయంతోనే సరే అన్నాడు.

కొంగ జాగ్రత్తగా తన పొడుగు పాటి ముక్కుతో ముల్లుని పట్టుకుని కసుక్కుమని లాగింది. దాంతో కోతి బావకు ప్రాణంపోయినంత పని అయింది. వచ్చిందా? అన్నాడు భయంగా.

"ఊహు. ఇం కొంచం. " అని కొంగ అంటూండగానే కోతిబావ సర్రున లేచి "చాలు చాల్లేవయ్యా. నీబొంద లాగటమూ నువ్వూను, మర్యాదగా కదులుతావా కదలవా? యిక్కడి నుంచి" అని గర్జించింది. దాంతో కొంగ గజగజలాడి అక్కడి నుంచి పలాయనం చిత్తగించింది.

పాపం ఇక్కడ కోతిబావపని చాల శోచనీయంగా వుంది. ఈ ముల్లును కోతిరప్ప యింకెవ్వరూ తియ్యలేరు అనుకున్నాడు. ఇలా అనుకుంటూంటే కోతిబావ బుర్రలో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. తన భార్యనే తియ్యమంటే! కానయితే వెంటనే తన శపంథం మాట గుర్తుకొచ్చి తడబడ బడ్డాడు. ఒక మూల బాధ ఎక్కువయిపోతుంటే యిక శపథాలు, గిపథాలు లాభం లేదనుకున్నాడు. వెంటనే వెనక్కి తిరిగి కుంటుతూనే వేగంగా పరిగెత్తసాగాడు. ఆపరిగెత్తటంలో తన బాధనుకూడ మరిచిపోయాడు. పాపం కోతెమ్మ తనకోసం ఎదురు చూస్తూకూర్చుంటుందనుకున్నాడు.

తీరాకోతి బావయింటికి పోయేసరికి కోతి బావ అనుకున్నట్లు కుమిలి పోవటమూ లేదు. ఎదురు చూడటమూ లేదు. హాయిగా పడుకుని కూనిరాగాలు తీసుకుంటూ వుంది కోతెమ్మ. అలా వుండటం కోతిబావకు బాధకలిగించినా ముల్లు గుచ్చుకున్న బాధ ముందు అదో లెక్కలోకి రాలేదు. కోతి బావ రావటంచూసి రాకేం చేస్తావులే అన్నట్లు నిర్లక్ష్యంగా ఒకచూపు విసిరి బద్ధకంగా వళ్లు విరుచుకుంది కోతెమ్మ.

కోతిబావ తన శపథాన్ని మరిచిపోయి గబగబ వెళ్లి కోతెమ్మతో తనగోడంతా మొరబెట్టుకుని ముల్లు తీసేయమని బ్రతిమిలాడాడు అతని పరిస్థితి చూసి కోతెమ్మ గుండె నీరయిపోయి ముల్లు గుచ్చుకున్న కాలు చూపించమంది. కోతి బావ జాగర్తగా చూపించాడు చూస్తే ఏముంది? ముల్లూ లేదు. గిల్లూ లేదు. కొంగ చాలభాగం లాగేయటంవల్ల పరిగెత్తు కొచ్చేటప్పుడు అది ఎక్కడో జారిపోయింది. కోతిబావ మాత్రం తన శపథం పాడయిపోయినందుకు చాలా విచారించాడు.

★

అనగనగా ఒకరాజు

(39-వ పేజీ తరువాయి)

నే నప్పుడు సంతోషంతో మా అమ్మమ్మ బుజాలు పట్టుకుని గంతు లెయ్యడం మొదలెట్టాను.

"అమ్మమ్మా ఇప్పుడు మొదలెట్టవే కథ అన్నాను.

"ఆ రాజుకి చక్కటి కూతురుంది."-మాఅమ్మమ్మ కథ చెప్పడం మొదలుపెట్టింది.

ఆ రాజుకి కొడుకు లెవ్వరూ పుట్టలేదు. అందుకని కొడుకుల కోసం తపస్సు చెయ్యడానికి అడవికి వెళ్ళిపోయాడు. (ఆ రాజు అడవికి వెళ్ళిపోయాడంటే నాకేమీ ఆశ్చర్యం కలగలేదు. ఎందుచేతనంటే ఒకరోజుని నేనుకూడా అడవికి వెళ్ళి తపస్సు చేసినట్లు కల వచ్చింది. ఎందుకో తెలుసా? మా ప్రయివేటు మాష్టారు రాకుండా చేయమని భగవంతుణ్ణి కోరుకోడానికి!)

ఆ రాజు అడవిలో తపస్సు చేయడం మొదలు పెట్టాడు. ఆ విధంగా పన్నెండు సంవత్సరాలు గడచిపోయాయి. రాజుమాత్రం తన రాజ్యానికి తిరిగిరాలేదు. రాజు కూతురు పెరిగి పెద్దదై ఎంతో అందంగా ఉంది. ఆమెకి పెండ్లీడు కూడా దాటిపోతూంది.

ఇంక రాజుభార్యకి ఏమీ తోచలేదు. "తన పిల్లకి ఇంక పెండ్లి విషయమే మరచిపోయాడా రాజు" అని తక్షణం మంత్రులను పంపించి," ఒకే ఒకరాత్రి ఉండి వెళ్ళిపోవచ్చును. ఒక్కసారి రావలసింది రాజ్యానికి," అని రాజుకి కబురు చేసింది. రాజు సరేనని రాజధానికి వచ్చాడు.

ఆనాడు రాణి తనంతటతానే మడికట్టుకుని పంచభక్ష్య పరమాన్నాలూ చేసింది. అవి కాక రకరకాల మిఠాయిలూ, గులాబీజామ్‌లూ, రసగుల్లాలూ తయారు చేసింది. అంతా సిద్ధం అయ్యాక చక్కటి మంచిగంధపు చెక్కలతో తయారైన బంగారు కోళ్ళ పీట వేసింది. బంగరు పళ్ళేరాలూ, వెండి కప్పులూ ధగధగా మెరసిపోతున్నాయి. వాటినిండా పిండివంటలూ పరమాన్నాలూ వడ్డించింది.

ఆనాడు వజ్రాలూ, కెంపులూ పచ్చలూ నీలాలూ అలంకరించుకుని రాజకుమార్తె ధగధగా మెరిసిపోతూంది. వజ్రపుటుంగరాలతో మెరిసిపోతున్న తన సన్నటి వేళ్ళతో, నెమిలి పింఛం విసనకర్రతో రాజుప్రక్కగా నిలుచుని విసురుతుంది రాజకుమార్తె. అన్ని పదార్థాలు ఉన్నా రాజుకి ఏమీతినాలని లేదు. ఆమె అందానికి మురిసిపోతూ ఆమెకేసే చూస్తూ ఉండిపోయాడు. ఆఖరికి—"మహారాణీ! ఈ బంగారువిగ్రహంలా ధగధగా మెరిసిపోయే జగన్మోహిని ఎవరు?" అని అడిగాడు.

రాణి ఆశ్చర్యపోతూ "మహారాజా! మీకూతురునే మరచిపోయారా? అని అడిగింది.

రాజు నిశ్చేష్టుడైపోయాడు. కొంతసేపటి వరకూ అతని నోట మాటరాలేదు.

ఆఖరికి "నాచిన్నకూతురు ఎంత మారిపోయిందీ!" అన్నాడు.

రాణి నిట్టూర్పుతో "అయ్యో భగవంతుడా! మహారాజుని ఇంత అజ్ఞానంలో ముంచేశావా అనుకుని "మీరు మమ్మల్నందరినీ విడచి పన్నెండు సంవత్సరాలు దాటిందని మీకు జ్ఞాపకంలేదూ ప్రభూ"అంది.

"మరి వివాహం ఇంకా ఎందుకు చేయలేదు?" అని అడిగాడు రాజు.

"మీరు రాజ్యంలో లేకుండా అమ్మాయికి తగిన వరుణ్ణి నే నెట్లా చూస్తాను?" అంది రాణి.

ఈమాట వినగానే రాజు ముఖం చిట్లించుకుని "సరేలే, అయిందేదో అయిపోయింది-ఇంక ఆలస్యం చేయడానికి వీలులేదు! రేపు నేను ఉదయం కోటలోనుంచి బయటకు వెళ్ళేసమయంలో ఎవరు ముందర నాకు ఎదురవుతారో వారికిచ్చి ఈ పిల్లని పెండ్లిచేస్తాను" అని ప్రతిజ్ఞ చేశాడు:

* * *

మర్నాడు తెల్లవారింది.

రాజు కోటనుంచి బయలుదేరే సమయానికి అడవిలో కట్టెలు పోగుచేసుకుని ఇంటివస్తున్న ఎనిమిదేండ్ల బ్రాహ్మణ పిల్లాడు రాజుకి కనిపించాడు.

"నా కూతుర్ని ఈ పిల్లడికిచ్చి పెండ్లిచేస్తాను" అన్నాడు రాజు.

ఇంక మహారాజు తలుచుకుంటే అడ్డుపెట్టేదెవరు? తక్షణం పురోహితుణ్ణి పిలిపించి, ముహూర్తం పెట్టించారు. వివాహం చాలా వైభవంగా జరిగింది.

"తరువాత ఏం జరిగిందేమిటి అమ్మమ్మా?" అంటూ ఇంకా కొంచెం దగ్గిరగా జరిగాను. ఇంకా వర్షం తగ్గలేదు. మా అమ్మమ్మ దుప్పటీలోకి దూరి వెచ్చగా ముడుచుకొనికూర్చున్నాను. మాఅమ్మమ్మముందగ్గర నూనెదీపం మినుకు మినుకున వెలుగుతూంది.—నే నప్పుడు అడవిలో కట్టెలేరుకునే బ్రాహ్మణ పిల్లాడినని అయిపోయానుట. నన్నేమో రాజుగారి అద్దాలమేడలోకి తీసికెళ్లారుట. చెలికత్తెలూ, దాసీజనం ఒకరేమిటి, ఎంతమందో నాచుట్టూ ఉన్నారుట. అప్పుడు నాకు మంచి గంధంపొడీ, ఇంకా ఘుమఘుమలాడే పరిమళద్రవ్యాలతో నాకు నలుగుపెట్టి పన్నీటితో స్నానం చేయించారుట. ఆ తరువాత జరీఅంచులతో ధగధగా మెరిసిపోయే పట్టుతాపితాలు కట్టుకున్నానుట. అంతటిలోకీ తెల్లటి మల్లెపూవులాంటి మిలమిల మెరిసిపోయే చీరకట్టుకుని కెంపులూ, వజ్రాలూ ధగధగ లాడుతూ రాజకుమార్తె వచ్చిందట. నాకేసి చూచి చిరునవ్వు నవ్విందట తరువాత ఒకరిమెళ్ళో ఒకళ్లు దండలు వేసుకున్నాముట.— ఇంతట్లోకీ "నిద్దరొస్తూందేమిట్రా! ఊకొట్టడం మానేశావ్" అంది అమ్మమ్మ.

"తరువాత ఏమైంది" అన్నాను.

"తరువాత రాజకుమార్తె తన ఎనిదేళ్ళ భర్తని తీసికొని వేరే ఏడంతస్థుల మేడలో మకాంపెట్టింది

"ఆ తరువాత?"

ఆ చిన్నపిల్లాడు బడిలోచేరి పాఠాలు చదవడం మొదలు పెట్టాడు ఆ విధంగా కొంతకాలం గడచింది. బడిలో పిల్లలు "మీ ఏడంతస్థుల మేడలోఉన్న అందాల పిల్ల ఎవరూ?" అని అడగడం మొదలెట్టారు.

నిజంగా ఆ పిల్ల ఎవరో ఆ పిల్లాడికే జ్ఞాపకంలేదు. కాని ఎప్పుడో ఒకనాడు తను కట్టెలు పట్టుకుని ఊళ్ళోకి వస్తూండగా తనని ఎవరో పట్టుకుని కోటలోకి తీసి కెళ్ళి ఏదో హడావిడి చేసినట్లు మాత్రం ఆ కుర్రాడికి కొంచెం జ్ఞాపకం ఉంది. నిజానికి ఏంజరిగిందో తెలియనే తెలియదు.

ఈ విధంగా నాలుగైదు సంవత్సరాలు గడచిపోయినై. ఆ బడిలో చదివేపిల్లలు "ఆమేడలో అమ్మాయి

ఎవరు?" అని అడగడం మొదలెట్టారు. పాపం బడిలోనుంచి ఇంటికి వచ్చి— "మా స్నేహితులందరూ మీ మేడలో ఉన్న పిల్ల ఎవరూ అంటూ అడుగుతున్నారు. నీ వెవరవో నాకు చెప్పవూ?" అని అడిగాడు.

"రేపు చెప్తానులే" అని రాజకుమార్తె చెప్తూండేది. ఆ విధంగా ఇంకో నాలుగైదు సంవత్సరాలు గడచినాయి. ఆఖరికి ఆ కుర్రాడికి పట్టలేనంత కోపం వచ్చింది. "నాకివాళ ఈ ప్రశ్నకి సమాధానం చెప్పకపోతే ఈ మేడ వదిలిపెట్టి వెళ్ళిపోతాను" అన్నాడు.

"రేపు తప్పకుండా చెప్తాను. ఎంత ఒట్టుపడితే అంతఒట్టు" అన్నది రాజకుమార్తె. సరే కదా అని ఆరోజుకి మాట్లాడక ఊరుకున్నాడు.

మర్నాడు ఇంటికి రాగానే "నువ్వెవరవో ఇప్పుడు చెప్పు" అన్నాడు.

"రాత్రి భోజనాలయ్యాక పడుకోబోయేటప్పుడు చెప్తాను" అంది రాజకుమార్తె.

సరేఅని ఒప్పుకున్నాడు—రాత్రి ఎప్పుడు పడుతుందా ఎప్పుడు భోజనాలు చేస్తామా అని గంటలు లెక్కపెడుతూ గడిపాడు ఆనాడు.— ఈలోగా రాజకుమార్తె పందిరిపట్టి మంచంమీద పట్టుపరుపులూ, తెల్లటి మల్లెపూలలాంటి దుప్పట్లూ పరిచింది. రకరకాల సెంట్లూ, అగరువత్తులతోనూ గది ఘుమఘుమలాడిపోతోంది లడ్డూలూ, గులాబ్ జామ్‌లూ, పాయసం, పాలూ, ద్రాక్షపండ్లూ, పంచదార చిలకలూ ఎన్నో రకరకాలమిఠాయిలు గదిలో అమర్చింది.

చక్కగా పన్నీటిలో స్నానం చేసి, ఘుమఘుమలాడే సెంటుపూసుకుని ధగధగలాడే నీలిరంగు చీర కట్టుకుంది. ఇంక కొద్దిసేపట్లో ఆపిల్ల ఎవరో తను తెలుసుకోవచ్చు కదా అనే సంతోషంలో ఆ కుర్రాడికి అన్ని పిండివంటలలోను ఏమీ సయించనేలేదు. తనభర్త తిని విడిచిపెట్టిన పదార్థాలు తిని చక్కగా దొండపండులా పండేలాగు తాంబూలం వేసుకుని ఘుమఘుమలాడుతూ అతను పండుకున్న పందిరిగుంచందగ్గరికి వెళ్లిందామె. చక్కటి బంగరు చెంబునిండా మంచినీళ్ళు పోసి పళ్ళెంలో పెట్టింది.

ఆనాడే తను ఎవరో ఆ పందిరి మంచంమీద పూలపాన్పులో పండుకున్న మొగుడితో చెప్పాలి— ఆ పళ్ళెం, చెంబు మంచం ప్రక్క పెట్టబోతూంది.

ఇంతలో ఆ పూలపాన్పులోనుంచి మినమినలాడుతూ ఒక గోధుమ వన్నె త్రాచు చరచరా ప్రాక వెళ్ళిపోయింది.

రాజకుమార్తె నిశ్చేష్టురాలైపోయింది. చేతిలో ఉన్న పళ్ళెం చెంబూ చేతిలోనుంచి జారి క్రింద పడిపోయాయి. ఒక్క పరుగులో మంచంమీద నల్లటి పెదిమెలతో, కదలిక లేకుండా పడి ఉన్న తన భర్తని కౌగలించుకుని అలాగే ఉండిపోయింది."

హఠాత్తుగా నా గుండెలు వేగంగా కొట్టుకోడం ప్రారంభించాయి. కంఠం బొంగురుపోయింది. కళ్ళల్లో నించి జలజలా నీళ్లు రాలుతున్నాయి.

"ఆ...తరువాత......?"

ఆ తరువాత ఏమైందో మా అమ్మమ్మకే తెలియదు. బహుశా మా అమ్మమ్మ అమ్మమ్మకికూడా ఆ విషయం తెలియదేమో? రాజకుమార్తె భర్త చనిపోయాడు. చనిపోయింతరవాత ఏం జరుగుతుంది? ఏమో ఎవరికి తెలుసు? ఇంతవరకూ ఎవరూ కనిపెట్టలేకపోయారు, మనిషి చనిపోయింతరవాత ఏం జరుగుతుందో.

"ఛా! నాకిల్లాంటి కథలు అక్కరలేదు" అంటూ మా అమ్మమ్మ దుప్పటీ విదిలించుకుని మా అమ్మ దగ్గరికి వెళ్ళిపోయాను. ★

డైరీ

(4-వ పేజీ తరువాయి)

—శ్రీ జె. బి. కృపలానీ గారి కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ, లేక క్లుప్తంగా, ప్రజాపార్టీ సర్వసభ్య సమావేశం పాట్నాలో జరిగింది కృపలానీగారు పార్టీ ఆశయాలను అధ్యక్షోపన్యాసంలో వివరించారు

—సేలం జిల్లాలో అల్యూమినియం ఉత్పత్తి నిమిత్తం బాక్సైట్ తియ్యడానికి రెండేళ్ళలో రు 21 కోట్లు ఖర్చుతో పరిశ్రమ స్థాపింపచెయ్యడానికి మద్రాసు మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది.

—350 మంది చేనేత సత్యాగ్రహులు చెన్నపట్నంలో అరెస్టయినారు ★

కౌంట్ ఆఫ్ మాంట్‌క్రిస్టో

(6-వ పేజీ తరువాయి)

"అతనికి జన్మలో మరిచిపోలేని సహాయాన్ని మీరు చేశారుకదా! మీరు పెపినో ప్రాణాల్ని రక్షించారు!"

"ఓహో! ఆమాట మీ కెవరు చెప్పారు?"

"అదెందుకులెండి అది నాకు తెలుసును"

మాంట్ క్రిస్టో నుదుట ముడతలు బిగిశాయి. కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు తరవాత ఇలా అన్నాడు "నేను లూగీ గాంపావద్దకు వెడితే మీరు కూడా వస్తారా?"

"మీకు అభ్యంతరం లేకపోతే తప్పకుండా వస్తాను"

"సరే అయితే ఈ రాత్రి బాగుంది కూడా రోమునగరాని వతల కొంత మేర నడవడం ఒంటికి మంచిది"

"నాతో కూడా ఆయుధాలేవైనా తీసుకురావాలా? ధనం కూడా తీసుకురానా?"

"నాటివల్ల ప్రయోజనం ఉండదు మీకు ఉత్తరం తెచ్చిన మని షెక్కడ?"

"వీధిలో ఉన్నాడు జవాబుకోసం కనిపెట్టుకుని ఉన్నాడు"

"అసలు మనం ఎక్కడికి వెళ్లాలో ముందుగా తెలుసుకోవాలి అతన్నిక్కడికి పిలుస్తాను"

మాంట్ క్రిస్టో కిటికీవద్దకు వెళ్లాడు. వీధిలోకి చూసి, ఒక వింత తరహాలో ఈల వేశాడు నిలువెల్లా ఆచ్ఛాదనం కప్పుకున్న వార్తాహరుడు చాటు నుంచి వచ్చి వీధిలో నిలిచాడు. తన పరిచారకుని పిలిచే ధోరణిలో మాంట్ క్రిస్టో కేక వేశాడు వెంటనే ఆవ్యక్తి రాస్పోలీభవనం ప్రవేశించి మెట్లెక్కి వచ్చి మాంట్ క్రిస్టోముందు నిలిచాడు.

"ఓ! నువ్వా పెపినో!" అన్నాడు మాంట్ క్రిస్టో. జవాబు చెప్పడానికి బదులు పెపినో మోకాళ్లపై కూర్చొబడి మాంట్ క్రిస్టో చెయ్యి అందుకుని ముద్దులు కురిపించాడు

"ఓహో! అయితే నీ ప్రాణాలు నేను రక్షించిన సంగతింకా నువ్వు మరిచిపోలేదన్నమాట చిత్రంగానే ఉంది. అది జరిగి వారంరోజు లయిపోయింది"

"లేదండి. నే నెన్నడూ మరిచిపోలేనండి" అన్నాడు పెపినో, కృతజ్ఞతాభావంతో అతనికంఠస్వరం ఆర్ద్రమయింది

"ఎన్నడూ! అబ్బో! అంటే చాలాకాల మన్నమాట! కాని అది నీ నమ్మకం మాత్రమే సుమా. సరే లే"

పెపినో లేచి నిలబడ్డాడు. సంకోచంతో ఫ్రాంజ్ వంక చూశాడు

మాంట్ క్రిస్టో అన్నాడు: "ఫరవాలేదు ఆయనముందు నువ్వు మాట్లాడవచ్చు. ఆయన నా మిత్రులలో ఒకడు"

"అయితే మీ రేది అడిగినా చెప్పగలను."

"ఆల్బర్ట్ మీ చేతిలో ఎలా చిక్కుకున్నాడు?"

"థెరిసా తిరిగిన బండి, వారి బగ్గీ, ఉత్సవాలలో చాలసార్లు కిటస్థ పడిశాయండి?"

"థరిసా అంటే? మీ నాయకుని భార్య?"

"అవునండి ఫ్రెంచి దేశస్థుడు ఆమె పైన పువ్వుల గుత్తి విసిరాడు థరిసా ఒక పువ్వులగుత్తి విసిరింది—మా నాయకుని అనుమతితోనే ఆమె అలా విసిరింది ఇద్దరూ ఆ బండిలో ఉన్నారు మా నాయకుడే మారువేషంలో బండి తోలాడు"

"తరవాత?"

"తరవాత ఫ్రెంచియువకుడు బురఖా తీసేశాడు. నాయకుని అనుమతితో థెరిసా కూడా బురఖా తీసేసింది. ఆమెను ఏకాంతంగా కలుసుకోవాలని ఫ్రెంచియువకుడు ఆమెను ప్రార్థించాడు. థెరిసా అంగీకరించింది కాని గియాకోమో చర్చివద్ద అతన్ని కలుసుకున్నది థరిసాకాదు, బెప్పో"

"బెప్పో ఎవరు?"

"పదిహేనేళ్ళ బాలుడు ఇలా అనేకమందిని వాడు పట్టించాడు."

"బెప్పో అతన్ని నగరం దాటించి తీసుకువెళ్లాడా?" అని అడిగాడు మాంట్ క్రిస్టో

"అవునండి అక్కడొక బండి సిద్ధంగా ఉంది బెప్పో ముందు అందులో ఎక్కాడు ఫ్రెంచియువకుణ్ని ఆహ్వానించాడు మారుమాట చెప్పకుండా అతనుకూడా బండెక్కి బెప్పో ప్రక్కనే కూర్చున్నాడు రోమ్ నగరానికి మూడు మైళ్లలో ఉన్న ఒక భవనానికి వెళ్లాలని బెప్పో చెప్పాడు మూడుమైళ్ళు కాదు, ఎక్కడికి రమ్మన్నా వస్తా నన్నాడు ఫ్రెంచి యువకుడు బండి రెండువందల గజాలు సాగిందో లేదో, అంతలోనే ఫ్రెంచి యువకుడు బెప్పోని ఆలింగనం చేసుకున్నాడు. వెంటనే బెప్పో రెండు పిస్తోళ్ళు తీసి కణతలపైన గురిపెట్టాడు. బండివాడు బండి నాపి దిగివచ్చి పిస్తోలు చూపించాడు సమీపంలో దాగిఉన్న నలుగురు మా మిత్రులుకూడా వచ్చారు ఫ్రెంచి యువకుడు తప్పించుకోడానికి ప్రయత్నించాడు బెప్పోని కంఠం నొక్కి చంపడానికి కూడా ప్రయత్నించాడు కాని అయిదుగురుండడంచేత లొంగక తప్పిందికాదు బండిలోనుంచి అతన్ని బైటికి లాగి నది ఒడ్డువెంట నడిపించుకు వెళ్లారు సెంట్ సెబాస్టిన్ భూగర్భాంతర శ్మశాన వాటికలలో లూగీ, థరిసాలవద్దకు అతన్ని తీసుకువెళ్లారు"

మాంట్ క్రిస్టో ఫ్రాంజ్ వంక తిరిగి "ఏమంటారు? ఇది నమ్మదగినట్లుగానే ఉంది మీ అభిప్రాయం ఏమిటి?"

"ఆల్బర్ట్‌కి కాక మరొకరి కీవిధంగా జరిగితే నవ్వలేక చచ్చిపోయేవాడినే"

"నే నిక్కడ లేకపోతే ఈ వ్యవహారంలో ఆల్బర్ట్‌కి చిలుము బాగా వొదిలేది కూడా ఇప్పుడింకేం ఫరవాలేదు"

"అయితే మనం వెళ్లి అతన్ని తీసుకువద్దామా?"

"తప్పకుండా. అతను చిత్రమైన పరిసరాల్లో ఉన్నాడిప్పుడు. సెంట్ సెబాస్టిన్ శ్మశానవాటికల్ని మీ రెప్పుడైనా చూశారా?"

"ఎన్నడూ అక్కడికి వెళ్లలేదు. వెళ్లాలని చాలసార్లు అనుకున్నాను"

"ఇప్పుడు అవకాశం దొరికింది కాబట్టి వెడదాం. రండి. మీ కిచ్చిన బగ్గీ ఉందా?"

"లేదండి పంపేశాను"

"ఫరవాలేదు నా కొక బగ్గీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది"

"ఎప్పుడూనా?"

"ఎప్పుడూ ఉంటుంది. నాది చాలా చంచల ప్రకృతి. ఒకొక్కప్పుడు చీకటితోనే, మరొకప్పుడు అర్ధరాత్రివేళ బయలుదేరి వెళ్లాలని కోరిక పుడుతుంది కోరిక పుట్టగానే బయలుదేరి వెళ్లిపోతాను"

మాంట్ క్రిస్టో చేగంట మోగించాడు. పరిచారకుడొకడు

వచ్చాడు "బగ్గీ సిద్ధం చేయించు రెండు పిస్తోళ్ళు అక్కర్లేదు ఆలీ బగ్గీ నడుపుతాడు."

త్వరలోనే బగ్గీ వచ్చింది మాంటే క్రిస్టో జేబుగడియారం తీసి చూశాడు "పన్నెండున్నరయింది" అన్నాడు. "మనం అయిదింటికి బయలుదేరివెళ్లవచ్చు కాని నీ మిత్రుడు ఆందోళనపడతాడు అందువల్ల మనం వెంటనే బయలుదేరి వెళ్లడం మంచిది రండి!"

అందరూ మేడ దిగి వెళ్లారు మాంటే క్రిస్టో, ఫ్రాంజ్ బగ్గీ లోపల కూర్చున్నారు. పెపినో ఆలీ ప్రక్క కూర్చున్నాడు బగ్గీ అతివేగంగా పరుగెత్తనారంభించింది నగరప్రాకారంవద్ద ద్వారపాలకులు బగ్గీ నాపారు. ఆ సమయంలో నగరం విడిచి వెళ్లడానికి వీలులేదని నిరోధించారు పగలుకాని రాత్రికాని ఏసమయంలోనైనా సరే రాకపోకలను అనుమతిస్తూ రోమ్ గవర్నర్ ఇచ్చిన అధికారపత్రాన్ని మాంటే క్రిస్టో చూపడంతో ద్వారపాలకులు దారి ఇచ్చారు ద్వారపాలకులకు ఒక బంగారునాణెం లభించింది బగ్గీ మళ్ళీ బయలుదేరింది. చంద్రుడుదయించి గంటన్నరపైన కావచ్చింది. ఆ వెన్నెలలో ఆ పురాతన రాజమార్గం అస్పష్టంగా కనపడుతోంది. అక్కడక్కడ గస్తీలు ముందుకు వచ్చినట్లూ, పెపినో సంజ్ఞ లందుకుని తిరిగి నీడల్లో మాయమైపోతున్నట్లూ ఫ్రాంజ్ కనిపెట్టాడు కొంతదూరం వెళ్లినతరవాత బగ్గీ ఆగింది. పెపినో దిగివచ్చి తలుపు తెరిచాడు. మాంటే క్రిస్టో, ఫ్రాంజ్ అక్కడ దిగారు.

"మనం పది నిమిషాల్లో అక్కడికి చేరుకుంటాం" అన్నాడు మాంటే క్రిస్టో పెపినోని పక్కగా పిలిచి రహస్యంగా ఏదో ఆజ్ఞ ఇచ్చాడు పెపినో బగ్గీలో ఉన్న కాగడా ఒక టందుకుని వెళ్లిపోయాడు అతను గుట్టలమధ్య సన్నని దారొకటి అనుసరించి నడవడం, ఒకచోట ఒక గుట్ట వెనుక అంతర్ధానం కావడం ఫ్రాంజ్ చూశాడు తరవాత మాంటే క్రిస్టో, ఫ్రాంజ్ లు ఆదారినే నడవసాగారు. నూరడుగులలో ఒక చిన్న లోయ కనపడింది అక్కడ నీడలో ఇద్దరు వ్యక్తులు మాట్లాడ్డం చూశారు ఇద్దరిలో ఒకడు పెపినో, మరొకడు దారికాసే దొంగ పెపినో తిరిగివచ్చి ఇలా అన్నాడు "నావెంట రండి ఇక్కడే శ్మశానవాటికల గుహాలున్నాయి"

ఒకచోట ఒక పెద్ద గుబ్బుచాటున ద్వారంవంటిది కనపడింది. అక్కడ రాళ్లు గుట్టలు గుట్టలుగా ఉన్నాయి ఆద్వారంలో ఒక్క మనిషి దాటడానికి మాత్రం ఎడముంది దానికి కిందుగా కొద్ది అడుగులలోతుకు దూకాలి ముందు పెపినో దూకాడు కొద్దిదూరం నడవగానే మార్గం కొంచెం విశాలమయింది అక్కడాగి పెపినో చేతి కాగడా వెలిగించాడు అది పట్టుకుని వెనక్కి తిరిగి దారి చూపించాడు ముందు మాంటే క్రిస్టో, తరవాత ఫ్రాంజ్ దిగివచ్చారు కొంతదూరం నడిచాక "ఎవరక్కడ?" అని కేక వినపడింది. కాగడా వెలుగులో తుపాకి ఒకటి ఫ్రాంజ్ కి కనపడింది

"మిత్రులే" అన్నాడు పెపినో.

పహరావాని వెనుకనే సొరంగాలలోకి దిగువగా మెట్లున్నాయి ముగ్గురూ మెట్లు దిగి ఒక ఆవరణ ప్రవేశించారు అక్కడొక సమాధి కనపడింది అక్కడే అయిదు మోటుమార్గాల కూడలి కూడా ఉంది ప్రక్కనే గోడలలోకి త్రవ్వబడినట్లు సమాధులనేకం కనపడ్డాయి ఇవే కాబోలు సెంట్ సెబాస్టిన్ భూగర్భాంతర శ్మశానవాటిక లనుకున్నాడు ఫ్రాంజ్ అక్కడక్కడ కొన్ని నెరదలలోనుంచి దీపాలవెలుగులు కనపడుతున్నాయి.

మాంటే క్రిస్టో ఫ్రాంజ్ భుజంపైన తట్టాడు. "దొంగలగుంపు విశ్రాంతి తీసుకుంటున్నప్పుడెలా ఉంటారో చూడాలని ఉందా?"

"తప్పకుండా. చూడవలసిందే."

"అయితే నాకూడా రండి పెపినో, కాగడా ఆర్పెయ్యి"

పెపినో కాగడా ఆర్పివేశాడు. ఏభైఅడుగుల దూరంలో గోడలపైన వెలుగునీడలు కదలాడుతున్నాయి ముగ్గురూ నిశ్శబ్దంగా నడిచారు. మాంటే క్రిస్టో చీకటిలోకూడా చూడగలుగుతున్నట్లు సులువుగా నడుస్తున్నాడు. ఫ్రాంజ్ అతన్ని జాగ్రత్తగా అనుసరిస్తున్నాడు. మరొక పెద్దద్వారం దాటినారు విశాలమైన మరొక ఆవరణలోకి ప్రవేశించారు ఆవరణంతా సమాధులతో నిండిఉంది మధ్యలో నాలుగు పెద్ద అరుగులున్నాయి ఒక అరుగుపైన ఎత్తు మిట్ట ఒకటుంది. దానిపైన సిలువ ఉంది. ప్రక్కనేఉన్న పెద్ద కాగడావెలుగులో ఒక వ్యక్తి కూర్చుని ఒక గ్రంథం పఠిస్తున్నాడు. ఆగంతుకు లిద్దరూ నీడలో నిలబడి ఆ దృశ్యాన్ని పరికించారు. గ్రంథం పఠిస్తున్నవాడే నాయకుడు లూగీ వాంపా. అతనిచుట్టూ కొద్ది కొద్ది దూరంలో రాతి అరుగులపైన దాదాపు ఇరవైమంది దొంగలు తుపాకులు ప్రక్కను పెట్టుకుని కూర్చున్నారు అరుగులకు దిగువగా కొద్దిదూరంలో ఒక ద్వారంవద్ద ఒక పహరావాడు చేత తుపాకి పట్టుకుని అటూ ఇటూ పచారుచేస్తున్నాడు. ఈ దృశ్యాన్ని కొంతసేపు పరికించిన తరవాత, మాంటే క్రిస్టో చప్పుడు కాకుండా మూడు మెట్లెక్కి అరుగుపై కూర్చున్న వాంపాను సమీపించాడు గ్రంథపఠనంలో నిమగ్నుడై ఉన్న వాంపా ఇది గమనించలేదు కాని ద్వారంవద్ద పహరావాడు చూశాడు "ఎవరక్కడ?" అని కేక వేశాడు. వెంటనే వాంపా ఒక్క ఉదుటున లేచి మొలలో వేలాడుతున్న పిస్తోలు తీశాడు క్షణంలో దొంగలందరూ లేచి వచ్చారు మాంటే క్రిస్టో పైన ఇరవై తుపాకులు గురిపెట్టబడినాయి.

"వాంపా! నీ మిత్రుల్ని చాలా సంరంభంతో ఆహ్వానిస్తావు సుమా!" అన్నాడు మాంటే క్రిస్టో.

"తుపాకులు దించండి" అని కేక వేశాడు వాంపా ఒక చేతితో గౌరవసూచకంగా టోపీ తీసి పట్టుకున్నాడు. "క్షమించండి తమ దర్శనం లభిస్తుందనుకోలేదు నేను. అందువల్ల మిమ్మల్ని వెంటనే గుర్తుపట్టలేకపోయాను."

"అంతేకాదు నీ జ్ఞాపకశక్తి అన్నింటా మందగించినట్లుంది. నీకు మనుష్యుల ముఖాలు గుర్తులేకపోవడమేకాదు వారితో చేసిన ప్రమాణాల్ని మరిచిపోతావు. నన్నుకాని నామిత్రుల్నికాని మీ రెవ్వరూ తాకరాదని షరతు లేదా?"

"నేనా షరతు ఎట్లా భంగపరిచానో అర్థం కావడంలేదండి"

"సాయంకాలం ఆల్బర్ట్ డి మార్సెర్ఫ్ ని పట్టి ఇక్కడికి తీసుకువచ్చావు ఆ యువకుడు నా మిత్రులలో ఒకడు నేనున్న హోటల్లోనే అతనూ బసచేశాడు. నా బగ్గీలోనే రోమ్ నగరమంతా తిరిగాడు. అయినా అతన్ని మన్నించక, పట్టి తీసుకువచ్చావు అందరిమాదిరిగానే అతని ప్రాణాలపైన పణం పెట్టావు" అన్నాడు మాంటే క్రిస్టో. అంటూ జేబులోని ఉత్తరంతీసి వాంపాకి అందించాడు.

నాయకుడు దొంగలవైపు తిరిగి, "ఈ సంగతి నా కెందుకు చెప్పలేదురా?" అన్నాడు రోషంతో. దొంగలు భీతితో వెనక్కి వెనక్కి తగ్గారు. "నేను కౌంట్ కిచ్చినమాటభంగపడేలా ఎందుకు చేశారు? మనందరి ప్రాణాలూ ఆయనగుప్పిటలో ఉన్నాయని తెలియదా మీకు? మీలో ఎవరైనా తెలిసే ఈ పనిచేసినట్లయితే, వాడి బుర్ర ఒక్క దెబ్బతో పగలకొడతాను చెప్తుంటి"

మాంటె క్రిస్టో ఫ్రాంజ్ వంక తిరిగి అన్నాడు; "విన్నారా? నాకు తెలుసును. ఎక్కడో పొరపాటు జరిగిఉంటుంది."

"మీరు ఒంటరిగా లేరా?" అన్నాడు వాంపా, ఆందోళనతో.

"నువ్వు ఎవరికైతే ఈ ఉత్తరాన్ని పంపావో ఆయన నున్నాడిక్కడ. లూగీవాంపా ఇచ్చినమాట నిలబెట్టుకునేవాడని అతనికి నిరూపించాలని నా ఉద్దేశం. ఫ్రాంజ్! ఇటు రండి. లూగీ వాంపా స్వయంగా మిమ్మల్ని క్షమార్పణ కోరుకుంటాడు."

ఫ్రాంజ్ ముందుకు వచ్చాడు. లూగీ అతన్ని సమీపించి ఇలా అన్నాడు: "మిమ్మల్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాను. కౌంట్ చెప్పినది మీరు విన్నారుకదా! నా జవాబు కూడా విన్నారు. నాలుగువేల స్పానిష్ డాలర్ల కోసం ఇటువంటి దన్నడూ చేసేవాడిని కాదు. అటువంటిది నావల్ల జరగదు."

"కాని ఆల్బర్ట్ ఎక్కడ? ఎక్కడా కనిపించడంలేదే?" అన్నాడు ఫ్రాంజ్.

సహారా ఉన్నవైపు చేతితో చూపి వాంపా ఇలా చెప్పాడు. "అక్కడున్నారు. నేనే వెళ్లి స్వయంగా తీసుకువచ్చి విడిచి పెడతాను." వాంపా సహారాదగ్గరకు వెళ్లి అడిగాడు "ఖైదీ ఏం చేస్తున్నాడు?" మాంటె క్రిస్టో, ఫ్రాంజ్‌లు అతన్ని అనుసరించి వెళ్లారు.

"అదే మా తెలియదండి. గంటసేపటినించి అతను కదిలిన చప్పుడైనా కాలేదు" అన్నాడు సహారా.

"రండి. లోపలికి రండి" అన్నాడు వాంపా. చిన్న కాగడా వెలుగులో చూశారు. ఒక మూల కంబళి కప్పుకుని ఆల్బర్ట్ గాఢనిద్రలో మునిగిఉన్నాడు.

మాంటె క్రిస్టో నవ్వాడు: "బలే! బాగుంది! పొద్దున్న ఏడు గంటలకి చచ్చిపోవలసిన మనిషిని చూడండి!"

వాంపా ఆల్బర్ట్ వంక ప్రశంసాపూర్వకంగా చూశాడు. ఇటువంటి మనస్థైర్యానికి వాంపాకూడా ఆశ్చర్యపడ్డాడు. "మీరు చెప్పింది నిజం" అన్నాడు "ఈయన తప్పకుండా మీ మిత్రుడే."

వాంపా ఆల్బర్ట్‌ని సమీపించి భుజంతట్టి లేపాడు. "లేవండి" అన్నాడు వాంపా. ఆల్బర్ట్ చేతులు చాచి ఆవలించి కన్నులు నులుముకుని లేచాడు. "ఓ! మీరా" అన్నాడు వాంపాను చూసి. "అయ్యో. నన్ను మరి కొంతసేపు నిద్రపోనివ్వవలసింది. ఎంత చక్కని కల వచ్చింది! కౌంటెస్ జి—తో కలిసి నేను నృత్యం చేస్తున్నాను సుమా!" అంటూ జేబు గడియారం తీసి చూశాడు. "ఒంటి గంటన్నరే అయింది! అరె! ఇటువంటి వేళ లేపారెందుకు?"

"మిమ్మల్ని విడిచిపెట్టడానికి."

ఆల్బర్ట్‌కి ఎలాంటి భావపరివర్తనం కలగలేదు. అతిసహజంగా అన్నాడు: "బలే వాడవ! ముందుకైనా నెపోలియన్ చెప్పిన మాటలు మరిచిపోకండి. 'చెడువార్తలు చెప్పవలసినప్పుడు తప్ప నిద్ర చెడగొట్టవద్దు' అన్నాడు. అయితే నా ప్రాణానికి పెట్టిన పణం చెల్లించారన్నమాటేనా?"

"లేదండి. కాని ఏదడిగినా ఎవరికి నిరాకరించలేనో, వారు వచ్చి మిమ్మల్ని విడిచిపెట్టమని అడిగారు."

"నిజంగా? అయితే ఆయనెవరో కాని మంచి ఉదార బుద్ధికలవాడై ఉండాలి." అంటూ ఆల్బర్ట్ చుట్టూ చూశాడు. ముందు ఫ్రాంజ్ కనపడ్డాడు. "అరె! నువ్వా ఫ్రాంజ్! నీ స్నేహ ఫలితమేనా ఇది?"

"కాదు నేను కాదు" అన్నాడు ఫ్రాంజ్. "మన పొరుగు నున్న మిత్రుడు; కౌంట్ ఆఫ్ మాంటె క్రిస్టో."

"ఓహో! మీరా?" అన్నాడు ఆల్బర్ట్ ఉత్సాహంతో. "నిజంగా మీ దయ అపారం! నేను శాశ్వతంగా మీకు ఋణపడిపోయాను– బగ్గీ ఇచ్చినందుకు, తరువాత దీనికీ" అంటూ ఆల్బర్ట్ స్నేహపూర్వకంగా చెయ్యి అందించాడు. మాంటె క్రిస్టో అందుకున్నాడు. కొద్దిగా అతనికి చెయ్యి కంపించింది. వాంపా ఈ దృశ్యాన్ని అత్యాశ్చర్యంతో చూస్తున్నాడు. ఆల్బర్ట్ ఫ్రెంచిజాతీయుల గౌరవాన్ని నిలబెట్టినందుకు ఫ్రాంజ్ ఆనందభరితుడైనాడు. ఇలా అన్నాడు "ఆల్బర్ట్! త్వరగా పోదామా! కౌంటెస్ జి—ఇంట్లో విందు కింకా వేళ ఉంది. మనంఅందుకోవచ్చు. లూగీ వాంపాపట్ల మనస్సులో ఎలాంటి విరుద్ధభావం పెట్టుకోకు. నిజంగా ఆయన నిజాయితీపరుడు సుమా!"

"నువ్వు చెప్పింది నిజం. మనం ఇప్పుడు వెంటనే బయలుదేరితే విందుకి అందుకోవచ్చు." తరవాత వాంపావైపు తిరిగి "నేను వెళ్ళడానికి ముందు తీర్చవలసిన వేవైనా ఉన్నాయా?"

"ఏమీ లేవండి. మీ కిప్పుడు పూర్తిస్వేచ్ఛ లభించింది."

"అయితే పదండి" అంటూ ఆల్బర్ట్ వెంటనే బయలుదేరాడు. అతని వెనుక మాంటె క్రిస్టో, ఫ్రాంజ్ నడిచారు.

"పెపినో" అని పిలిచాడు వాంపా. "ఆ కాగడా? నా చేతి కియ్యి. నేనే దారి చూపుతాను" అని మాంటె క్రిస్టో వంక తిరిగి "కనీసం ఈ గౌరవమైనా చూపగలను" అన్నాడు

కాగడా తీసుకుని వాంపా ముందు నడిచాడు. ద్వారం సమీపించగానే ఇలా అన్నాడు: "కౌంట్! మరోసారి క్షమించవలసిందని కోరుతున్నాను. మీరు నాపైన మనస్సులో ప్రతికూల భావం పెట్టుకోవద్దని ప్రార్థిస్తున్నాను."

"లేదు వాంపా. చేసిన తప్పుల్ని ఒప్పుకొనే పద్ధతి చూస్తే, ఇటువంటి అవకాశం లభించినందుకు ఎవరైనా సంతోషిస్తారు."

వాంపా యువకు లిద్దరివైపూ తిరిగి ఇలా అన్నాడు: "మీ[illegible] నచ్చకపోవచ్చును కాని, నన్నెప్పుడైనా చూడగోరినట్లయితే నేనెక్కడున్నా సరే, మిమ్మల్ని హృదయపూర్వకంగా సత్కరించగలను."

ముందు మాంటె క్రిస్టో నడిచాడు. తరవాత ఆల్బర్ట్ అనుసరించాడు. ఫ్రాంజ్ కొద్దిగా తటపటాయించాడు. వాంపా అది చూసి "మీ కేదైనా అడగదల్చుకున్నారా?" అన్నాడు.

"అవును. మేము వచ్చేముందు మీరంత శ్రద్ధతో చదువుతున్న గ్రంథ మేమిటి?"

"అది సీజర్ వ్యాఖ్యానసంపుటి. ఆ గ్రంథమంటే నాకు అత్యంత ప్రీతి"

ఆల్బర్ట్ మాంటె క్రిస్టోతో ఇలా అన్నాడు. "మనం త్వరగా వెళ్లిపోవాలి. నాకు విందుకు వెళ్లాలని [illegible]"

యువకు లిద్దరూ విందుకు వచ్చేసరికి సరిగ్గా రెండు గంటలయింది. ★

న్యాయాధికారి: నిన్ను నమ్మిన వాళ్లను ఎట్లా మోసం చేశావు?

ముద్దాయి: నమ్మనివాళ్లని మోసంచెయ్యటం ఎట్లాగండీ;

Regd No M 4479



గాంధీమహాత్ముని

ఆత్మకథ

రెండుసంపుటములు

చతుర్థముద్రణము

★

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి

అనువాదము

★

ఖద్దరుబైండు

ప్రతిసంపుటమునకు పోస్టేజితోసహా వెల రూ. 5-6-0

ఒకేసారి 2 సంపుటములు పోస్టేజితో రూ 10-12-0

ఆంధ్ర గ్రంథమాల

పోస్టుబాక్సు 212, మదరాసు

Edited Printed & Published by S Sambhu Prasad at the Andhra Patrika Press 7 Thambu Chetty St Madras